

భారతి

వ్యవస్థాపకులు

దేశోద్ధారక నాగేశ్వరరావుపంతులు

జనవరి 1976

వెల రూపాయిన్నర

భారతి

మాసపత్రిక

*

శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938-1972)

*

జనవరి 1976

సంపుటము : 53

సంచిక : 1

విడిప్రతిక వెల రూపాయిన్నర

అందరం కలిసి మెలిసి....

దేనికైనా ఒక ప్రణాళిక లేకుంటే కుటుంబంలోనే జరగదే, దేశం మొత్తంమీద ఎలాజరుగుతుంది?

మన రాష్ట్రంలో మొదటి పంచవర్ష ప్రణాళికలో ఖర్చు చేసిన రూ. 97 కోట్లు ఎక్కడ, నాలుగో ప్రణాళికలో ఖర్చు అయిన రూ. 419 కోట్లు ఎక్కడ?

5 వ ప్రణాళిక ఖర్చు అంచనా రూ. 1105 కోట్లు, ప్రణాళికా సంఘం మంజూరు చేసింది.

అందరం కలిసి మెలిసి అభివృద్ధి సాధించుకుందాం.

సమాచార, పౌరసంబంధ శాఖ, హైదరాబాదు.

3/75-76

స్వవిషయం

భారతి విజయవాడనుంచి వెలువడటం మొదలుపెట్టి ఇంచుమించు ఏడాది కావస్తోంది. కొన్ని దశాబ్దాలపాటు ఒకచోట ఉండి మరొక చోటుకి మారటం వలన ప్రచురణలో ఇబ్బందులు కొన్ని ఏర్పడ్డాయి. వీటిని తొలగించి పత్రికని సక్రమంగా వెలువరించటానికి చెయ్యగలిగిన ప్రయత్నాలన్నిటినీ చేస్తున్నాము. పాఠకులు సహృదయంతో వ్యవహరించవలసినదిగా కోరుతున్నాము. ఏ సాహిత్య మాస పత్రిక "విలువ" అయినా ఆ పత్రికకి రాసేవారిమీద చాలావరకు ఆధారపడి ఉంటుంది; రచనలు చేసేవారి ఉత్సాహానికి తగిన అవకాశాలు కల్పించటం పత్రిక కర్తవ్యం. ఈ విషయంలో లోటు చెయ్యకుండా ఉండటానికి భారతి ఎప్పుడూ ప్రయత్నిస్తూనే వచ్చింది. భారతి ప్రయత్నాలు ఇకముందుకూడా నిరాటంకంగా కొనసాగగలవని నమ్ముతున్నాము. రచయితలు, రచయిత్రులు ఎప్పటిలాగే హృదయపూర్వకంగా తోడ్పడినట్లయితే మా నమ్మకం వ్యర్థం కాలేదు. శాసనాలు, వ్యాకరణం, అలంకార శాస్త్రం మొదలయిన వస్తువులమీద వ్యాసాలకి ఒకప్పుడు ప్రచురణకి లేని అవకాశాలు కొన్ని ఇప్పుడు ఉన్నప్పటికీ చదువరులు భారతిద్వారా ఎన్నో విషయాలు తెలుసుకొనటానికి వీళ్లు కల్పించ గలమనే అనుకుంటున్నాము. అయితే, ఇంతకిముందు ఎన్నోసారులు మేము మనవి చేసుకున్నట్లు భారతకి రాసేవారు ఇతర వస్తువులకి కూడా తగిన గుర్తింపు ఇస్తే బాగాఉంటుంది. ఎప్పటికప్పుడు ఆధునిక దృష్టితో పరిశీలించి రాయవలసింది ఎప్పుడూ ఏదో ఉంటూనే ఉంటుంది. ఈ దృష్టి కవిత్వం, కథలకి పరిమితం అయి ఉండనక్కర లేదు. మనచుట్టూ ప్రపంచంలో "సాహిత్య దృష్టి" తో చూడదగినవి ఎన్నోఉన్నాయి. తెలుగు పాఠకులకి కేవలం సమాచారం అందచెయ్యాలనే ఉద్దేశంతో మాత్రమేకాక వారిలో ఆలోచనలని ప్రేరేపించి చర్చలకి దారితీసే రచనలు చెయ్యాలని మరొకసారి రచయితలకి, రచయిత్రులకి మనవి చేసుకుంటున్నాము. తెలుగు భాషద్వారా అన్ని విధాలుగ నూ సాహిత్య సేవ చెయ్యడమే భారతి ధ్యేయం

విషయానుక్రమణిక

జనవరి 1976

శ్రీరస్తు - అవిఘ్నమస్తు

శ్రీ ఎన్. వెంకటరమణయ్య

ఆంధ్రదేశమును నాళిన దొరల
కథల నన్నిటిట దెల్పెదను—

దేవళ్లు :-

వినాయకునకును మ్రొక్కెదను
విఘ్నరాజునకు మ్రొక్కెదను
నారాయణునకు
నళినాక్షునకును
పార్వతీశునకు
పరమేశ్వరునకు
బ్రహ్మకు మానసపుత్రులైన యా
నవబ్రహ్మలకు నందరికీ
లక్ష్ము దేవికి
సరసోతతమ్మకు
కొండలరాయని కూతురికీ
అందరికిని చేమోడ్చితి నిప్పుడు
ఆదరించుడని కోరుదునూ
చయ్యంగా నా కోర్కె దీర్పుడు
తల్లులార మీ దయచేత

సంస్కృత కవులు :-

వాల్మీకయ్యను వ్యాసమహర్షిని
కాళిదాసుని కవీతల్లజుల
భావుక ధావక భాసులనూ
భవభూతయ్యను పాండ్య సుందరుని
నాగార్జునులను నారాయణునికి
భట్టబాణుని ప్రభాకరులను
తక్కుంగల గీర్వాణుల నెల్లను
తప్పకనిట జింతింతు భజింతున్

కర్ణాటక కవులు :-

పంపని పొన్నని రన్నని జన్నని
బహుళంబగు కర్ణాట కవులను
ఆద్యుల పూజ్యుల నందఱను
గణుతింతు నుతింతు దలంతును నిచ్చట
నా కార్యము నెరవేరుటకొఱకై

ఆంధ్ర కవులు :-

ఆంధ్ర సరస్వతి నవనికి దెచ్చిన
ఆద్యుల పూజ్యుల నందఱిని
నారాయణుని నన్నయభట్టును
సోమన్నలను సూర్య కవీశ్వరు
శంభుదాసులను శంకర కవినీ
శ్రీనాధుని మాసిరిగిరినాధుని
అమరేశ్వరుని యంబికాధవుని
పోతరాజును పురుషోత్తముని
పెద్దన్నను దిమ్మనను పిన్నన
మహాప్రధాని యప్పాజి దిమ్మరసు
శౌర్యవదాన్య పరాక్రమములందు
విక్రమార్క శ్రీ విక్రమభోజుల
నధఃకరించిన యాంధ్రభోజుని
కృష్ణాంశుడగు కృష్ణరాయలను
రామకృష్ణుని రామభూషణుని
సన్నుతికెక్కిన సత్కవీశ్వరుల
సన్నుతింతు వినుతింతు నుతింతున్
నా కావ్య మనాటంకమనడువగ
కవి బ్రధ్నులను కావ్యభాస్కరుల
సేవింతును స్మరింతు దలంతున్

మధ్యయుగము, తురకల యాగమనము :-

ఇదిన్నారయ్యా ఇగా కతను
కన్నారయ్యా మా యెతను
మధ్యయుగపు మా చరితములో
వచ్చిరి తురకలు వచ్చిరయా
వ్రచ్చిరయా మా భూములనెల్లను
క్రొచ్చిరి కులగిరులను సర్వము
వచ్చెములేదు వారి సేతలకు
వచ్చిరయా మఱి వచ్చిరయా
ఎచ్చటనుండియో యేనాదులవలె
అనాధ ప్రేతంబులవలెను
వందలు వేలు లక్షలు కోట్లు
అర్బుదంబులూన్యర్బుదంబులు
నాద్యంతముల నెఱుగని మూకలు
గుంపులు మందలు కోహళులూ
వాళ్ళు కూలెను వీళ్ళు పగలెను
ఊళ్ళు తగలెను పురములు బొగసెను
అగ్గిని పాలయి బుగ్గి బూరలై
గార్దభంబులకు తీర్థములై
బాపనాట మఱి సాగలేదయా
బ్రహ్మ సృజించిన భూప్రపంచమున
సమసిరి రాజులు పొలసిరి భోజులు
నెట్లు కలసరి మట్లోపలను
సూద్దురు లెల్లను భూద్ధరిత్రిలో
పూడిపోయిరి పొడవడకా
పొలముల దున్నె భూమికాపులు
పత్తాలేక పాటిపోయిరి
పొలములు యెండెను పైరులు పండెను
దారిదోపిడులు తఱచైపోయెను
బందిపోటులు బలసిపోయెను
లడవులపాలై రదవదనందుచు
జనులును మునులును మనుగడ లెఱుగక
కాలయవనుడు కటికతురకయ్యొ
అల్లావుద్దీనైనాడూ

AD 1295

దేవగిరికి వచ్చాడూ
రామదేవుని కొట్టాడూ
భార్యా కూతుల బట్టాడూ
కమ్లాదీని కన్నాడూ
దేవళ్లి నిల్కించినాడూ
వారి కరగ్రహ మర్పించాడూ
దేవగిరిని గైకొన్నాడూ
దయ్యపు కొండగ జేశాడూ
అయ్యత్రొయ్యల్దిన్పించాడూ
జున్నారుల్దెగదెంపించాడూ
స్వర్ణత్కల్యాణాల్పాగించినాడూ
బాపల్ సయ్యదు లయ్యిరీ
అయ్యాల్ మియ్యాలైయ్యిరీ
రాజులు షేకులైయ్యిరీ
సెర్లి సెయిలులయ్యిరీ
ఆధముల్హా ల్కామల్కలే

* *

AD 1309—10

అల్లావద్దీ నంపారూ
మల్కిక్నేమీని మాబల్కు
దండుతో దయచేశాడూ
అప్పటి పాండ్యరాజ్యస్థితియెట్లుండెననగా, పై సంవత్స
రమున నిమ్మడి కులశేఖర మహారాజు పుత్రులు భూ
కాంత కారణముగ భూప్రపంచమును విడనాడి
స్వర్గసీమకు ప్రయాణము జేసినాడు—

అతనికి బుత్రులిద్దరు, ముమ్మడి సుందర పాండ్యుడు, ప్రథమ వీరపాండ్యుడు. ఆనాడు పాండ్య సామ్రాజ్యము బహునాయకముగ సాగుచుండినది. అందఱు రాజపుత్రులును పాండ్యవంజులె. ఇమ్మడి మారవర్మ కులశేఖరుడు సర్వాధికారియై పాలించుచుండెనేమొ—తత్కారణముననే సర్వాధికారము కొఱకు ఆతని పుత్రులమధ్య తకరరు నడచినట్లున్నది. సుందర పాండ్య వీరపాండ్యులు కొట్లాడుకొన్నారు. అప్పుడు సుందరపాండ్యుడు దేహళీపుర సురత్రాణుని సాయమర్థించినాడు. తన్ను పాండ్యసామ్రాజ్యాధిపతిని గావింపుమని—కప్పం కడ్తానన్నాడు. తలయొగ్గి దాసోహమన్నాడు. అల్లావుద్దీన్ తన ఖోజ్జాలలో శ్రేష్ఠతముడైన మల్లిక్‌నాయబుకాపూరు నా కార్యము నెరవేర్చుమని నియోగించినాడు. ఇది క్లుప్తముగ జెప్పవలయునన్న అప్పటి పాండ్య సామ్రాజ్య చరిత్రము. ఇక ప్రస్తుతము ననుసరింతము—

ఖయుఖు వెడలెనయ దేవగిరినుండి

తురకలదండు ధూముధామనుచు
దోరసముద్ర ముద్రమునకు దరలెనయా

అప్పుడు దక్షిణ దేశమునకు దండునడపుటకు రెండు భారీమార్గము లుండినవి. ఒక్కటి తెలంగాణ తీరాంధ్రముల మీదుగ తొండెమాడలు చోళ పాండ్య కేరళములకు బోవునది. రెండవది కర్ణాటక మూలముగ కేరళ కొచ్చి తిరువనంతపురములకు బోవునది. మొదటి మార్గము కాకతీయ ప్రతాపరుద్రుని పరాక్రమము మూలమున తురకలకు బందయినది.

A D 1303 నందు

అల్లావద్దీన్ సుల్తాన్ గారొకి
దండును దక్షిణమంపారు
తెలంగాణమును తీరాంధ్రమును
దెక్కలి సేయుట కంపారు
గుజ్జపు తురుపు తుట్టెలుకలు
లెక్కలేని కోటానుకోటులు
దుమ్ముమేఘములు దుందుమారములు
యాడకాడనే పొడకట్టినవి
కాలయముణ్ణో కాల్చుక మోసవిన
మల్లిక్ ఫకురుద్దీను జూనా
వారికి నాయకుడయ్యాడూ
వచ్చిరి వారందఱు వైళమె
సబ్బినాటికి చక్కగనూ
వోరుగంటిలో నున్నాడయ్యా
కాకతీయుల కడపటి రాజా
ప్రతాపరుద్ర ప్రతాప భానుడు
తొమ్మిది లక్షల తురుపు దొరులకు
వీరులు శూరులు విక్రమార్కులు
దొడ్డవారగుదునేదారులకు
అధికారయ్యా యందరకూ
తురకలు దేశము జొచ్చిరనీ
వార్తలు వచ్చి చేరినవి
రుద్రభూపతీ కోపోజ్వలుడై
రుద్రుని రూపము జూపాడూ
సేనానాధుడు సింగమనేడు
సీతువరలా సింగమనేడు
అన్నారెడ్డి పొన్నారెడ్డి
కాటమరెడ్డి కోటమరెడ్డి
పేటలనేలే పెద్దారెడ్డి
కార్థానాల కాటమరెడ్డి
నూకారెడ్డి మేకారెడ్డి
రేయికి రేయే వచ్చారు
తూరుపునాటి చోళరాజులు
రాయలసీమ రాజులందరు
చంద్రవంశ చాళుక్య రాజులు
సోమవంశీ సోమదేవుడు
కొటికంటి శ్రీ రాఘవరాజు
వేంగీదేశపు వెంగమరాజు
కోనేటిపురపు కొండలరాజా
ఏరువనేలే వెంగమరాజు
కామరాజు కామేశ్వరరాజు
బవభక్తుడు శ్రీ భక్తిరాజా
మునుసూర్నేలే ముదుసర్లూ
పోలయకాపయ భూపతినీర్లు
అందరు చేరిరి యనుమకొండకు
ప్రతాపదేవునీ పజ్జకూనూ
ఏమి సెలవు మమ్మేలిన సామీ
తురక యేడ దూదేకేడే
అని గర్జించిరి యైక్యముగ
హసించినాడూ ఆ మహారాజా
ఉప్పరిపల్లెకు ఉరకండయ్యా
శత్రువులైన సాయబు లెల్లరు
ఆడనె యాగియున్నారూ
ముక్కాములలో హుక్కాల్దాగుచు
వాగుచు వీగుచునున్నారూ
నాయకులందరు నవ్వారూ
హర్‌హర్ మహ్వోవన్నారూ
గజదళాలు కదిలినవీ
తురంగ తరంగల్ దూకినవీ
రస్తు మస్తుగా సాగినది
వంబనాలు తరలినవీ
గడలవారూ కడతల్ వారూ
ఈటెలవారు పోటులవారూ
విలుకాండ్రు సింగాణికాండ్రును
అన్నివిధాల ఆయుధకాండ్రు
పంగరభూమికి సాగారూ

ఆడుచు పాడుచు నవహసించుచూ
గేలి సేయుచును కేరడించుచును
గంతుల్ వేయుచు రంతుల్ పలుకుచు
పాలికలనికిని పుణ్యభూమికిని
బయల్వెడద యపదలు పరలుగ

*　　*　　*

ఆరదముదోలె అరుణదేవుడు
తలచూపారు ధళధళమనుచును
ఏడుగుఱ్ఱము లెగసినవీ
ఏరేడుయోజనా లెగసినవీ
పురుహూతునియిల్లాలి బొట్టునగ
కనుపించెనయా కమల మిత్రుడు
పొడుపుకొండపై ప్రొద్దునవే
తురకదండు దూదేకే దొరలు
మేలుకనిరయా మలక లెల్లరు
తురకదొరలు దూదేక మియాలు
అల్లాస్వామిని అరశారూ
అల్లకె నామ్కరన్నారూ
రసూల్ గారిని రహమాన్గారిని
పైగంబరులలో ప్రథమాచార్యుని
తలచి తలంచి తరతరములుగ
మక్కావైపుగ జక్కగ దిరిగి
మోములు భువిపై మోదుచునూ
ఫతహ్మదే కాఫరులారా
పైగంబరుగారి ప్రథమ శిష్యులము
అని గర్జించుచు నాయుధముల్ గొని
కవసిరి కాపరు దళములపై

ఈటెల నీటెలు మీటినవీ
కత్తుల కత్తులు కలసినవీ
గదలను గదలూ గదిసినవీ
విండ్లను విండ్లు విరుగాడినవీ
గుఱ్ఱాల్కు గుర్రాల్కూడినవీ
గజాలు గజాల గాడినవీ
ఎక్కటి లెక్కటుల మీదెగశారూ
సంగడికాండ్రూ చచ్చిరీ

*　　*

పోరు ఘోరమై పాసగినదీ.
వీరుల్ విరిగి పోఱారూ
వాలు కేల గొని రుద్రదేవుడూ
వైరులమీదికి దుమికాడూ
అంగరేకులు లెంకజోదులు
అనుగులెల్ల గుమిగూడారూ
భండారపూ శ్రీహరి యపదేవుడు
ప్రక్కలో బలిసి నిలిచాడూ
ఫణిహారి శ్రీ బుక్కరాయడూ
బలిత కత్తిని బట్టారూ
ఎదురై తాకిన జూవాఖానుడు
మోములు నడియల కురిశాడూ
తురకల్ చుట్టూ దుమికారూ
అరివీరులను అదిమారూ
ఆంధ్రు లనేకులు అణగారూ
తురకల్ దురమున తూలారూ
రక్తము రణమున పారింది
హిందూ ముస్లిమ్ సమ్మేళనము
యేకాండమ ప్రవహించినదీ
నేలటూరి శ్రీ వెంకటరమణుని
రాయనామ చరితావళిలో
ప్రథమంబగు పవేశ గుళుచ్ఛము
ప్రజలారా యో పజలారా
జనులారా మునులారా.

భారత రాజ్యాంగ రజతోత్సవము

[1950 - 1975]

శ్రీ కాకుమాను తారానాథ్

మానం 3 సంవత్సరాల క్రితం భారత స్వాతంత్ర్య రజతోత్సవాన్ని, మహా యోగి అరవిందుల శతజయంత్యుత్సవాన్ని, ఆంధ్రకేసరి శత జయంత్యుత్సవాలనీ జరుపుకున్నాం. కాని 1975లో ఇంకొక విశేష ముంది. అదే మన ప్రజాస్వామిక గణతంత్ర రాజ్యాంగపు రజతోత్స వము. ఈ సంవత్సరంలోనే అత్యయిక పరిస్థితి ప్రకటించబడడం ఇంకొక విశేషము.

ఈ సందర్భంలో మన రాజ్యాంగ నిర్మాణ విశేషాలను గూర్చి, దానికిగల పృష్ఠభూమిని (బాక్‌గ్రౌండ్) గురించి తెలుసుకోవటం ఆసక్తిదాయకం.

భారత జాతీయ కాంగ్రెసు తన శైశవాస్థను దాటిన తరువాత రాజ్యాంగంకోసం, ముఖ్యంగా ప్రాథమిక హక్కులకోసం, ఆందోళన సాగించింది. 1925లో శ్రీమతి అనిబిసెంట్ కామన్వెల్త్ ఆఫ్ ఇండియా బిల్‌ను ప్రతిపాదిస్తే, 1927లో మద్రాసు కాంగ్రెసు మౌలిక హక్కులను గురించి ప్రకటించాలంటే, పండిట్ మోతీలాల్ నెహ్రూ రిపోర్టు, ఆయన తయారుచేసిన రాజ్యాంగం వీటినింకా విస్తృతం చేశాయి. 1930 జనవరి 26 తీర్మానం, 1931 కరాచీ కాంగ్రెసు తీర్మానాలు వీటిని బలపరిచాయి. 1945లో సప్రూకమిటీ తీర్మానము, మైనారిటీ హక్కులను గురించి, ప్రాథమిక హక్కులను గురించి సలహా సంఘముండాలంటూ, 1946లో కాబినెట్ మిషను సూచించింది. ఇంత చరిత్ర తరువాత మన రాజ్యాంగమొక రూపును దాల్చింది.

మహాత్ముని ఆదేశానుసారం, రాజ్యాంగ నిర్మాణ సభకు సభ్యుల నెన్నుకోవటంలో అతి విశాల దృక్పథాన్ననుసరించి, కాంగ్రెసుకుచెందని అనేక అతిరథ మహారథుల నెన్నుకున్నారు. సర్ అల్లాడి, డాక్టర్ అంబేద్కర్, సంతానం, బి. యన్. శివరావు, హృదయనాథకుంజ్రూ, ఆనాటికింకా హిందూ మహాసభకు చెందిన డాక్టర్ శ్యామప్రసాద ముఖర్జీ, యం. ఆర్. జయకర్‌బోటి వారందులో సభ్యులయ్యారు. బి. యన్. రావు రాజ్యాంగ సంబంధ సలహాదారు డయ్యాడు.

1946 డిశెంబరులో ఏర్పడిన ఈ రాజ్యాంగ సభకు, రాజ్యాంగ నిర్మాణ బాధ్యత అప్పగింపబడింది. 1947 జనవరి 22న ఈ రాజ్యాంగ నిర్మాణసభ ఒక తీర్మానంద్వారా ఈ దేశంలో రాజ్యానికున్న సర్వాధికారాలు, రాజ్యాంగాలకు గల అధికారాలు, ప్రభుత్వానికి గల అధికారాలు—సర్వమూ ప్రజలనుండే పొందాయని పక్కాణింపబడింది.

అంతకుముందు, 1948 డిశెంబరు 10న ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ మానవ హక్కులను గురించి ఒక తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది.

ఇలా తయారైన రాజ్యాంగాన్ని మనమే, మనకు, 1949 నవంబరు 26న ఇచ్చుకున్నాం. అమెరికన్ రాజ్యాంగంలో కూడా దాదాపు ఇలాంటి మాటలే వాడబడ్డాయి. ఈ మాటలను వ్యాఖ్యానిస్తూ, అమెరికా ప్రధాన న్యాయమూర్తి మార్షల్ రాజ్యాంగం ఒక డాక్యుమెంటుగా 1787 నాటి తరానికి చెందినా, ఒక చట్టంగా—'లా'గా ప్రస్తుత తరంచేత గౌరవింపబడుతుందనీ, కాబట్టే ప్రస్తుత పరిస్థితుల కనుగుణ్యంగానే, ప్రస్తుత సమస్యలను దృష్టిలో ఉంచుకునే రాజ్యాంగాన్ని వ్యాఖ్యానించాలన్నాడు.

మన లిఖిత రాజ్యాంగం అమలులోకి రావటం 1950 జనవరి 26 అయితే జనవరి 28న సుప్రీంకోర్టు ప్రారంభింపబడింది. దేశంలో హైకోర్టు లంతకుముందూ ఉన్నాయి, తరువాత ఉన్నాయి. కాని ఫెడరల్‌కోర్టు స్థానంలో సుప్రీం కోర్టు వచ్చింది. భారతీయ నిపుణలచేత, కూలంకషగా చర్చించిన తరువాత వ్రాయబడిన దీ రాజ్యాంగం. అప్పటికే అనేక లిఖిత రాజ్యాంగా లుండటంచేత నాటి అనుభవాలు, అందులోని కొన్ని విశేషాలు సంగ్రహింపబడ్డాయి, అంతే.

* * *

మన రాజ్యాంగంలోని కొన్ని విశేషాల నిక్కడ చెప్పుకోవటం అవసరం. ప్రపంచంలోని లిఖిత రాజ్యాంగాలలో అమెరికన్ రాజ్యాంగం చాలా ప్రాచీనమయింది. దాని కొక ప్రాధాన్యత ఉంది. అప్పుడే బ్రిటిష్ పరిపాలన నుంచి బయటపడ్డవారు, ప్రజాప్రతినిధులతో

కూడిన సభలు కూడా ఏ విధంగా అధికారాన్ని విస్తరింపజేసుకుని, ప్రజల హక్కుల మీద దండయాత్ర జరిపేది అర్థంచేసుకున్నారు కాబట్టి, ప్రజలకు పరిపాలనా యంత్రాంగం (ఎక్జిక్యూటివ్) నుంచే కాకుండా, శాసనసభా యంత్రాంగం (లెజిస్లేటివ్) నుంచి కూడా రక్షణ ఉండాలని భావించారు. ఆ విధంగా ఆ రాజ్యాంగ నిర్మాణం జరిగింది.

అయితే వారు పునాదులను మాత్రమే నిర్మించి, రాజ్యాంగం సజీవమైనదిగా ఉండాలని ఆశించారు. 1791లో, 5వ సవరణ ద్వారా "డ్యూప్రాసెస్ ఆఫ్ లా" అనే పదం చేర్చబడింది. వెంటనే 19వ శతాబ్దపు మొదటి దశాబ్దంలో ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జాన్‌మార్షల్ నాయకత్వాన సుప్రీంకోర్టు ప్రతి శాసనాన్ని ఈ ఒరిపిడి రాయిమీద పరీక్షించే అధికారాన్ని భుక్తం చేసుకుంది. వివిధ కాలాలలో వివిధ తరహాలుగా ఈ 'డ్యూప్రాసెస్ ఆఫ్ లా' వ్యాఖ్యానింపబడుతూ వస్తున్నది.

మన రాజ్యాంగం కూడా ఈ బావాన్ని తీసుకుంది. అయితే మనం 21వ అనుచ్ఛేదం (ఆర్టికల్)లో ఈ పదాల బదులు 'ప్రొసీజర్ ఎస్టాబ్లిష్‌డు బైలా' అని వాడబడింది. ఇది జపనీస్ రాజ్యాంగంలో నుంచి తీసుకోబడిందని విజ్ఞుల అంచనా. మన ప్రాథమిక హక్కులకు సంబంధించిన అనుచ్ఛేదాలన్నీ అమెరికన్ రాజ్యాంగంలోని మొదటి పది సవరణలు ఆధారంగా నిర్వచింపబడ్డాయి. వీటిని అమెరికన్ రాజ్యాంగంలో 'బిల్ ఆఫ్ రైట్స్' అని పిలుస్తారు.

మనం 'డ్యూప్రాశెస్ ఆఫ్ లా'ను కాదనటానికి ఒక కథ ఉంది. ఈ మార్పు ముఖ్యంగా రాజ్యాంగ రచనా సలహాదారుడైన శ్రీ బి. యన్. రావు జోక్యం ఫలితం. 1947 అక్టోబరు తరువాత శ్రీ బి. యన్. రావు అమెరికా, కెనడా, ఇంగ్లండ్, ఐర్లెండులు తిరిగి వచ్చాడు. అమెరికాలోని న్యాయమూర్తి ఫ్రాంక్‌ఫర్టర్ యొక్క అభిప్రాయం బి. యన్. రావును ప్రభావితం చేసింది.

రాజ్యాంగ రంగంలో మనదొక మధ్యేమార్గము. బ్రిటన్‌లో వలె పార్లమెంటు సర్వాధికారాన్ని అంగీకరించలేదు, అమెరికాలో వలె సుప్రీకోర్టు సర్వాధికారాన్ని అంగీకరించలేదు. మధ్యేమార్గ మవలంభించి ఎవరి పరిధులను వారి కేర్పరచటం జరిగింది.

* * *

తరువాతి ప్రశ్న—నేడు సుప్రీంకోర్టు తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించగలుగుతున్నదా అన్నది. నేడు అనేకమంది రాజకీయ నాయకులు సూటిగా ప్రజలమీద విసరుతున్న సవాల్ ఇది.

ఈ సందర్భంలో, అమెరికా సుప్రీంకోర్టుకు మొన్న మొన్నటి వరకు ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించిన వారెన్ హయాంను స్వర్ణయుగంగా చిత్రిస్తున్నారు. వారెన్ 1953 నుంచి 1969 దాకా ప్రధాన న్యాయమూర్తిగా పని చేశాడు. ముందు జాన్ ఫాస్టర్ డల్లెస్‌ను అడిగితే తాను సెక్రటరీ ఆఫ్ స్టేట్‌గానే ఉంటానన్నాడు. దానితో నాటి అధ్యక్షుడు ఐసెన్‌హోవర్, వారెన్‌ను ప్రధాన న్యాయమూర్తిగా నియమించాడు.

1937లో రూజువెల్టు హయాంలో జరిగినది ప్రథమ రాజ్యాంగ విప్లవమనుకుంటే, వారెన్ హయాం రెండవ రాజ్యాంగ విప్లవంగా ప్రసిద్ధిచెందింది. వివిధ తెగల మధ్య సమానత్వాన్ని స్థాపించటంలో, రాజకీయ రంగంలో కనపడే పక్షపాత ధోరణులను అదుపులో పెట్టడంలో, ప్రజాస్వామిక హక్కులను రక్షించటంలో, నేరస్థులకు హక్కులను ప్రసాదించటంలో, పత్రికా స్వాతంత్ర్య రంగంలో, నల్లవారి హక్కులను పరిరక్షించటంలో, మత స్వాతంత్ర్య విషయంలో విప్లవాత్మకమైన మార్పులు వారెన్ హయాంలో ద్యోతకమయాయి.

నిజానికి అమెరికన్ ధోరణి, ఆ సమాజం, ఆ ఆర్థిక వ్యవస్థ—మన ధోరణి, మన సమాజం, మన ఆర్థిక వ్యవస్థ భిన్నమైనవి. ఎటువంటి పరిస్థితులలోనూ ఈ రెండూ ఒకటి కాజాలవు. కాని మన దేశంలో వారెన్ హయాం పట్ల విపరీతమైన సానుభూతి ఉంది.

ఉదాహరణకు నేటి సుప్రీంకోర్టున్యాయమూర్తి శ్రీ వి.ఆర్. కృష్ణయ్యర్ తన పుస్తకం "లా, ఫ్రీడం అండ్ ఛేంజు"లో 'అమెరికా సుప్రీంకోర్టు—సాంఘిక మార్పు' మీద ఒక వ్యాసాన్ని వ్రాశాడు. ఆ వ్యాసం ముఖ్య ఉద్దేశ్యం అమెరికా సుప్రీంకోర్టు ఆ జాతి ఎదుర్కొన్న సమస్యలను సక్రమంగా పరిష్కరించగలిగిందనే. భారత దేశపు న్యాయస్థానాలు, వాక్స్వాతంత్ర్యం పట్ల చక్కగా ప్రవర్తించినా, కార్మికులు, కర్షకుల పట్ల వాటి ధోరణి సానుభూతితో కూడి లేదంటాడు. వారెన్ నాయకత్వం క్రింద అమెరికన్ సుప్రీంకోర్టు పౌర హక్కులు, భావ ప్రకటనా స్వాతంత్ర్యము, సమావేశ స్వాతంత్ర్యాల వైపు బాగా మొగ్గిందంటూ, ఎరల్ వారెన్, అతని సోదర న్యాయమూర్తులు, అమెరికాలోనే గాక, సర్వత్రా న్యాయవ్యవస్థ గౌరవాన్నే పెంపొందించారంటాడు.

తన వ్యాసాన్ని ముగిస్తూ—ఈనాడు మన న్యాయపద్ధతులతో విరక్తిచెందిన ప్రజ 'చట్టం చనిపోయిందా' అని అడుగుతున్నారనీ, దానికి రాజ్యాంగ న్యాయశాస్త్రం సమాధాన మివ్వాలనీ, లేకపోతే శాసన

రాహిత్యం దేశాన్ని ఏలుతుందంటాడు శ్రీ కృష్ణయ్యర్.

ఈవిధంగా చాలా ప్రముఖమైన ప్రశ్నలే ఈ వ్యాసంలో వేయబడ్డాయి.

*　　*　　*

న్యాయమూర్తులు మానవాతీత వ్యక్తులుకారు. ఈ సమాజం లోని వ్యక్తులే. కాబట్టే ఈ సమాజంలోని మంచి చెడుల ప్రభావం వారిమీద కూడా పడుతుంది. దానికితోడు జీవితంలో అనుభవం సంపాదించిన వ్యక్తులు కావటంవలన నైతిక, సాంఘిక, రాజకీయ, ఆర్థిక రంగాలలో వారికిగల అభిప్రాయాలు, వారి వారి తీర్పులలో ప్రతిబింబించక తప్పదు. మానవుడుగా ఏ వ్యక్తీ తప్పించుకోలేని పరిస్థితి ఇది.

దీనిని శ్రీ కృష్ణయ్యర్ తన వ్యాసంలో ప్రస్తావించాడు. అమెరికన్ ఆచార్యుడు, మెక్లాస్కీ గ్రంథంలోని వాక్యాలను ఉదహరిస్తాడు. కోర్టు అమెరికాలో భాగమనీ, కాబట్టి ఆ సమయంలో అమెరికాలో ఏమి జరుగుతుందనే విషయము పట్టించుకోక తప్పదంటాడు మెక్లాస్కీ.

అమెరికన్ న్యాయమూర్తి కార్డోజో కూడా ఈ విషయాన్ని ఎత్తుకున్నాడు. చాల్దా తన స్వీయచరిత్రలో అమెరికన్ న్యాయమూర్తుల అభిప్రాయాలను ఉదహరిస్తాడు. న్యాయ మూర్తి ఎప్పుడూ ''కాలపరిస్థితులను'' గురించి మెలకువతో ఉండాలని హోమ్స్ భావిస్తే, న్యాయమనేది చివరకు న్యాయమూర్తి వ్యక్తిత్వంమీద ఆధారపడి ఉంటుందని కార్డోజో భావిస్తాడు. న్యాయమూర్తి వ్యక్తిత్వమంటే—ఆయన పెంపుదల, ఆయన ధోరణి, ఆయన దృక్పథం, ఆయనను ''ఆయన''గా రూపొందింపటానికి కారణభూతమైన సర్వ విషయాలు.

అయితే హోమ్స్, కార్డోజోలు ప్రముఖ న్యాయశాస్త్రవేత్తలైనా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులుకారు. హోమ్స్ ఒక అర్ధశతాబ్దిపాటు, తన 41వ సంవత్సరంనుంచి 91వ సంవత్సరం దాకా న్యాయమూర్తి. అందులో సుమారు 30 ఏళ్లు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పనిచేశాడు. ఒకరోజు తన ఆసనాన్ని అలంకరించబోతూ, సహాయం కోరవలసి వచ్చింది. అంతే మరుసటిరోజే రాజీనామా సమర్పించాడు. తన 94వ జన్మదినానికి రెండు రోజుల ముందు మరణించాడు.

కార్డోజో 1932లో సుప్రీంకోర్టు న్యాయమూర్తయి, 1938లో గతించాడు. 20వ శతాబ్దపు ప్రముఖ న్యాయమూర్తులలో ఒకడుగా గుర్తింపబడ్డాడు.

*　　*　　*

అయితే కాలం చాలా విచిత్రమయింది. మనకు అమెరికన్ విధానంలో నచ్చింది, అమెరికన్ ప్రజలకు నచ్చకపోవచ్చు. బి. యన్. రావుకు సలహా నిచ్చిన న్యాయమూర్తి ఫ్రాంక్‌ఫర్టర్ వారిదృష్టిలో తగినంత ప్రగతిశీలి కాకపోయాడు. 1962లో ఫ్రాంక్‌ఫర్టర్ పదవీ విరమణచేసిన తదనంతరం వచ్చిన న్యాయమూర్తులతోనే వారెన్ కోర్టుకు తగిన బలం లభించిందన్నాడొక అమెరికన్ గ్రంథకర్త.

1968లో తన తదనంతరం ఎవరు పదవి స్వీకరించేదీ తెలిస్తే తాను పదవీ విరమణ చేస్తానని, ఎరల్ వారెన్ ప్రకటించాడు. అప్పటికి ఆయన వయస్సు 77 సంవత్సరాలు. వెంటనే అధ్యక్షుడు జాన్‌సన్ ఆ స్థానానికి ఫోర్టాస్‌ను ప్రతిపాదించాడు. కాని సెనేట్‌లో ఈ వ్యవహారం ఎదురు తిరిగింది. ఇంతలో ఎన్నికలొచ్చి వారెన్ హయాంనాటి తీర్పులన్నీ విమర్శించబడ్డాయి. 'లా అండ్ ఆర్డర్' వ్యవహారంలో సాక్షాత్ అధ్యక్ష అభ్యర్థి నిక్సన్ ప్రత్యక్షంగా విమర్శించి, తానొస్తే తన నియామకాలు భిన్నంగా ఉంటాయన్నాడు.

తాను ఎన్నికయిన తరువాత వారెన్ స్థానంలో వారెన్ బర్గర్‌ను నియమించాడు. ఈవిధంగా 1969 జూన్‌లో వారెన్ శకం ముగిసింది. బర్గర్ యుగం ప్రారంభమయింది.

ఈవిధంగా మనకు పూర్తిగా నచ్చిన వారెన్, అమెరికన్ ప్రజలకు పూర్తిగా నచ్చలేదు.

*　　*

ఇంతకూ మన న్యాయ వ్యవస్థను గురించి అమెరికనుల అభిప్రాయమేమిటి?

1970లో అమెరికాలోని కెంటకీ విశ్వవిద్యాలయానికి చెందిన రాజకీయ శాస్త్రాచార్యుడు డాక్టర్ జార్జి గాడ్‌బోయిస్ మన దేశ మెచ్చి, మన సుప్రీంకోర్టును గురించి ప్రత్యేకంగా అధ్యయనం చేశాడు. ఆయన 3272 తీర్పులను పరిశీలించాడు అందులో 478 సాధారణ పౌరులు కొన్ని చట్టాలు రాజ్యాంగ వ్యతిరేకమంటూ లేపిన వివాదాలయితే, వాటిలో 128 వ్యవహారాలలో పౌరులే జయమొందారు. ప్రభుత్వానికి ఏదో విధంగా 2/3వ వంతు వివాదాలతో సంబంధముంది. ఆ అమెరికన్ ఆచార్యుడు తయారుచేసిన పట్టికల ప్రకారం, హైకోర్టు తీర్పులమీద నుండి చేయబడ్డ అప్పీళ్లలో 40% ఆమో

దింపబడ్డాయి. ఈ విధంగా మన సుప్రీంకోర్టు ఒక రబ్బరు స్టాంపు కాదంటాడా ఆచార్యుడు. న్యాయమూర్తులకు సొంత అభిప్రాయాలున్నా, ఈ తీర్పులన్నీ వ్యవహారం గుణగణాల ఆధారంగా ఈయబడ్డవే గాని, వాళ్ల వ్యక్తిగత అభిప్రాయాల మూలంగా ఇవ్వబడ్డవి కాదంటాడు ఆ ఆచార్యుడు. *

* * *

ఈ సందర్భంలోనే మనమింకొక ప్రశ్న కూడా వేసుకోవాలి. మనం మన న్యాయ వ్యవస్థను అమెరికన్ న్యాయ వ్యవస్థతో పోల్చుకోవటం సబబేనా అని. న్యాయ వ్యవస్థ దేశంలోని రాజకీయ, ఆర్థిక వ్యవస్థలతో సంబంధం లేకుండా ఉండదు. సాంఘిక వ్యవస్థతో కూడా న్యాయవ్యవస్థకు సంబంధముంటుంది. న్యాయశాస్త్ర సంబంధమైన అభిప్రాయాలు కూడా ఈ రంగాలతో సంబంధముంచుకుంటూ, వాటి సాధారంగా రూపొందింపబడుతూ ఉంటాయి. అలా కానినాడు అది మన న్యాయశాస్త్రం కాదు. ఇంకేదో అవుతుంది.

ఈ వ్యాస ప్రారంభంలోనే మన రాజ్యాంగానికి, అమెరికన్ రాజ్యాంగానికి గల అనేకమైన పోలికలను సూచించటం జరిగింది. వారి 'బిల్ ఆఫ్ రైట్స్'కు మన 'ప్రాథమిక హక్కు'లకు అనేక పోలికలున్నాయి. కాని విచిత్రమేమిటంటే, ఈ విషయాలలో ఎంత పోలికలున్నాయో, మన న్యాయ పరిపాలనా వ్యవస్థకు, వారి న్యాయ పరిపాలనా వ్యవస్థకు విపరీతమైన భేదాలున్నాయి.

వారిది పూర్తిగా రాజకీయాలతో పెనవేసుకున్న న్యాయ పరిపాలనా వ్యవస్థ. గవర్నర్లు, సెక్రటరీ ఆఫ్ ట్రెజరీలు, న్యాయశాస్త్రాచార్యులు న్యాయమూర్తులవుతారు. సరాసరి ప్రధాన న్యాయమూర్తులవుతారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి నియామకం సెనేట్ ఆమోదాన్ని పొందాలి. పొందని సంఘటనలూ ఉన్నాయి. బ్రిటన్‌లో న్యాయమూర్తుల నియామకాలు లార్డ్‌ఛాన్సెలర్ సలహాతో జరుగుతాయి. లార్డ్‌ఛాన్సెలర్ న్యాయమూర్తే కాదు, మంత్రి కూడా.

అయితే ఆ రెండు దేశాలలో ఎక్కడా కేవలం రాజకీయాలాధారంగానే తీర్పులొస్తున్నాయి. న్యాయస్థానాల కొచ్చిన వారికి అన్యాయం జరిగింది, రాజకీయ ప్రతికక్షుల కన్యాయం జరిగింది అన్న తీవ్రమైన ఆరోపణలు లేవు.

ఏ న్యాయమూర్తి, తను పదవిలోకి రావటానికి కారణభూతుడైన అధ్యక్షునికి అనుకూలంగా ఉన్నాడన్న విమర్శ లేనేలేదు. ఉదాహరణకు, 1902లో రూజువెల్టు చేత సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమింపబడ్డ హోమ్స్, 1903లోనే రూజువెల్టు అభిప్రాయాలకు వ్యతిరేకంగా నార్తరన్ సెక్యూరిటీ కేసులో తీర్పిచ్చాడు.

1969లో నిక్సన్‌చేత నియమింపబడిన ప్రధాన న్యాయమూర్తి బర్గర్ ఏమిచేశాడు? వాటర్‌గేటు వ్యవహారంలో తన దగ్గరున్న టేపులను హాజరు పెట్టనని నిక్సనంటే, పెట్టితీరవలసిందని తీర్పిచ్చాడు. 1974 జులై 24నాటి ఆ తీర్పు—ఇది సుప్రీంకోర్టు ఏకాభిప్రాయం, ఇందులో భిన్నాభిప్రాయాలులేవు సుమా—బహుశా అమెరికా రాజ్యాంగ చరిత్రలో మూడవ విప్లవమేమో! ఇదే నిక్సన్ పతనానికి నాందీ వాక్యం.

పైగా ఈ న్యాయ మూర్తులంతా జీవితాంతం న్యాయమూర్తులే. వారికి పదవీ విరమణ ఐచ్ఛికమేగాని, నిర్బంధంకాదు. హోమ్స్ తన 91వ సంవత్సరంలో పదవీ విరమణచేస్తే, వారెన్ తన 77వ సంవత్సరంలో విరమించాడు.

కాబట్టే ప్రధాన న్యాయమూర్తుల పేరుతో, ఆ కాలాలను వారి హయాంలని చెప్పుకుంటున్నాం. కాని నిర్ణీత వయస్సుకే పదవీ విరమణ చేయాలి అన్న నిబంధన ఉన్నచోట, న్యాయమూర్తులు 'లీడ్' ఇవ్వటమనేది అసంభమవుతుందేమో! ఉదాహరణకు మన సుప్రీంకోర్టుకు ఇంతవరకు అతిదీర్ఘంగా ప్రధాన న్యాయమూర్తి పదవిని ఒక్క యస్. ఆర్. దాస్ మట్టుకే 3½ సంవత్సరాలు నిర్వహించాడు.

ఇలాంటి విస్తృత ప్రజాస్వామిక ధోరణులు, ఇంత వ్యక్తిగత శీలమూ లేకపోతే, ఆ నమూనాలో మన న్యాయపరిపాలనా వ్యవస్థను దిద్దుకోగలమా? ఆ మూసలో పోత పోసుకోలగమా?

రెండవ విషయం: మన రాజ్యాంగ స్వరూపాలలోగల మవులికమైన భేదము. ప్రపంచంలో ఈనాడు రెండు రకాలైన రాజ్యాంగాలున్నాయి. లిఖితమైన రాజ్యాంగం కలవి, అలా కాకుండా శాసన సభా సార్వభౌమత్వాన్ని అంగీకరించే దేశాలు. బ్రిటన్‌బోటివి రెండవ పద్ధతి అవలంబిస్తే, మనం మొదటి పద్ధతి అవలంబించాము. ఈ మొదటి పద్ధతిలో సార్వభౌమాదికారం రాజ్యాంగానికే ఉంటుంది. మన రాజ్యాం

---

* డాక్టర్ గాడ్‌బోయిస్ విషయం, కులదీపనాయర్ ప్రచురించిన 'సూపర్‌సెషన్ ఆఫ్ జడ్జెస్'లో శ్రీ ఎ. యస్. గ్రోవర్ వ్యాసం నుంచి తీసుకోబడింది. దురదృష్టవశాత్తు శ్రీ గ్రోవర్, ఏ గ్రంథంలో లేక ఏ వ్యాసంలో ఆ అమెరికన్ ఆచార్యుడీ అభిప్రాయాలు వెలిబుచ్చిందీ ఉదహరించలేదు.

గంలో అనేక ఒడుదుడుకులకు, అనుచ్ఛేదాలద్వారా పరిష్కారం సూచించ బడింది.

మూడవ విషయం : మన న్యాయమూర్తులు, న్యాయస్థానాలు ఇంతవరకు రాజకీయాలకు అతీతంగా ఉన్నారు, ఉన్నాయి. బ్రిటిష్ పాలనలో కూడా ఎక్కువ భాగం ఈ నిష్పాక్షికత పాటింపబడుతూ వచ్చింది. ఏవో అతి స్వల్ప ఉదాహరణలు తప్ప, రాజకీయ నాయకులు న్యాయమూర్తులు కాలేదు. న్యాయ శాస్త్రవేత్తలు అంటే న్యాయ శాస్త్రాచార్యులు కావటం ఇంతవరకు పెద్దగా జరుగలేదు. న్యాయ వాదులే న్యాయమూర్తులవుతున్నారు.

స్వాతంత్ర్యానంతరం, విపరీత రాజకీయ పరిణామాలను కలిగించే సమస్యలు వారి ముందుకువచ్చినా, వారు రాజకీయ ధోరణితో ఆ సమస్యలను చూడటానికి నిరాకరించారు. సుప్రీంకోర్టు తెరిచిన నాలుగు నెలలలోనే దాని ముందుకొచ్చిన గోపాలన్ వ్యవహారంనుంచి ఈనాటివరకూ అదే దృక్పథం నడుస్తున్నది.

ఉదాహరణకు, 1967 నాటి గోలక్‌నాథ్ కేసులో ఆనాటి ప్రధాన న్యాయమూర్తి శ్రీ కోకా సుబ్బారావు ఈ విషయాన్ని ప్రస్తావించాడు. రాజ్యాంగాన్ని ఇష్టమొచ్చినట్లు సవరించే అధికారమున్నంత మాత్రాన విప్లవాలు రాకుండా పోవనీ, దుష్పరిపాలనవల్లగాని, అధికార దుర్వినియోగంవల్లగాని విప్లవాలు రావచ్చనీ, రాజ్యాంగం ధ్వంస మవటమంటూ జరిగితే సవరణలవల్ల జరిగినా, విప్లవాలవల్ల జరిగినా ఒకటేననీ, అలాంటి ఊహాజనిత విషయాలమీద ఆధారపడి న్యాయ స్థానాలు తమ నిర్ణయాలు ఇవ్వవన్నాడు.

శ్రీ సుబ్బారావు అభిప్రాయంతో భేదించి లోకసభకు రాజ్యాంగాన్ని సవరించే అధికార ముందని నిర్ణయించిన శ్రీ వాంచూ కూడా ఈ విషయాన్ని ప్రస్తావించాడు. ఈ రాజకీయవాదాన్ని ఆయన భయోత్పాత జనితవాదం అన్నాడు. ఏ అదికారానికైనాసరే అది దుర్వినియోగమయే అవకాశమున్నంత మాత్రాన, న్యాయస్థానాలు ఆ అధికారమే లేదని చెప్పవనీ, అధికారమున్న వ్యవస్థ తన అదికారాన్ని దుర్వినియోగంచేస్తే, ఆది ఆ వ్యవస్థ నెన్నుకున్న ప్రజల బాధ్యత అనీ, అంత దూరమొస్తే దానికి పరిష్కారం న్యాయస్థానాలలోలేదు, ప్రజల్లో ఉందనీ అంటాడు.

ఇంతెందుకు. మొన్న మొన్న శ్రీమతి గాంధి ఎన్నికల వివాదంలో సుప్రీంకోర్టులో స్టే ఇచ్చిన శ్రీ కృష్ణయ్యర్ కూడా ఈ విషయాన్ని ప్రస్తావించాడు. మామూలు న్యాయ సూత్రాలు, చట్టాల్లో నిర్వచించబడిన న్యాయం అనేది కాకుండా, జాతీయ ప్రమాదాలు, ప్రజాస్వామిక ధోరణులు లనే పరీక్షలో ఒక విషయాన్ని నిర్ణయించాలంటే — ఇప్పటి న్యాయశాస్త్ర ధోరణిలోనే మార్పు రావాలంటాడు.

నాల్గవ విషయం : మన మెప్పుడూ న్యాయస్థానాలనూ, న్యాయమూర్తులనూ మన జాతి భవిష్యద్భాగ్య విధాతలుగా గుర్తించ లేదు. ఏది ఏమైనా న్యాయమూర్తులు ఉద్యోగస్తులు మాత్రమే. రాజకీయ నాయకులమీదనే మన ఆశలన్నీ ఉంచుకున్నాం. రాజకీయాలే సర్వస్వంగా భావిస్తూ వచ్చాము. ఇలాంటప్పుడు మన వైఫల్యాలన్నిటికీ న్యాయస్థానాలే కారణ మనటం భావ్యం కాదేమో ననిపిస్తుంది సుమా! మన న్యాయస్థానాలు రాజకీయాలను ఇంతవరకూ దూరంగా ఉంచుతూ వచ్చాయి.

* * *

భారత రాజ్యాంగ రజతోత్సవ సందర్భంలో మనమంతా ఆలోచించవలసిన విషయాలివి. మనకున్న వ్యవధి అతిస్వల్పం కావటంలో, మనదంటూ ఏ రాజ్యాంగ న్యాయశాస్త్రము దాదాపు ఇంతవరకూ ఏర్పడలేదేమో! అలాగే ఏ న్యాయశాస్త్రాచార్యులు ఈ విషయాన్ని గురించి కూలంకషమైన వివారానికి ఇంకా పూనుకోలేదేమో !

మనం ఏ దేశపు రాజ్యాంగాలనుంచి ఏ విధమైన అనుచ్ఛేదాలను తీసుకున్నా, వారి తీర్పుల నుంచి ఎంత స్ఫూర్తిని గ్రహించినా ఒక విషయం మరువకూడదు. మన రాజ్యాంగ పురుషునికి ఆహారం అమెరికన్ తీర్పులు, బ్రిటిష్ తీర్పులు, లేదా రష్యన్ ధోరణి — ఏదైనా ఆహారం జీర్ణమవాలి, తదనంతరం ఏర్పడే శరీరం మనదే, ఏర్పడవలసిన వ్యక్తిత్వం కూడా మనదే. అంతే కాని మన శరీరంలో అమెరికన్ ఆత్మ, లేదా బ్రిటిష్ ఆత్మ లేదా రష్యన్ ఆత్మ పరకాయ ప్రవేశం చేయకూడదు.

అయితే 25 సంవత్సరాల చరిత్ర మనం, మనంగా రాజ్యాంగ రంగంలో నిలద్రొక్కుకునేందుకు పనికివచ్చింది. ఈ శుభ సందర్భాన మన రాజ్యాంగ వ్యక్తిత్వానికి శ్రీ కృష్ణయ్యర్ మాటలలో చెప్పాలంటే **Indian Constitutional Jurisprudence** కు నాంది పలకాలి.

ఈ వ్యాసాన్ని ముగించేముందు, మహాయోగి అరవిందుడు తన గ్రంథం **'The ideal of Human Unity'**లో వ్రాసిన మాటలతో ముగించటం బావ్యమనుకుంటాను. **"History teach us nothing' It is a confused torrent of events and personalities or a kaleidosscope of changing institutions. We do not seize the real sense of all this change and this constitutional streaming forward of human life in the**

channels of time. What we do seize are current or re-current phenomena, facile generalisations, partial ideas. We talk of democracy, aristocracy, and autocracy collectivism and individualism, imperialism and Nationalism, the State and the commune, capitalism and labour; We advance hasty generalisations and make absolute systems which are positively announced today only to abandon perforce tomorrow. We espouse excess and ardent enthusiasms whose triumph turns to an early dissolusionment and then for take them for others, perhaps for those that have taken so much trouble to create. For a hole century man kind thirsts and battles after liberty and earns it with a bitter expense of toil, tears and blood; the century that enjoys without having fought for it turn away as from a puerile illusion and is ready to renounce the depreciated gain as the price of some new key. All this happens because our whole thought and action with regard to our collective life is shallow and emperical. It does not seek for, it does not base itself on a firm, profound and complete knowledge The moral is not the vanity of human life, of its ardous and enthusiasms and of the ideals it pursues, but the necessity of a wiser, larger, more patient search of its true law and aim"

(మన రాజ్యాంగ రజతోత్సవ సందర్భమున వ్రాయబడిన ఈ వ్యాసం ఉద్దేశ్యం కేవలం రచయితకు తోచిన కొన్ని విషయాలను సూచించటం వరకే. ఈ రంగంలోని కొన్ని ధోరణులను సూచించటం జరిగింది. అనేకమంది రచయితల భావాలను మాలగా గుచ్చడంవలన ఏర్పడిన వ్యాసమిది. వారిని అక్కడికక్కడే ఉదహరించటం జరిగింది. మిగతా విషయాలు, వివరాలు మన సుప్రీంకోర్టు 1950 లో గోపాలన్ వ్యవహారంలోనూ, 1967లో గోలక్‌నాద్ వ్యవహారంలోనూ ఇచ్చిన దీర్ఘమయిన తీర్పుల నుంచి గ్రహించబడింది.)

తెలుగుతల్లి!

శ్రీ బులుసు వేంకటేశ్వరులు

౧

తరతరాలనుండి .ధన్యజీవనదాయి
నివిగ బేరుపొంది నిలిచినావు
చెక్కుచెదరకుండు చెలువున నెంతయు
దివ్యకల్పవల్లి! తెలుగుతల్లి!

౨

తెలుగుభాష తీరు తీయందనంబును
సొగసు పరిమళంబు శుద్ధతయును
ఇతరభాషలందు నెందు లేవందురు
దివ్యకల్పవల్లి ! తెలుగుతల్లి !

౩

సంప్రదాయసిద్ధ సత్కావ్యములు లేవు
భావశుద్ధిలేదు పదవిశుద్ధి
మృగ్యమయ్యె నేడు మేలో కీడో మది
దివ్యకల్పవల్లి! తెలుగుతల్లి !

౪

వెర్రితలలువేసె వేయివిధంబుల
తెలుగుకవిత యేమి పలుకగలము
తెలుగుపాలము కలుపుతీయంగ నగు మేలు
దివ్యకల్పవల్లి ! తెలుగుతల్లి !

౫

పూర్వవైభవంబు పొలుపారవలయును
నూతనంబుగాగ పూతముగను
నీవు తృప్తినంది నెగడంగవలయును
దివ్యకల్పవల్లి ! తెలుగుతల్లి !

సాహిత్యోపన్యాసములు

శ్రీ తిరుమల రామచంద్ర

మహాపురుషుల శత జయంత్యుత్సవాలు జరుపబడుటచేత ఇప్పటి యువతరం వారికంతా ఆనాటి మేధావులు ఎన్ని ఇక్కట్లకు లోనైరో, ఎన్నిత్యాగాలు చేసిరో తమ మేధాశక్తితో ఎన్నెన్ని సాధించిరో బోధపడుతుంది. 'తాబట్టిన కుందేలుకు మూడేకాళ్లు' అని విర్రవీగే వారికి, నీరసంగా మూలగూర్చున్న వారికి ఇట్టి ఉత్సవాలు, ఉపన్యాసాలు హృదయ వికాసాన్ని చేకూరుస్తాయి. ఈ ఉపన్యాసకులు కూడ ప్రజ్ఞానిధులు, సహృదయులు, విద్యాపారంగతులు. ఈ చిన్న పుస్తకాలు చదువరులకు ఎంతేని తోడ్పడుననుటలో ఏమీ సందేహం లేదు

శ్రీ కాశీనాదుని నాగేశ్వరరావుగారి పరోపకార పారీణతను స్మరింపనిఆంధ్రులే లేరు. వారి పత్రికలు,భారతి, పరోపకారదృష్టితో నడుప బడేవే.

'డబ్బుకంటే ముందు ఖర్చు, ఖర్చుకంటే ముందు సంపాదన అన్నిటికంటె ముందు భావాలు ఎత్తిశాంచిరేని పరువూ అందులో రామభక్తి' అని నోరి నరసింహశాస్త్రిగారు ప్రారంభించడంలో అతిశయోక్తి లేదు. తన క్రింద పనిచేసేవారిపట్ల కూడ వేసరిక లేకుండా వుండే మెత్తని స్వభావం వారిది వారు 'విశ్వదాత' అని బిరుదు పొందారంటే పారకులే వారి జీవిత విశేషాలను వూహించు కోవచ్చు.

శ్రీ నోరినరసింహశాస్త్రిగారు యువతరంవారిని కాశీనాధునిలాగు ఆదర్శవంతంగా వుండాలని ప్రబోధింవారు కాశీనాధుడు ఆరాధ్యుల్లో జన్మించినా నేటివలె మత సామరస్యం చూపుతూ మంచి రామభక్తుడయ్యాడు. దేశంలో వంగ విభజన తర్వాత ఎన్ని మార్పులు వచ్చాయో ఆనాటి వీరులు చేసిన త్యాగాలు అన్నీ ఈ వ్యాసంలో వున్నవి. 'ఆంధ్రపత్రిక ద్వారా విజ్ఞానాన్ని పంచిపెట్టాలనే ఉబలాటంతో సాలీనా వచ్చే రూ. 23,375 నష్టాన్ని కూడా లెక్కపెట్టలేదు.' బొంబాయిలో పుట్టి నేడు భాగ్యనగరం చేరి పేరు మోసిన సారస్వత సేవకులను తయారుచేసిన చలువ శ్రీ కాశీనాధునికే దక్కింది. ఎన్నో మరుగుపడ్డ తాళపత్రాలు, శాసనాలు, అపూర్వ గ్రంధాలు భారతివల్ల వెలుగును చూచింది. అతడు ఎంత ప్రాచీనుడో అంత నవీనుడు. కాశీనాధుడే అప్పట్లో శ్రీబాగ్‌పాక్ట్‌ను కుదిరింపజేసి విశాలాంధ్రకు నాందీ పాడారని ఎందరికి తెలుసు ?

గాంధీజీ కూడ వారి అమృతాంజనాన్ని, ఆంధ్రపత్రిక వల్ల కాంగ్రెసుకు కలిగిన మేలును ప్రశంసించారు. వారు గాంధీజీలోని గొప్పదనాన్ని ఆంధ్రులకు చాటి పలుసార్లు కారాగార శిక్షనుకూడ అనుభవించారు. వారి జీవిత చరిత్ర పార్య గ్రంధం కావాలని ఆశిస్తున్నారు క్రొవ్విడి లింగరాజుగారు.

శ్రీ ఆరుద్రగారు 'శంఖంలో పోస్తే తీర్థం అవుతుందో లేదోగాని ఒకనాడు భారతిలో రచన అచ్చుపడడం నిజంగా పట్టాభిషేకమే' అన్నారు. రాజరాజుకన్నా, రాయలవారికన్నా కాశీనాధుడే ముమ్మరంగా సాహిత్య సేవ చేశారని, పండితాశ్రయమైన సాహిత్యాన్ని ప్రజాపరం చేశారని, అందరూ ఆనాడు శ్రీశ్రీని ఈసడించుకుంటే కాశీనాధుడే ఔదార్యంతో వ్యవహరించి రచనలను ప్రకటించారని, చాలమంది రచయితలకు వారి పత్రికలు సిద్ధాన్నమైవవని చెప్పి సంతృప్తిని వెలిబుచ్చారు. కాశీనాధుని ఎన్నో వాక్యాలను వ్రాస్తూ ముఖ్యంగా 'మానవుడు పరహితార్థం చేస్తేనే మోక్షం, స్వాతంత్ర్యం, జవసత్వాలు లేని ప్రజలు కైలాసం, పాతాళం రెండింటినీ చూడ జాలరని' కాశీనాధుడు చెప్పిన వాక్యాలను నొక్కి చెప్పాడు. ఈ వ్యాసాలను సిటీబస్సు తన గమ్యస్థానం చేరేలోగా చదివివేయవచ్చు.

10 వ భాగం వ్యాసముల వివరం విషయసూచిక మొదటే వ్రాశాను. ఈ వ్యాసకర్తలు ఉద్దండ పండితులు, కవులు, అవధానులు.

శ్రీ చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారు 19 వ శతాబ్ది ప్రారంభంలో తెలుగు కవితవైపు ప్రజల దృష్టిని అనేక పద్ధతులలో మరలించారు. తమ అవధానాలవల్లనైతేనేమి, ఆశు కవితలవల్లనేమి, నాటకాలు, వాదోపవాదాలు అనేక రీతులుగా ఎల్లా తెలుగు కవితను నడిపించారో దుర్గేశ్వరశాస్త్రిగారు వివరించారు. ఇప్పటికీ తిరుపతి వెంకటకవుల శిష్యు లెందరో వారి వినోదాలను ఛలోక్తులను చెప్పకుంటూవుంటారు. ఆ జంటకవులు తమ పాండిత్య కవిత్వ ప్రగల్భతలో శ్రీనాధునికి ఏమాత్రం తీసిపోరు.

'గోణము కట్టుటాది బుధకోటి నుతింప గవిత్వము చెప్ప

నేర్చిన' చెళ్లపిళ్లవారికి దివాకర్ల తిరుపతిశాస్త్రిగారు తోడ్పడుట దైవ సంఘటన యన్నారు దుర్గేశ్వరశాస్త్రిగారు. వారిద్దరి ఆమరణాంతస్నేహముగాని, నామధేయము కలయికగాని ప్రపంచ చరిత్రలోనే లేదని అన్నారు.

తిరుపతిశాస్త్రిగారి జీవిత చరిత్ర అంటే శ్రీ దివాకర్ల వెంకటావధాని వంశ చరిత్రయే. ఈ వ్యాసంలో ఆనాటి బ్రాహ్మణ కుటుంబాలలోని పట్టుదలలుకూడ బోధపడుతుంది.

ఈ జంటకవుల చాటువుల వల్ల పరదేశిల కష్టాలు తెలుస్తాయి. 'కఠినములగు రాళ్లగఅపి కట్టిన రామభజనాలయమ్మోలే పడకలాయె...' యిప్పడైతే పాడైన రచ్చకట్టలో, సర్పంచ్ గోడపంచలో గతి.

వీరి పాండవోద్యోగము పాండవ విజయం ప్రజలను చాల మురిపించినై. వారు అనువాదనాటకాలు శ్రీనాథునిఫక్కీలో వ్రాశారు. పాండవోద్యోగం వల్ల సుమారు 200 కుటుంబాలకు జీవనోపాధి కలిగింది. ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారు వీరి నాటకాలలో యధార్థ నాటకీయత ప్రదర్శించటానికి సరిగాలేదని కావ్యప్రతిభను మాత్రం ప్రదర్శిస్తున్నవని, శ్రీనాథుడే చెళ్లపిళ్లగా పుట్టాడని అభిప్రాయపడ్డారు.

సర్వా వెంకట శేషయ్యగారు తిరుపతి వేంకటకవుల కృతులకు విమర్శనశైలిని వివరించారు. దివాకర్లవారు వారి అవధానాలను చాటువులను గురించి ప్రస్తావిస్తూ 'అవధానమొక సారస్వతవినోదం–సభలో వినువారికి ప్రమోదం – చెప్పేడివారికి క్లేశం అని అవధాని అనేది కేవలం బిరుదముకాదు గొప్పఅర్హత యోగ్యత'లని వ్రాశారు. తిరుపతి వెంకటకవులు తమ అవధానాలలో వకోడీనుండి పరమేశ్వరుని దాకా వర్ణనలు చేశారు. వీరి భాష సౌలభ్యంలో వ్యావహారికానికి చేరువగానే వుండేది. 'వింధ్యాద్రి ప్రభ నొప్పు...' అను సమస్యా పూరణ పద్యంలో 'ధ్య' అను ప్రాసను కుదుర్చుట చెళ్లపిళ్లవారికే తగునని వేరేవారైతే పద్యాలు, చౌశీతి బంధాలు మాని సంధ్యావంద నానికే వెళ్లేవారని చెప్పారు దివాకర్ల. ఇట్టి సమస్యలు నేటి సెక్సు హంగ్రీ యువకులను కూడ సంతృప్తిపరుస్తాయేమో.

చెళ్లపిళ్లవారి అవధానాలు, హేళనలు, చాటువులు ఇత్యాది ముక్తరచనలలో వుండే కావ్యశక్తి వారి గొప్ప కావ్యాలు శ్రవణానందం పాణిగృహీతలలోకూడ అంతగా లేదని చెబుతూ విశ్వనాధ సత్యనారాయణగారు తమ గురువుగారి 1934 లో బందరు జాతీయ కళాశాల లోని ఉత్సవాలలో చూపిన శిష్యవాత్సల్యాన్ని వివరించి పొగడినారు.

ఈ శతజయంత్యుత్సవ వ్యాసాలద్వారా, నాగేశ్వరరావుగారి కీర్తి, తిరుపతి వెంకటకవుల కవితా వ్యాసంగం ప్రజలకు చక్కగా చెప్పించిన అకాడమీ వారు హృదయపూర్వకంగా అభినందనీయులు.

తిరుపతి శాస్త్రిగారి జీవితము – కృతులు శ్రీ దివాకర్ల వారి నాటకాలు – పింగళి లక్ష్మీకాంతం — వేంకటావధాని

శ్రీ తిరుపతి వేంకటకవుల కృతులు వచన – వి మ ర్శ న గ్రంథపరిచితి — శ్రీ సర్వా వెంకటశేషయ్య

అవధానములు, చాటువులు, ప్రాస్తావిక కావ్యములు
— డా. దివాకర్ల వెంకటావధాని

తిరుపతి వేంకటేశ్వరకవుల కావ్యములు:–

110 పేజీలు కవిసమ్రాట్–పద్మభూషణ
విశ్వనాధసత్యనారాయణగారు

వెల: రు.1–50, ప్రచురణ: ఆంధ్రప్రదేశ్‌సాహిత్యఅకాడమీ, హైదరాబాదు–4

9 వ భాగం స్వర్గీయ కాశీనాధుని నాగేశ్వరరావుగారి శతజయంతి.

57 పేజీలు వెల 1–00 రూ.

ప్రచురణ: సాహిత్య అకాడమీ, కళాభవన్, హైదరాబాదు

ఇందలి వ్యాసములు: కాశీనాధుని నాగేశ్వరరావు. పరోపకార పారీణత. — శ్రీ నోరి నరసింహశాస్త్రి

2. కాశీనాధుని నాగేశ్వరరావు – దేశసేవ
— శ్రీ క్రొవ్విడి లింగరాజు

3. కాశీనాధుని నాగేశ్వరరావు – సాహిత్యసేవ
— శ్రీ ఆరు

10 వ భాగం సాహిత్యోపన్యాసములు

స్వర్గీయ తిరుపతి వేంకటకవుల శతజయంతి సంచిక

ఉ ప న్యా స వ్యా సా లు :

వేంకటశాస్త్రిగారి జీవితము – రచనలు
— శ్రీ చెళ్లపిళ్ల దుర్గేశ్వరశాస్త్రి.

'యేసంగి' (వేసవి)

శ్రీ బి. శ్రీరామ్‌రెడ్డి

[1] పళ్ళెమంచంమీద కూకొని
బొట్టుసెట్టు తెరిసెను సెలియసీకటి
కప్పెలన్ని పుచ్చెనేమో
పళ్ళెమంచం యిరిగిపోయెను.

[2] తుప్ప వీరవోసుకోని
సుప్పనాతి రాతిరంతట
సగటి సవతితల్లిమీద
శాపనార్థం బెట్టసాగెను.

[3] పిల్లలకోడి సీకటి బుర్ర
[4] ఎల్లకుంటికి పారిపోయెను
[5] గొరుకొయ్యలు పరుబాడితె
పరుమంట జారిపోయెను

కోడిపుంజు వుండి వుండి
కొక్కొరొకో యంట గూసెను
గొల్లగోపని మందలోని
గొర్రెలాకు వంతు దెలిసెను.

[6] మూలసుక్క మొలుసుకొచ్చెను
తొలుబొక్కెన నీల్ల మునిగెను
మోటగిల్ల మోటసెల్లెను
కదురు సుదురు అరిగిపోయెను.

మోకుదాడు ' మోరలెక్కగ
తొండెంతాడు [8] దండెనెక్కెను
గుండెమీద గుట్టవోలె
కోడెలమీద బరువు గూలెను.

తిక్కలేసిన వానివోలె రైతు
బక్కయు తిరగసాగెను
యెడ్లలోని యెద్దువోలె
యెనిక ముందుకు నడ్వసాగెను.

రైతు బక్కయ తిక్క జూసి
రేయి కొంచెం తెలివిదాయెను
తిక్క పదిలిన దిక్కులన్ని
తెల్లమొగము సేసుకొనెను.

రెక్కలార్సిన పిట్టలన్ని
ఒక్కపొద్దును యిడిసి పెట్టెను
పాతగొంతులతోనె కొత్త
పాటల నవి పాడసాగెను.

సొమ్మరోగం వచ్చినోడు
సొమ్మదేరి సూపినటుల
[9] పకుర్తంత సుట్టుపక్కల
ముసక దుప్పటి దీసి సూసెను.

మూలల సందిన ముసలియవ్వ
లేసి సీపురుకట్ట దెచ్చెను.
[10] లేకిదైన వొకిలిని జూసి
గీకి గీకి వూడ్సిపోయెను.

తాత మఱియాకు దీసుక
గోత మంత సుట్ట జుట్టెను
సూస్తు వుండగ రైలు లెక్కిన
గుప్పు గుప్పున పొగను దీసెను

అత్త గునుసుకుంట లేసి
[11] దుత్త దీసుక బయిటికొచ్చెను
బఱ్ఱెయావున రెండు సరిసి
సఱు సఱున పాలు పిండెను.

కొత్త కోడలు మగని పక్కన
మత్తు నిద్రలో మునిగిపోయి
కొత్తసోట్లు దిరుగుతుంటే
అత్త అరుపుల మేలుకొలుపుకు
ఆవలించి కండ్లు దెరిసెను.

ఇంటి ఆయన వుండి వుండి
గంటవోలె కంట మిరిసెను
మేలుకున్న దేవతలకే
మేలుకొలుపులు పాడసాగెను.

శాన సక్కని జాణ లేసి
[12] సాన్పి సిక్కగ సిల్కరించెను
[13] పుల్కర మొచ్చిన భూతల్లిని
ముగ్గులేసి పల్కరించెను.

తూర్పు గుట్టకు తొఱ్ఱబడెను
తొఱ్ఱలోంచి మంటలేసెను
మంటయెన్క నిప్పుల కుంపటి
మింటికేసి నడ్వసాగెను.

[14] అవుసలాయిన మూసల్నుంచి
అపుడు కరిగిన బంగరుతోటి
[15] కేటు సొమ్ముకు నీరు దాపిన
యిదము నేల పసిడిదాయెను.

ఇరుగు లేసెను పొరుగు లేసెను
ఊరిమీది ఆశ లేసెను
గొడ్డులేసెను గోద లేసెను
గడ్డిపరకలు నడ్డి యిరిసెను.

పుట్టగోసి పోరగాండ్లు
[16] పొట్టగంజి పొల్లగాండ్లు
గోదల నిడిసి మేపనీకె
గుట్టల దిక్కుకు నడవసాగిరి

అద్దమంటి ఆకసానికి
ఆవుల కాలి దుమ్ము సోకెను
[17] ఇంగలాల కుంపటిమీది
విపురులాగ కండ్లవడెను.

సిన్నిపోయిన బట్టలిడిసి
కొత్తఅంగీల్తొడిగినట్లు
సెట్లు సిగురుసొమ్ములెట్టుక
సెప్పలేని సిగ్గువడెను

పేదవాని నెత్తురంత
మోదుగుపూలై పూసెనేమో
*అగ్గువైన రగుతమోలే
అడివినిండా రంగులాయెను.

సావుకారి ముద్దుబిడ్డ
సముర్తాడి కూకున్నట్లు
మామిడికొమ్మ పూలుపూసి
మంచియందం దెచ్చుకొనెను.

పట్నమూల కోడెగాండ్లు
పడుసుపిల్లలయెంట సడెడి
యిదముగాను కోయిలేమో
మామిడిసెట్లల్ల దిరుగసాగెను.

[18] ఎండదేవుడు మండిపాయెను
యేడిబాణాలేయసాగెను
[19] పైలమీద సెమటనీళ్లు
పిల్లకాల్వలయిదము వాయెను.

వుండి వుండి గాలి వీసి
ఉడుకుదనముసు కసిగ యిసిరెను
ఉస్సురో అనుకుంట పానం
కొత్త వూపిరి పీల్సుకొనెను.

దుమ్ములేసెను ధూలిలేసెను
గాలి సుడులు దిరిగిపాయెను
సుడులు దిరిగే గాలిలోపల
సూడు దయ్యం వుండదనిరి

పట్నమోల్లకు [20] పంకలుంటయి
[21] గాలిగొట్టే పెట్టెలుంటయి
సల్లగాలిని మేసెటోల్లకు
యిల్లు సొర్గంగానె దోస్తది.

గూడెమోల్లకు గుడిసె లుంటయి
గుడిసెల్నిండా బొక్కలుంటయి
దుమ్ము గిమ్ము గొట్టుకొస్తది
దానమ్మ నరకం యెక్కడుంటది.

[22] వాగ్రెలెండెను [23] వొంపులెండెను
వాగులెండెను యేరులెండెను
వాగ్రెనీళ్లు దాగివచ్చే
బర్రెలందున పాలు యెండెను.

[24] దూపగొన్న [25] దుడ్డెలాకు
తాపనీకె నీళ్ళు లేవు
ఆకలిగొన్న ఆవులాను
మేపనీకె గడ్డి లేదు.

[26] వొడ్కెలందలి సెలిమ లెండెను
నాల్కెలమీది వుమ్మి యెండెను
యొండమావిల నీళ్ళ లెక్కన
గుండెలోని ఆశ దోసెను.

[27] తండతండలు దిరుక్కుంట
దండదాసరి గాల్లు వచ్చిరి
తంబురాలు మీటుకుంట
తందాన కదలు సెప్పసాగిరి

ఊరినడుమ సెట్టుకిందికి
[28] గేరి గేరి తర్లివచ్చెను
బాలనాగు [29] గోస యిని యిని
యెలనాగలంతా యేడ్వసాగిరి

దొరలకోట ముందరేమో
దొమ్మరోల్లు గడల పాతితె
గడలమీద మొగ్గలేసి
గడుసుపిల్ల ఆటలాడెను.

[30] గవిని ముందల బోగమోల్లు
[31] అల్లిరాణి ఆటనాడిరి
సీసెడంత సారదాగి
యేసమేసి యెగిరిపోయిరి.

యేసమూల జొసుకుంట
తిక్క[32] మ్యాక్కైపాయె జనము
యిల్లు వాకిలి యిడిసిపెట్టి
యిట్ల గూకుంటెట్ల మనము

ఊరి బయిటా వుండి వుండి
పొగలతోటి[33] పగలు లేసెను
యెండదేవునికన్న యెక్కువై
మండసాగెను గుడిసెలన్ని

ఒక్క గుడిసె అంటుకోని
పక్క గుడిసెను పల్కరించెను
సూస్తు వుండగ గూడెమంతా
లంగలార్పుల అంగలాయెను.

పేగులు లెనోల్ల గొస
పగటి దేవుడు సూసి సూసి
కోపము సల్లార్సుకోని
కొండసాటున పండుకొనెను

అర్థాలు :—1) సప్తఋషులనబడే నక్షత్ర సముదాయం, 2) వెంట్రుకలు, 3) కృత్తికా నక్షత్రం, 4) పెద్దబుట్ట, 5) నక్షత్రవిశేషం, 6) శుక్రుడు 7) మెడ, 8) భుజం, 9) ప్రకృతి, 10) మురికిదైన 11) చిన్నకడప, 12) కల్లాపి 13) జ్వరం, 14) కంసాలి, 15) కత్తి, 16) తిండికోసం ఉద్యోగంలో చేరినవారు, 17) నిప్పుల కుంపటి, 18) సూర్యుడు, 19) శరీరాలు, 20) ఫ్యాన్‌లు. 21) ఏర్ కండిషనర్లు 22) కాలవ, 23) వాగూ వంపూ అంటాడు, వంపుక వర్షాకాలంలోనే నీళ్ళుంటాయి. 24) దాహం, 25) దుప్ప 26) వర్షాకాలంలో చిన్నగా పారెడి ఊటలాటిది, 27) చిన్ని చిన్ని గూడెములు, 28) వీధి, 29) కష్టం, 30) ముఖద్వారం, 31) భారత కథలోని ఓ భాగం ప్రమీలార్జునీయం, 32) మేక, 33) కక్షలు.



రక్తయజ్ఞం

శ్రీ కలువకొలను సదానంద

(గతసంచిక తరువాయి)

వర్షం ఆగిపోయింది.

వర్షించిన మేఘం తేలిపోయింది.

దాహశాంతి తరవాత బట్టలాక్కోవడానికి శక్తిచాలక నిద్రకళ్ళతో పడుకున్న కాముకిలా వుంది ప్రకృతి.

సుందరం కళ్ళు తెరిచాడు.

కొలిమిలో ఎర్రగా కాలి, సమ్మెట పోట్లు తిని, చుయ్యిమంటూ నీళ్లలో మునిగిపోయిన ఇనుప బద్దీలా చలనరహితంగా పడివుంది అతని శరీరం. అతనిశక్తి అతని శరీరాన్ని విసిరి పారేసి, ఎక్కడికో పారిపోయింది.

అతని వీపుక్రింద ఇసుక చల్లగా వుంది. అతని ఒంటిని కోసుకుంటూ ప్రక్కగా సన్నటి నీళ్ళపాయ ప్రవహిస్తోంది. గౌరి అతనిమీద అశక్తంగా చెయ్యివేసి, పక్కకు పొర్లి పడుకుని వుంది. ఆమె కళ్ళు మూతలు పడ్డాయి. ముఖం తృప్తితో వెలిగిపోతోంది. ఆమె ఒంటిమీద బట్టలు లేవు. ఆమె గుండెలు లయబద్ధమైన శ్వాసతో కదులుతున్నాయి. నీటిపాయ ప్రక్కన — పాపపు ముద్దలా పడివున్న ఎర్రటిబట్టలు వుండ చుట్టుకుపోయి, రహస్యంలా నల్లగా కనిపిస్తున్నాయి.

గౌరి యింకా పులకరింతలోనే వుంది. ఆమె పెదవులమీద సెలయేటి కలకలలా సన్నటినవ్వు వెలువడింది. సుందరం ఆమె పక్కలోనుంచి పైకి లేవాలనుకున్నాడు. ఎలా? ఆమె చెయ్యి తన పైన వుంది. అతడు ఆచేతిని మెల్లగా తీసి అవతల పెట్టాడు. ఆమె చెయ్యి తడిసిన దారంలా క్రిందికి వాలిపోయింది.

సుందరం లేచి కూర్చున్నాడు.

ఆమె పైకి లేవలేదు. కళ్ళు తెరవలేదు. విశ్రాంతి తీసుకుంటోంది. అది సామాన్యమైన విశ్రాంతి కాదు. ఎంతో ప్రయత్నంతో, ప్రయాసతో సాధించిన విశ్రాంతి! గొర్రెను మింగి ఉండ చుట్టుకు పడుకున్న కొండచిలువలా పడివుంది ఆమె. కోరిక ఆమెను మర్దించి పెదాలు నాక్కుంటూ వెళ్లిపోయింది. ఆమెకు విశ్రాంతి కావాలి! అప్పుడు—ఆమె దాహశాంతి తప్ప మరేమీ కోరలేదు. ఇప్పుడు— విశ్రాంతితప్ప మరేమీ కోరటంలేదు.

సుందరం— కామ గహ్వరం లాంటి ఆ వంతెనలోంచి బయట పడ్డాడు. రోడ్డుమీదికి వచ్చాడు చీకటి! చీకటిగా వుందని అతడనుకోవడంలేదు. దారి వెతుక్కోవడంలేదు. నడుస్తున్నాడు. తాను వేరు చీకటి వేరు అన్న భావం అతనికి లేదు. చీకటి గర్భంలోని ఓ వెల్లువ తాను! చీకటి తనను మింగేసింది ఇక వెలుగులేదు. తెల్లవారదు... పిచ్చిగా పరిగెత్తి పోవాలనిపిస్తోందతనికి. దిక్కులను దాటి పోవాలనిపిస్తోంది. అది ఎలా సాధ్యం? ఎంత దూరం పరుగెత్తినా దిక్కులు చేతికందవు. భూమి బల్లపరుపుగా వుంటే ఎంత బావుంటుంది! అంచుదాకా పరుగెత్తి, అవతలికి దూకేయవచ్చు!

విధి తనను చీకటి అనే విషవృక్షానికి ఉంటుగట్టేసింది. విషం ప్రాకి, తన శరీరం నల్లబడిపోయింది. తనను ఈ చీకటినుండి విడదీసే శస్త్రం ఎక్కడుంది?

తాను విషం త్రాగాడు. అది ప్రాణంతీసే విషం కాదు. సౌశీల్యాన్ని చంపివేసే విషం! ఆ విషం పేరు వ్యభిచారం!

'వ్యభిచారం పాపం అని నాకు తెలుసు! నా మనస్సూ, శరీరం రెండూ నా మాట విన్నాయి నాది కాని ఏదో మహాశక్తి నన్ను అభ్యంతర పరచింది. ఆ శక్తి చాలా నిరంకుశమైనది సద్బోధకంటే కూడా ఎంతో బలమైనది! నాకేమీ తెలియదు. నా దేహమంతా నరకంలో పడిపోయింది. అయ్యో!......'

లోతులు తెలియని నరకకూపంలో తలక్రిందులుగా పడిపోతున్నట్లుంది సుందరానికి. ఆ కూపం అడుగున గౌరి చేతులు చాచి

నవ్వుతూ నిలబడి వుంది. కూపం అంచున నిలబడివున్న సుశీల నలు సంత దీపంలా కనిపిస్తోంది. ఆమె లోపలికి తొంగిచూస్తూ 'బావా' అంటూ ఏడుస్తోంది,

'పడిపోయాను సుశీ!' అంటూ కేకవేశాడు సుందరం.

అతని కళ్లు జిగేలు మన్నాయి, ఎదురుగా వేగంగా వస్తూ వున్న లారీ అతన్ని తాకుతూ ఒక్క వూపున ఆగిపోయింది. సుందరం బానెట్ మీదికి తూలాడు.

డ్రైవరు కిందికి దిగాడు. కోపంతో కయ్యిమన్నాడు.

'ఇంకో క్షణంలో పడేవాడివే! వెంట్రుకవాసిలో బతికి బయట పడ్డావు. కళ్లూ, చెవులూ రెండూ లేనివాడివి— రోడ్డుమీద కెందు కొచ్చావు? మమ్మల్ని చంపటానికా? పో, అవతలికి!' అంటూ కసిరేసి లారీలో ఎక్కి కూర్చున్నాడు. లారీ గుర్రుమంటూ వెళ్లిపోయింది.

సుందరం మరబొమ్మలా నడుస్తున్నాడు.

'...ఇది నిజంకాదు! ఇంద్రజాలంలాటి ఉత్పాతం ఏదో జరిగి పోయింది, నేను ఎందుకిలా నడుస్తున్నాను? ఇది ఏ లోకం?... ఇదంతా ఒక కల! నేను కలలో విహరించాను. కలలో నడుస్తున్నాను, ఇదంతా అసత్యం! ఇప్పుడు నిజంగా నేనిక్కడలేను!... ఇంట్లో పడు కుని నిద్రపోతుంటాను! ఇక కాస్సేపటికి మేలుకుంటాను!... నా చుట్టూ ఈ చీకటి వుండదు, నేను ఈ రోడ్డుమీద వుండను, నా మంచంమీద కూర్చుని, ఆశ్చర్యపోయి చూస్తాను!... ఈ చేదు నిజ మంతా కరిగిపోయి, కలగా నిలిచిపోకూడదూ?'

'నాగరాజు కూతురుతో నాకు లైంగిక సంబంధం ఏర్పడు తుందని నేను ఊహించనైనా లేదే! హఠాత్తుగా ఈ తప్పు ఎలా జరిగిపోయింది? చిన్నప్పటినుంచీ నా సుశీలనే ఊహించుకున్నాను. ఆమెనే కోరుకున్నాను. ఇవాళ చిత్రంగా గౌరి చేతుల్లో ఒంటరిగా చిక్కుకుపోయాను. ఆమె మగవాడై, నన్ను ఆడపిల్లను చేసేసింది. నన్ను చెరిచేసింది. మానభంగం చేసేసింది. నా శీలాన్ని గురించి నే నెంత గర్వపడ్డాను! కొంచ కొనలాంటి నా ఔన్నత్యం ఫెళ్ళున విరిగిపోయింది. ఛిఛ్ఛి ఛిఛ్ఛి! సుశీలతో కలిసి పంచుకోవలసిన ఆనం దాన్ని గౌరితో అనుభవించానా! ఛీ ఛీ!... శోభనం గదుల్లో పెళ్లి కూతుళ్ళు తారుమారైనట్లుగా వుంది! బొట్టు ఒకరికి కట్టి, బాతు పరాకరితో జరిగిపోతే, ఆ పొరబాటుకు సవరణ సాధ్యమా?... అయ్యో! నేనుకూడా—సుందరం అనే నేనుకూడా—తప్పు చేసే శాను! ఇది నమ్మశక్యం కాని నిజం! మనిషి తప్పు చేయడం మామూలు! ఇవాళ నేను కూడా మామూలు మనిషినైపోయాను! నా కిరీటం పతనమైపోయింది!...'

సుందరం గతుకుల్లో పడి నడుస్తున్నాడు. జుల్లుమంటూ చల్లటి గాలి వీస్తోంది. చలికి ఒళ్ళు కొంకర్లు పోతోంది. మృత్యువు లాంటి చలి! యమయాతనలాంటి చలి! అతనికి తన శరీరం మీద కసి పుట్టుకొచ్చింది. వెధవ శరీరం! అంతటి అపవిత్రతనే భరించ గలిగిన శరీరం — కేవలం చలిని భరించలేకపోతుందా?... భరించనీ! దీనిపట్ల దయ చూపరాదు!

ఊరి పొలిమేరలు దగ్గరపడ్డాయి. ఊళ్ళోని విద్యుద్దీపాలు మసకగా వెలుగుతూ కనిపిస్తున్నాయి. ఆ మిలమిలలు—తప్పు చేస్తూ దొరికిపోయిన స్త్రీ పురుషుల ముఖాల్లోని సిగ్గుల్లా వున్నాయి. రోడ్డు ప్రక్కగా — మలుపు తిరిగిన రైలుకట్ట మీద గూడ్సు రైలు ఆగి పోయి వుంది. చివరనున్న గార్డు పెట్టెలో — గుడ్డి దీపం గార్డు గుండెకాయలా బిక్కు బిక్కు మంటోంది. కొన్ని పెట్టెలు పట్టాలు తప్పాయి. ఒక పెట్టె మాత్రం పక్కకు దొర్లిపోయి, కట్ట దిగువ అనాకారంగా పడివుంది.

మరికొన్ని నిమిషాల్లో సుందరం తన యింటి ముందు నిల బడ్డాడు. ఊరంతా మత్తుగా నిద్రపోతున్నది. 'కొక్కొరోకో!' అంటూ తొలి కోడి కూస్తోంది. ఆ కూతకు—దట్టమైన చలి ఇనపరేకులా గరగర లాడింది.

మంచు కప్పుకుని, గొంతు చల్లబడిపోయిన కోడిలా 'అమ్మా!' అని పిలిచాడు సుందరం.

లోపల — అతని తల్లి నిద్రపోతున్నది.

అతడు రెండు మూడు సార్లు ఆమెను పిలిచాడు.

'అమ్మా!'

రెండక్షరాల ఆ శబ్దం అతని కెంతో ఊరట నిచ్చింది. అతని కనుకొలకుల్లో రెండు కన్నీటిబొట్లు నిలిచాయి.

రాజమ్మ నిద్రకళ్ళతో లేచివచ్చి తలుపు తీసింది.

సుందరం సరాసరి లోపలికి వెళ్ళి, మంచంమీద వాలిపోయాడు. 'ఇంత చలిలో ఎలా వచ్చావురా?' అంటూ రాజమ్మ అతనివైపు పరీక్షగా చూసింది. 'బట్టలు అలా వున్నాయేమిట్రా? వానలో తడిశావా ఏమిటి? ఆ బట్టలు తీసెయ్యరాదూ?' అంటూ దగ్గరికి వచ్చి, ఒంటిమీద చెయ్యి వేసింది. అతని ఒళ్ళు చుర్రుమంటూ కాలి

పోతున్నది. 'అయ్యో! ఇదేం జ్వరంరా బాబూ? ఒళ్ళు యిలా కాగిపోతోందేమిటీ?' అంటూ కంగారు పడిందామె. తానే అతని బట్టల్ని విప్పేసి, ఒంటినిండా దుప్పటి కప్పి, అతని నుదురు, చెంపలూ నిమురుతూ పక్కన కూర్చున్నది.

పురుడు పోసుకోటానికి పుట్టింటికి వచ్చిన పక్కింటి అమ్మాయి అప్పుడే ప్రసవించిందేమో — ఆ నీరవ నిశ్శబ్దంలో 'ఉంగా! ఉంగా!' అంటూ బిడ్డ ఏడుస్తోంది.

తల్లి రొమ్ముల్లో పాలు చేపుకొచ్చింది.

7

సుందరానికి రెండు రోజులపాటు జ్వరం కాచింది. అతడు ఆ రెండు రోజులూ యింట్లోంచి బయటకు కదలలేదు. మనుషులకంట బడటానికి భయం వేస్తోందతనికి. అద్దంలో తన ముఖాన్ని చూసుకోవాలన్నా అసహ్యం వేస్తోంది. నిర్మలమైనవనుకున్న తన కళ్ళ లోతుల్లో మాలిన్యం నిండిపోయినట్లు, తన సౌందర్యాన్ని పురుగులు తినివేసినట్టు, తన ముఖం వికారంగా మారిపోయినట్లు అనిపిస్తోంది. అద్దంలోని తన ప్రతిబింబాన్ని చూడటానికి సిగ్గు వేస్తోంది.

ఫోటోలోని సుశీల విశాల నేత్రాల్లోకి సూటిగా చూడలేక పోతున్నాడు. ఆ కళ్ళు తనవైపే తిరిగివున్నాయి. ఆమె తనను గుచ్చి గుచ్చి చూస్తోంది. ఆ చూపులతో తన చూపులు కలుసుకుంటే, యింకేమైనా వుందా? ఆమె చూపులు తన కళ్ళలోకి చొచ్చుకుపోయి, లోపలి రహస్యాల్ని లాగి బయట పడేస్తాయి! సుశీల ముందు తన రంగు బయట పడిపోతుంది! తనలోని మచ్చ ఆమెకు తెలిసిపోతే, తరవాత ఈ బ్రతుకెందుకూ?... సుశీల కళ్ళలోకి చూడకూడదు. ఆమె హృదయ పీఠాన్ని వదులుకోకూడదు.

'నా మనస్సులోకి తొంగి చూడకు సుశీ!... పనికిమాలిన మనస్సు! దాంతో నీకెందుకూ? నీ మనస్సు మాత్రం నాకివ్వు! నా శరీరాన్ని తీసుకో! నా జీవితాన్నంతా తీసుకో! నా మనస్సు నీదే! దాన్నెందుకు పరీక్షిస్తావు? అనుమానం భూతద్దంలాంటిది? అది గోరంతను కొండంతగా చేసి చూపిస్తుంది. నా మనస్సులోవున్న చిన్న నలుసు నీ కంటికి కాటుకకొండలా కనిపిస్తుంది. నువ్వు నిరాశ పడిపోతావు. నువ్వు నిరాశ పడిపోతే నేను చీకట్లోకి పడిపోతాను. మనస్సు మీది పొరల్ని విప్పిచూడకు! దాని మానాన అది వుంటుంది. నాకు నువ్వూ, నీకు నేనూ వుంటే చాలదూ? ఇంకేం కావాలి? మనిద్దరం పెళ్ళి చేసుకుందాం. ఇద్దరం ఒకే రోజున చచ్చిపోదాం. నువ్వు తప్ప నాకు వేరే ప్రపంచం లేదు. నా మాట నమ్ము సుశీ!...'

సుందరం గుండె బాధగా మూలిగింది.

'పందులు దొర్లిన బురదగుంటలా నా ప్రేమంతా యిలా కలుషితమైపోతోందేమిటీ? సుశీలతో నేను ఊహించుకున్న బ్రతుకంతా నటనగా తయారవుతుందా? స్వచ్ఛమైన నారికేళ సలిలం లాంటిది నా ప్రేమ. నా సుశీలనుండి నేను దాచుకోవలసింది ఏదీ లేదనుకున్నాను. హాలాహలంలాంటి ఈ రహస్యాన్ని ఎలా దాచుకోను? పూర్తిగా నిండిన నా హృదయభాండంలోంచి కొంత ప్రేమను కిందికి వొంచేసి, దుర్భరమైన ఈ రహస్యాన్ని అందులో దాచుకోవాలి. ఇది పైకి కనిపించకుండా, బూటకపు ప్రేమను దట్టంగా కప్పుకుని జాగ్రత్తపడాలి. అది మాయబ్రతుకు! మిథ్యా దాంపత్యం! ప్రాణంలా నివసించి, నీడలా వెంటనడిచే పెళ్ళాందగ్గర — భర్తకు రహస్యమా? అలాంటి భర్త అంతరంగం దయ్యంలాంటిది. దేవుడి వేషం వేసుకున్న దయ్యంతో ఆమె కాపురం చేయాలి. అయ్యో పాపం... పిచ్చి సుశీల!... ఆమెకు తెలియరాని ఈ పాపిష్టి రహస్యం నాపాలబడింది. నా హృదయం — సుశీల కన్నుగప్పి వ్యభిచరిస్తోంది. సుశీలకు చోటిచ్చిన నా హృదయంలో — ఈ రహస్యంకూడా చోటు చేసుకుంటోంది. ఓ రహస్యమా! నువ్వు బ్రహ్మరాక్షసివి! అక్కపిడతలాంటి ఈ చిన్న గుండెకాయలో ఇమిడిపోవడం నీకే చేతనౌను! నువ్వెక్కడికీ వెళ్ళకు! నా గుండెను గిల్లుతూ నాలోనే వుండిపో! నాతోనే చచ్చిపో!...'

గౌరి నీళ్ళకోసం కొళాయివద్దకు వచ్చినప్పుడల్లా — అక్కడ ఆమె ఉనికి స్పష్టంగానే తెలిసిపోతోంది. ఇంట్లోవున్న సుందరానికి వినబడేలా కాస్త బిగ్గరగా మాట్లాడుతోంది. కొళాయివద్ద మూగిన వాళ్ళతో అసందర్భమైన కబుర్లు చెబుతుంది. ఆ మాటల్లో కొత్త అందాలొచ్చాయి. ఆ నవ్వుల్లో సంగీతం వచ్చింది. చిత్రం ఏమిటంటే — ఇప్పుడామె ఎవరితోనూ పోట్లాడటంలేదు. బండబూతులు తిట్టడంలేదు. బుద్ధిమంతురాలిలా నడుచుకుంటోంది. ఆమె కంఠస్వరంలో — సుందరంకోసం అన్వేషణ ప్రస్ఫుటమవుతోంది.

'శివరాత్రికి నువ్వు యింట్లోనే వున్నావా అండాళ్ళూ?' ... అది గౌరి గొంతు.

'ఇంట్లో వుండకుండా యింకెక్కడికెళ్ళను?'

'నేను తిరణాలకెళ్ళాను. ఎంత బాగుందని! అబ్బ! వానలో తడిసి ముద్దయిపోయాం!'

'ఎవరెవరు?'

'అందరూ !' అంటూ నవ్వింది గౌరి.

'ఇవాళ కొత్త సినిమానా ఏమిటీ ? గోడలమీద బొమ్మలంటిస్తున్నారు.'

'ఈ సినిమా నేను చూశాను — మా మామయ్య వాళ్ళవూళ్ళో !' ... గౌరి.

'ఎలావుంది ? బాగుందా ?'

'ఛఛా ! ఏమీ బాగాలేదు. పాడువేషాలు ! సిగ్గేస్తుంది !'

'గౌరీ ! ఇక్కడే నుంచున్నావేం ? తొందరగా కానీ ! అక్కడ నీళ్ళు లేవు ...' హోటల్ కుర్రాడి గొంతు.

'అంత తొందరేంరా ? ఇక్కడున్న వాళ్లంతా మనుషులు కాదూ ? ...'

ఆమె గొంతు వినిపించినప్పుడల్లా సుందరం ఒళ్ళు చల్లబడిపోయి, నిర్జీవమై పోతోంది. కళ్ళు భయంతో మూసుకుపోయి, గుండె భారంతో కృంగిపోయి, మస్తిష్కం — చీకట్లతో, ఉరుములతో, మెరుపులతో, పిడుగులతో నిండిపోతోంది.

'దేవుడా ! ఇకనాతో చెలగాటం చాలించు ! ... భూమిలో నీళ్లంతా యింకిపోనీ ! ఈ కొళాయి మూతబడిపోనీ ! గౌరి — వాళ్ల యింట్లోనే వుండిపోనీ !'

జబ్బు నయమైన తర్వాత సుందరం బడికి బయలుదేరుతూ వీధిగుమ్మం దాటుతున్నాడు. అప్పుడే కొళాయి దగ్గరకు వస్తున్న గౌరి అతన్ని చూచి బొమ్మలా నిలబడిపోయింది. కొంటెగా అతనివైపు చూచి నవ్వింది. ఆమె మెడలో ముత్యాలహారం వుంది ! వేలితో హారాన్ని సర్దుకుంది ఆమె.

సుందరం తల వంచుకుని గబగబా నడిచాడు ... ఆ దండ గౌరి చేతిలోకి ఎలా పోయింది ? తానిచ్చాడా ? లేదే ! వంతెన కింద జారిపడిపోయిందేమో ! గౌరి తీసుకుంది. సుశీల కోసం కొన్న హారం అది ! దేవుడి నైవేద్యాన్ని కుక్క ముట్టుకుంది !

గౌరి అలా నిలబడిపోయి నవ్వుతుందేమిటి? ఏవరైనా చూస్తే ఏమనుకుంటారు ? నాగరాజుకు తెలిస్తే కొంప మునిగిపోదూ ?

ఆ సాయంకాలం బడి వదలిన తర్వాత అతడు వెంటనే ఇంటికి వెళ్లలేదు. ఆ సమయంలో గౌరి కొళాయి వద్దకు వస్తుందని అతని భయం. రైలుకట్టవైపు వాహ్యాళి వెళ్ళాడు. ఊరి పొలిమేరల కవతల పట్టాలు తప్పిన బండి యిప్పుడక్కడ లేదు. ఇప్పుడా పెట్టెలన్నీ ఎక్కడో ఓ చోట పట్టాలమీద లక్షణంగా పరుగెడుతుంటాయి. అయితే ఒక్క వ్యాగను మాత్రం అక్కడే మిగిలిపోయింది. అది — తలుపులన్నీ విరిగిపోయి, నొక్కులు పడిపోయి, రైలుకట్ట ప్రక్కన పల్లంలో బోల్తాపడి వుంది.

* * *

సుందరం బొమ్మలు వేస్తాడని ఆ వూళ్ళో చాలమందికి తెలుసు !

ఓ రోజు ఓ పదేళ్ళ పిల్ల సుందరం యింటికి వచ్చింది.

తెల్లటి చేతిరుమాలు అతని ముందు పరిచి 'బొమ్మ ఒకటి గీచియ్యి అన్నయ్యా !' అంది.

అతను రుమాలు చేతికందుకున్నాడు.

'ఏం బొమ్మ ?'

'మరి — ఓ అందమైన పువ్వు, దానిమీద ఓ అందమైన సీతాకోక చిలుక !'

అతడు వింతగా ఆ అమ్మాయి ముఖంలోకి చూశాడు. ఆ ముఖం చాలా అమాయకంగా వుంది.

'నాక్కాదన్నయ్యా ! గౌరికి !' అంటూ నవ్వింది ఆ అమ్మాయి.

సుందరం ఉలికిపడ్డాడు.

'ఏ గౌరి ?'

'గౌరీ తెలియదూ ?'

గౌరి తనను దాచపుండులా పట్టుకుంటోంది !

అతని చేతిలో నుంచి రుమాలు జారి క్రింద పడింది.

'నాకు బొమ్మలు గీయటం చేతకాదు ఇంకెవరి [illegible]రన్నా గీయించుకో !'

'గౌరి నీచేతే వేయించుకురమ్మంది.' అంటూ ఆమె రుమాలును మళ్ళీ అతని చేతిలో కుక్కింది.

సుందరం పెన్సిలు తీసుకున్నాడు. పేరు తెలియని ఓ పెద్ద పువ్వు గీచాడు. ఆ పువ్వు నేలమీద పడివున్నట్లుగా వుంది. ఓ చిన్ని సీతాకోక చిలుక — బరువైన ఆ పువ్వు క్రింద రెక్క చిక్కుకోగా, ఎగిరిపోలేక విలవిల లాడుతోంది.

'ఇందా ! తీసుకెళ్ళు !'

'ఇదేమిటన్నయ్యా, ఇలా వేశావు ?'

'అదంతే! నీ కెందుకూ ? నువ్వెళ్ళు !' అంటూ కసురుకున్నా డతను. రుమాలు తీసుకుని ఆ పిల్ల వెళ్లిపోయింది.

రెండు రోజులు గడిచిన తర్వాత మళ్ళీ వచ్చింది.

'ఎందుకొచ్చావు ?' అన్నాడు సుందరం కోపంగా.

'నువ్వు వేసిచ్చిన బొమ్మను గౌరి చాలా మెచ్చుకుందన్నయ్యా! ఈ అల్లిక నీకు చూపించి రమ్మంది.' అంటూ ఆ అమ్మాయి రుమాలు విప్పి చూపించింది.

రంగు దారాల అల్లిక అందంగానే వుంది. పువ్వు ఎర్రగా వుంది. దాని కింద చిక్కుకున్న సీతాకోకచిలుక రెక్కలు నీలంగా వున్నాయి. బొమ్మను చూస్తూ వున్న సుందరం కంటిమీద రెప్ప పడలేదు.

'ఎలా వుందన్నయ్యా ?'

'బాగుంది !'

ఆ అమ్మాయి రుమాలు అందుకుని తుర్రున వెళ్ళిపోయింది.

తరువాత గౌరి ఓసారి అతనికి ఎదురుపడింది. అతన్ని చూచి తియ్యగా నవ్వింది. నడుమున దోపుకున్న రుమాలు తీసి అందంగా పెదాలు తుడుచుకుంది.

సుందరం గబగబా యింట్లోకి వచ్చిపడ్డాడు. మన్మధుడు తనను వెంటాడుతున్నాడు. గౌరి అనే బలమైన ఆయుధం తనమీద ప్రయోగింపబడుతోంది. సుశీల మీద పాతుకుపోయిన తన గుండెను పెకలించివేయాలని చూస్తోంది గౌరి. అలా జరగనివ్వకూడదు. గౌరిని తాను మరిచిపోవాలి. ఆమె చూపులకు, నవ్వులకు, చేష్టలకు అచంచలంగా నిలబడాలి! తన సుశీల తప్ప యింకో లక్ష్యం తనకుండ కూడదు. లోకంలో బుద్ధిపూర్వకంగానే ఎందరు తప్పుచేయటంలేదు? వాళ్ళ తప్పులన్నీ మరుగు పడిపోవటంలేదూ? తనతో నిమిత్తంలేకుండా తన శీలం చెడిపోయింది. పోతేపోనీగాక! ఏం చేయగలడు తాను ? ఏమీ జరగనట్లే వుండిపోవాలి!... గౌరి కూడా చెడిపోయింది. ఎవరికీ తెలియదు. పాపం, గౌరి! ఆమెపట్ల జాలి చూపరాదు. తాను కఠినుడైపోవాలి. రైలు ప్రయాణంలో రెస్టారెంటు భోజనంలా — జీవితంలో ఆమె తనకు తారసిల్లింది. అంత తప్ప ఆమెకూ, తనకూ యింకేమీ సంబంధం లేదు. సంచలనానికి చోటివ్వక మనస్సును అదుపులో పెట్టుకోవాలి. క్రమశిక్షణ లేని మన్మధుణ్ణి మెడపట్టి గెంటేయాలి! వాణ్ణి కాల్చిపారెయ్యాలి!

సుందరం కాగితం తీసుకున్నాడు. వంకరటింకర గీతలతో ఓ బొమ్మ గీచాడు. ఒకరినొకరు గాఢంగా కౌగిలించుకుని నగ్నంగా నిలబడ్డ స్త్రీ పురుషులు!... అతడు చిక్కగా ఎర్ర రంగు కలిపాడు. ఆ రంగునంతా బొమ్మమీద మరకలు మరకలుగా, చారలు చారలుగా ఒలకబోశాడు. కాగితం నెత్తుటితో తడిసినట్లు తయారైంది. కొంతసేపటికి రంగులు ఆరిపోయాయి.

'వీడి పేరే కాముడు! కాముణ్ణి నామరూపాలు లేకుండా కాల్చి, బూడిద చేసేస్తాను!'

సుందరం అగ్గిపుల్ల గీచి ఆ బొమ్మకు నిప్పంటించాడు. కాముడు భగభగా కాలిపోతుంటే, ఆ వెలుగులో సుందరం ముఖం సంతోషంతో మెరిసింది.

ఆ రాత్రి — తానూ, గౌరీ పెళ్లిపీటల మీద కూర్చున్నట్టు, తమ ఎదురుగా సుశీల తల విరబోసుకుని ఏడుస్తున్నట్టు కల వచ్చింది. సుందరం అదిరిపడి లేచి కూర్చున్నాడు. అతనికి భయం వేసింది. గౌరికీ, తనకూ పెళ్లి! వర్ణాంతర వివాహం! వర్ణ విభేదాలు తనొక్కడు పాటించకపోయినంత మాత్రాన సమస్యలు తీరిపోయి నట్లేనా ? ... నాగరాజు ఒప్పుకుంటాడా ? ఒప్పుకున్నాడుపో; అమ్మ మాత్రం చచ్చినా ఒప్పుకోదు. ఆమె కడుపులో పిడుగు పడుతుంది. వర్ణాంతర వివాహం అనేది — మధ్యతరగతి జీవితాల్లో కేవలం ఒక ఆదర్శంగా వుంటోందిగానీ, సర్వసాధారణమైన సామాజిక వ్యవస్థగా యింకా పరిణతి చెందలేదు. గౌరిని తాను పెళ్లి చేసుకుంటే, ఆ బ్రతుకెలా వుంటుంది ? అమ్మ ఆశలన్నీ అణగారిపోతాయి. బంధువులు చిన్నచూపు చూస్తారు. ఊళ్ళోవాళ్ళంతా — ఏదో చిత్రమైన కబురు చెప్పుకుంటున్నట్లు హేళనగా మాట్లాడుకుంటారు. 'పాపం, సుందరం!' అని జాలిపడతారు ... యింతదూరం ఎందుకు ఆలోచించాలి ? తన హృదయం సుశీలను కోరుకుంటోంది. ఆమె లేకపోతేకదా ఈ పరిణామాలు ? తనకు సుశీలే కావాలి! ఆమెది ఏ కులమైనా ఫరవాలేదు!

కన్ను మూస్తే ఆ కల మళ్లీ వస్తుందేమోనని భయంవేసింది సుందరానికి, ఆ రాత్రి అతనికి నిద్రపట్టలేదు.

అతను కంటబడినప్పుడల్లా—గౌరి వాలుచూపులు విసురుతూ, చిరునవ్వులు ఒలకబోస్తూనే వుంది.

రోజులు గడిచిపోతున్నాయి.

క్రమంగా ఆమె ముఖంలో నవ్వులు మాసిపోయాయి. సుందరం కనబడగానే పక్కకు తప్పుకుని తలొంచుకుని నడుస్తోంది.

కొన్నాళ్ల పిదప — కొళాయి వద్దకు రావడమే మానుకొంది.

'...జరిగిందంతా ఓ పీడకల! తెల్లవారగానే యింటికి పోలీసొచ్చి, రాత్రి కలలో నువ్వు ఖూనీ చేశావు గనుక నిన్ను అరెస్టు చేస్తున్నాము — అంటాడా? ... పీడకల భయపెడుతుందిగానీ, నిజంగా బ్రతుకులోకి జొరబడదు!' అనుకున్నాడు సుందరం.

8

మనిషికి లేనివాటిలో — ఎక్కడెక్కడ ఏం జరుగుతూవుందో తెలుసుకోగల దివ్యదృష్టి ఒకటి. అలాంటి శక్తివుంటే, మనిషి ప్రవర్తన చాలా చిత్రవిచిత్రంగా వుండేది.

నాగరాజు యింట్లో ఏం జరిగిందో సుందరానికి తెలియదు.

ఒకనాటి రాత్రి నాగరాజు భోజనానికి కూర్చుంటూ పెళ్లాంతో అన్నాడు ... 'రేపు ఉదయం తొమ్మిది గంటలకు వాళ్లు రాబోతున్నారు.'

గదిలో గోడకు ఆనుకుని నిలుచున్న గౌరి ఆమాట విన్నది. త్రాటిమీద ఆరవేసిన బట్ట తడి ఆరిపోయి ఎగిరి నేలమీద పడ్డట్టు— గౌరి బలహీనంగా క్రిందికి జారింది. గోడకు ఆనుకుని కూర్చున్నది. ఎవరూ చదవలేని ఆలోచనలు ఆమె చూపుల్లో మెదలసాగాయి.

'అలా కూర్చున్నావేమిటే? అన్నం తిని పడుకో!' అంది ఆమె తల్లి.

'నాకు ఆకలిలేదు.'

ఆ రాత్రి గౌరికి నిద్రపట్టలేదు. రాత్రి తెల్లవార్లూ మేలుకుని, వేకువజామునెప్పుడో కునుకుతీసింది. ఆమెకు కోడికూత వినిపించలేదు. కాకుల అరపులు వినిపించలేదు. సైరన్ మ్రోత వినిపించలేదు. తల్లి కేక విని అదిరిపడి లేచి కూర్చుంది.

'ఒసే గౌరీ! అదేం మొద్దు నిదర? లేలే!'

గౌరి పక్కమీది నుంచి లేచి, తల్లి బలవంతం మీద స్నానం చేసింది. చలువచీర కట్టుకుంది. జడ వేయించుకోటానికి తల్లి ముందు కూర్చున్నది. ఆమె తలదువ్వి జడవేసి, పువ్వులు ముడిచి, కూతురి ముఖాన్ని తన వైపు తిప్పుకుని, వాత్సల్యంగా చూచింది. గౌరి ఆమె కళ్లల్లోకి చూస్తూ 'అమ్మా ...' అంది. ఏదో చెప్పా లన్న ఆరాటం ఆమె చూపుల్లో కనిపిస్తోంది.

'ఏమే?'

గౌరి చూపులు క్రిందికి వాలిపోయాయి. ఆమె నోరు మూగ పోయింది.

'ఇంత భయపడి పోతున్నావేమిటే — లోకంలో నీ కొక్క దానికే పెళ్లి అవుతున్నట్టు?' అంటూ ముద్దుగా నవ్వింది ఆమె తల్లి.

నాగరాజు ఆరోజు హోటలుకు వెళ్లలేదు. సిల్కు కండవా తీసి భుజాన వేసుకుని, యింట్లోనే కూర్చున్నాడు. పెళ్లిచూపులకు రావలసిన వాళ్లు తొమ్మిదిగంటలకు రానేవచ్చారు. వాళ్లకు జరగవల సిన మర్యాదలన్నీ జరిగాయి.

అబ్బాయి వంట్లాం నలగకుండా కుర్చీమీద కూర్చున్నాడు. అతడు అందంగానే వున్నాడు. ఎత్తుగా, ఎత్తుకు తగినంత లావుగా వున్నాడు. కోరమీసం మీదికి పోతున్న చేతిని బలవంతంగా దించుకుంటున్నాడు. మడతపెట్టిన చేతిరూమాలుతో ముఖం అద్దు కుంటున్నాడు. అతని తల్లిదండ్రులిద్దరూ చాపమీద కూర్చున్నారు. కోడలు కాబోతున్న పిల్లకు — తమకంటే మంచి అత్తమామలు ప్రపంచంలో వెతికినా వుండరనిపించేటట్లుగా — పరమ శాంతంగా వున్నారు వాళ్లు.

వీపున ఎవరో తుపాకీ ఆనించి నడిపిస్తున్నట్లుగా — గౌరి వాళ్ల మధ్యకు వచ్చింది. అందరూ ఆమెను పరీక్షగా చూశారు. అబ్బాయి కళ్లు రెపరెపలాడాయి. గౌరి గిర్రున వెనక్కు తిరిగి వంటింట్లోకి వెళ్లిపోయింది.

'అమ్మాయి బాగుంది!' అన్నారు ముసలివాళ్లిద్దరూ.

'ఏమిరా? అంతా మా యిష్టప్రకారమే చేశామని, నింద వెయ్యకు! అమ్మాయి నీకు నచ్చిందా? సిగ్గెందుకు? చెప్పు!' అని కొడుకును అడిగారు.

'నచ్చింది!'

తలుపు చాటు నుంచి గౌరి గొంతు ఖంగున వినిపించింది... 'నాకు నచ్చలేదు!'

ఆ ఒక్క మాటతో ఆ యింట్లోని వాతావరణం చిత్రంగా మారిపోయింది. మధురంగా మ్రోగుతున్న వీణాతంత్రులు పుటు క్కున తెగిపోయి, భయంకర నిశ్శబ్దం నెలకొన్నట్లయింది. కుర్చీలో కూర్చున్న అబ్బాయి ముఖంలో ముచ్చెమటలు పోశాయి. అతని తల్లి దండ్రులు — నాటకం పూర్తయిన పిదప రంగులు తుడుచు కుంటున్న వాళ్లలా వికారంగా కనిపించారు. ఆ సమయంలో వాళ్లను చూస్తే, ఏ ఆడపిల్లా వాళ్లకు కోడలు కావటానికి ఒప్పుకోదు.

గౌరియింట్లో వాళ్లందరూ ఆశ్చర్యపోయారు.

'గౌరీ! ఏమిటమ్మా అది? ...' అన్నాడు నాగరాజు.

'ఔన్నాన్నా ! ... అందరికీ నచ్చితే నాకు నచ్చొద్దూ ? ... నేను పెళ్లే చేసుకోను. అంతే !'

నాగరాజు పెళ్ళాం కళ్లలో నిప్పులు కురిశాయి.

'ఒసేయ్ ! నీకు దయ్యం పట్టిందా ?'

ముసలివాళ్లిద్దరూ పైకి లేచారు.

'ఒరే అబ్బాయ్ ! ఇంకా కూర్చున్నావేంరా ? నువ్వెంతో అదృష్టవంతుడివి ! నీకు తప్పకుండా మంచి పెళ్ళాం దొరుకు తుంది ! ... పోదాం, లే !'

వాళ్ళు ముగ్గురూ లేచి వీధి గుమ్మంవైపు నడిచారు. నాగరాజు వాళ్ళను అనుసరిస్తూ కాళ్ళా వేళ్ళా పడ్డాడు. 'దానికి మాట్లాడ టమే చేతకాదండీ ! ఏదో అనబోయి, మరేదో అనేసింది. కుర్రదాని మాటలు మీరు పట్టించుకోకూడదు. శాంతించాలి ! అసలు — దానిదొక మాటా ? ఇచ్చి పుచ్చుకోవల్సిన వాళ్ళం మనం ! మీరిలా కోపగించుకోకూడదు...'

'మనం యిచ్చి పుచ్చుకోవల్సిన వాళ్లమేగానీ, కాపరం చేసే వాళ్ళం కాముగా? మీ అమ్మాయిని ఆమెను నచ్చినవాడికిచ్చి చెయ్యండి. మీ అమ్మాయీ సుఖపడుతుంది, మావాడూ సుఖపడతాడు. ఇంతకూ — చెప్పొద్దూ... మీ అమ్మాయి మాకు నచ్చలేదు.'

'వాళ్ళు వీధి గుమ్మం దాటుకోగానే — నాగరాజు బతిమాలు కోవడం మానేశాడు. అరుగుమీద ఠీవిగా నిలబడి, ఆదరపూర్వకంగా చిరునవ్వు నవ్వుతూ 'క్షేమంగా వెళ్లిరండి ! వెళ్లగానే వుత్తరం రాస్తారుకదూ ?' అన్నాడు.

'ఎంతమాట ! ... ఇంక మీరు ఆగండి ! మేము వెళ్ళి... వెళ్ళి... మరి మాకు సెలవా ?' అన్నారు వాళ్లుకూడా మర్యాదగానే.

వాళ్ళు అలా వెళ్ళిపోగానే — నాగరాజు కోపంగా యింట్లోకి మరలాడు. అప్పటికే — యింటిలోని వాళ్లందరూ గౌరి చుట్టూ చేరి, ఆమెను నానా మాటలూ అనడం మొదలుపెట్టారు.

'ఎంతకు తెగించావే! నీ ముఖానికి వాడికంటే చక్కటి మొగుడు దొరుకుతాడనుకున్నావా ? ఏం ? వాడెందుకు నచ్చలేదు ? నీ అందం వాడికి లేదనా దరిద్రపుముండా !' అంటూ ఆమె తల్లి మూతిమీద పొడిచింది.

అందరూ అలా తిడుతూవుంటే గౌరికికూడా కోపం వచ్చింది.

'మీరు చేసుకోమన్నవాణ్ణే నేనెందుకు చేసుకోవాలి ? మీకు చేతనైతే నన్ను సుందరానికిచ్చి చెయ్యండి !'

'ఏ సుందరం ?'

'రాజమ్మ కొడుకు !'

ఆమె మాటలు విని అందరి ముఖాలూ వెలవెలబోయాయి. నాగరాజుకు కోపం వచ్చింది. అయితే అతడు ఆ కోపాన్ని గౌరిమీద ప్రయోగించలేకపోయాడు.

'ఆ వెధవనా ? వాణ్ణి పొడిచి పారేస్తాను !' అన్నాడు వాసు.

నాగరాజు పెళ్ళాం విస్మయంతో నోరు నొక్కుకుంది. 'నీకే మన్నా పిచ్చెక్కిందా ఏమిటే ? వాళ్ళ కులమేమిటీ, మన కులమేమిటీ, నీకు కళ్ళు మూసుకుపోయాయి... విన్నారాండీ దాని మాటలు ?'

'ఏ కులమైతేనేం ? మనకింకా కులంగోత్రం అంటూ వుందా? అక్కయ్య పెళ్ళికి అడ్డురాని కులం నా పెళ్ళికే వొచ్చిందా ?' అంది గౌరి.

నాగరాజు యింట్లోనుంచి చరచరా హోటలుకు నడిచాడు. కుర్చీలో కూలబడ్డాడు. ఎప్పుడూ ఏదో ఒకటి వాగుతూవుండే అతని నోటికి ఆ రోజు తాళం పడిపోయింది.

గౌరి అన్నది నిజమే! తానింకా కులాన్ని పట్టుకుని వేలాడటం దేనికి ?

అతని పెద్దకూతురు రంగనాయకి భర్త పేరు చిన్నయ్య. ఐదేళ్ళక్రితం అతను నాగరాజు హోటల్లో పనిచేస్తూ వుండేవాడు. పొట్టిగాను, నల్ల రాయిలా బలిష్టంగానూ ఉండేవాడు. బల్లలు తుడిచేవాడు. గిన్నెలు కడిగేవాడు. రంగనాయకితో కలిసి వెళ్ళి చేద బావిలోనుంచి నీళ్ళు తెచ్చేవాడు. అతనికి నా అన్నవాళ్ళెవరూ లేరు. ఒంటరిగా వుండేవాడు. రాత్రుల్లో హోటలు పాకలోనే పడుకునేవాడు. అతనికీ, రంగనాయకికీ ఎలాగో స్నేహం కలిసింది. అర్ధరాత్రివేళల్లో ఎవరూ చూడకుండా ఆమె హోటల్లోకివెళ్లి, అతనితో గడిపి రావడానికి అలవాటు పడింది. నాగరాజు ఈ సంగతి కనిపెట్టాడు. ఓ రాత్రిపూట వాళ్లిద్దరూ అతనికి దొరికిపోయారు. అతడు చిన్నయ్యను చావగొట్టాడు. ఇక ఈ వూళ్ళో కనిపిస్తే ప్రాణం తీసేస్తానని బెదిరించాడు. తెల్లవారిన తర్వాత — చిన్నయ్య ఆ వూళ్లో కనిపించలేదు. వారం రోజుల తర్వాత రంగనాయకికూడా మాయమైపోయింది. వాళ్ళిద్దరికీ ఎవరిద్వారానో రాయబారం నడిచి నట్లుంది. ఇద్దరూ పొరుగూరికి వెళ్ళి గుళ్లో పెళ్లి చేసుకున్నారు. కొత్తలో — నాగరాజుకు, వాళ్లకు మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమనేది కానీ, ఇప్పుడిప్పుడే ఆ పట్టుదలలు సమసిపోయి, ఒకరి యింటికి మరొకరు వెళ్లిరావడం జరుగుతోంది.

రంగనాయకి నాగరాజుకు ఒక సమస్యను తెచ్చిపెట్టినా, ఆ

సమస్యను తానే పరిష్కరించుకొంది, గౌరి అలా కాదు!... ఈ సమస్య పరిష్కారం కావడం ఎలా ?

చిన్నయ్య తక్కువ కులం వాడు. ఒంటరివాడు. పైగా ఇష్టపడ్డాడు గనుక సరిపోయింది. సుందరం విషయం అలా కాదు, అడిగి భంగపడడంతప్ప—ఫలితంవుండదు, గౌరికి ఇలాంటిపాడుబుద్ధి ఎందుకు పుట్టాలి? వట్టి మొండి పట్టు ఆమెది! ఆమె మనస్సుకు విరుద్ధమైతే, మరొకరి శాసనాన్ని అంగీకరించదు. కన్నతండ్రికైనా భయపడదు. అయితే మాత్రం—మూర్ఖమైన పట్టుదలతో సంకల్పాలు నెరవేరిపోతాయా ?

వూరుకోవడం కంటే వో ప్రయత్నం చేసిచూస్తే మంచిదేమో ! నిన్న మొన్నటిదాకా రాజమ్మ కూలీనాలీ చేసి బతికిందేగా? కులం ఎక్కువైనా ఆంతస్తులేని కుటుంబం. అలాంటి వాళ్లకు సంఘంలో మర్యాద వుండదు. ఇంకా కులమేమిటి? తాను వెళ్లి అడిగితే రాజమ్మ ఒప్పుకోవచ్చు. కట్నం రెండువేలిస్తానంటే లొంగి రాకపోతుందా?

మధ్యాహ్నం మీదట నాగరాజు ఇంటికి వెళ్లాడు. 'రాజమ్మను అడిగిచూస్తాను, ఏమంటుందో!' అన్నాడు పెళ్లాంతో.

'దానికే అనుకున్నాను. మీకు కూడా మతి పోయింది!' అంది ఆమె.

ఆ మాట అతన్ని నిరుత్సాహపరచింది.

'వెళ్లి అడిగినంత మాత్రంలో మన పరువేం పోదులే!' అన్నాడు.

ఆ సాయంకాలం అతను రాజమ్మ యింటికి వెళ్లాడు. జంకుతూ లోపల అడుగుపెట్టి, గొంతు సవరించుకుని 'రాజమ్మా!' అని పిలిచాడు.

అతని రాకకు రాజమ్మ విస్మయం చెందింది.

'రండి! కూర్చోండి!' అంది మర్యాదగా.

నాగరాజు చాలా మర్యాదగా నవ్వుతూ కుర్చీలో కూర్చున్నాడు. ఎలా ప్రారంభించాలో అతనికి తోచలేదు.

'మీ అబ్బాయి లేడామ్మా?'

'ఇంకా స్కూలునుంచి రాలేదండీ!'

'...జరిగిందానికి చింతిస్తున్నానమ్మా!...... తొందరపడి అబ్బాయి మీద చెయ్యి చేసుకున్నాం, ఏదో పొరబాటైపోయింది.అదేమీ మీరు మనసులో పెట్టుకోకూడదు......'

రాజమ్మ చిరునవ్వుతో— 'ఎప్పటి మాటండీ అది? మూడు నెలలైపోతున్నాయి. మేము ఎప్పుడో మరిచిపోయాము' అంది.

ఆమె టేబుల్ సొరుగులోంచి ఓ కాగితాన్ని బయటకి లాగి అతని చేతికిచ్చింది.

'ఏమిటమ్మా ఇది?'

'మా వాడికి పెళ్లండీ! రేపటి వారమే-ముహూర్తం! వాడి మేనత్త కూతురే! పెళ్లి- వాళ్లింటోనే! మీకు పెళ్లి పత్రిక పంపుదామనే అనుకున్నాను. ఈలోగా మీరే వచ్చారు. పెళ్లికి తప్పకుండా రండి!'

ఆశ్చర్యచకితుడైన నాగరాజు ముఖ కవళికలు మారిపోయాయి. తన ముఖంలోని భావాలను దాచుకోవడానికి ప్రయత్నిస్తూ 'అలాగేనమ్మా! తప్పకుండా!... మరినేను సెలవు పుచ్చుకుంటాను.' అంటూ వీధిలోకి వచ్చేశాడు.

నాగరాజు చాలా సిగ్గుపడ్డాడు. ఇంత వయస్సొచ్చికూడా తాను పసిపిల్లవాడై పోతున్నాడేమిటి? తన కూతురుకీ, రాజమ్మ కొడుక్కీ పెళ్లిని తాను ఎలా ఊహించాడు? మరీ మేలే! నోట్లోమాట నోట్లో వుండగానే— పరువుగా బయటి కొచ్చేశాడు. లేకుంటే, ఊళ్లో నవ్వులపాలై పోయివుండేవాడు.

ఈ గౌరికి కొంచెమైనా బుద్ధి లేదు. అది చెప్పినట్లు తాను వినేదేమిటి ? పిల్లలెప్పుడూ పెద్దలమాటే వినాలి ! గౌరి వినకపోతే, దాని చెవులు మెలేసి, వినేటట్లు చెయ్యాలి.

అతను తిన్నగా హోటలుకు వెళ్ళాడు. రాత్రి చాలా ఆలస్యంగా యింటికి వెళ్లాడు. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. గౌరి కనిపించలేదు. అతడు గదిలోపలికి తొంగిచూశాడు. గౌరి తల విరబోసుకుని, గోడవైపు తిరిగి పడుకొనివుంది.

నాగరాజు పెరట్లోకి వెళ్ళి, కాళ్ళుచేతులు కడుక్కొన్నాడు. పైగుడ్డతో ముఖం తుడుచుకుంటూ 'ఆకలిగా వుంది అన్నంపెట్టు' అన్నాడు పెళ్ళాంతో.

ఆమె అతని కళ్ళలోకి చూస్తూ 'అన్నం చెయ్యలేదు' అంది. ఆమె కళ్ళలో భయం, దిగులు దోబూచులాడుతున్నాయి.

'ఎందుకు చెయ్యలేదు ?'

ఆ ప్రశ్నకు ఆమె సమాధానం చెప్పలేదు.

'వాళ్ళతో మాట్లాడారా ?' అంది.

'ఎవరితో ?'

'రాజమ్మతో !'

'అఏ. రు లేదు.'

'ఎందుకూ ?'

'అంతా చెయ్యిదాటిపోయింది.'

'వెళ్ళి వాళ్ళ కాళ్ళయినా పట్టుకోండి! లేకపోతే మనకొంప మునుగుతుంది.'

'ఏమంటున్నావు ?' అంటూ నాగరాజు అనుమానంగా ఆమె వైపు చూశాడు. ఆమె పెదాలు అతని చెవిలో గుసగుసలాడాయి. ఆ సమయంలో గదిలోని గౌరి గువ్వలా ఒదిగిపోయి వుంటుంది.

నాగరాజు నెత్తిన పిడుగు పడ్డట్లయింది.

'నిజంగానా ?'

అతడు పిచ్చివాడిలా నెత్తిబాదుకున్నాడు. కోపంతో వూగిపోయాడు. విసురుగా గదిలోకి వెళ్ళాడు. 'గౌరీ !' అంటూ మేఘంలా గర్జించాడు. మరుగుతున్న పాత్రమీది మూతలా త్రుళ్ళిపడింది గౌరి.

'మీ అమ్మ చెప్పింది నిజమేనా ?' అని వురుముతూ ఆమె కళ్ళలోకి సూటిగా చూశాడు నాగరాజు.

అతని చూపులను భరించలేక గౌరి తలవంచుకొంది.

'ఎందుకుచేశావ్ ఆపని ?'

గౌరి శరీరం గడగడలాడింది.

'నిన్ను చంపేస్తాను. పాతిపెట్టేస్తాను.' అంటూ నాగరాజు ఆమెను చావబాదేశాడు. ఆ దెబ్బలకు — పెనుతుపానులో చెట్టులా ఊగిపోయింది గౌరి. ఆమె తల్లులిద్దరూ అడ్డుపడకపోతే, ప్రాణమైనా మిగిలివుండేదికాదు.

గౌరి ఏడవలేదు. ఆమెకు తండ్రిమీద కోపం వచ్చింది. ఆమెలో పౌరుషం పెరిగిపోయింది. తండ్రిమీద ప్రతీకారం తీర్చుకోవాలనిపించింది.

గౌరి నడిజామువేళ లేచి వీధిలోకి వెళ్ళింది.

చేదబావిలో దూకబోతుండగా — వెనకనుంచి వాసు పరుగెత్తుకొచ్చి, ఆమెను పట్టుకున్నాడు. ఆమె కోపంతో అతన్ని తిట్టింది. కేకలు వేసింది. వీధిలోని వాళ్ళంతా మేలుకున్నారు. వాసు ఆమెను బరబరా లాక్కెళ్ళి, ఇంట్లోకి గెంటాడు.

'ఏమిటి ? ఏం జరిగింది ?' అన్నారు ఇరుగుపొరుగువాళ్ళు.

'ఏముంది ? వాళ్ళ నాన్న కొట్టాడని ఇలా ఆగడం చేస్తోంది' అంది నాగరాజు భార్య.

ఆమె యింటిలోపలికి వెళ్ళి తలుపుమూసి, గౌరి జుట్టుపట్టుకుని గుంజుతూ — 'సిగ్గుమాలిందానా ! నువ్వు మమ్మల్ని పరువుగా బతకనియ్యవు.' అంది.

గౌరి వాసును తిట్టింది. 'బేట్టా ! చచ్చిపోదామనుకుంటే నన్నెందుకురా లాక్కొచ్చావు ? ఈ కసాయివాళ్ళచేత దెబ్బలుతిని చావటానికా ? ... ఎన్నిరోజులు కాపలాకాస్తారో నేనూ చూస్తాను. ఇప్పుడు కాకపోతే రేపైనా చస్తాను.'

నాగరాజు ఆమెను సమీపించాడు. భార్య చేతుల్లోంచి ఆమె జుట్టును విడిపించాడు.

'అమ్మా గౌరీ! నువ్వు చచ్చిపోవద్దు. నేనింకా బతికేవున్నాను. నిన్ను బతికించటానికి ఎంత దుర్మార్గమైనా చేస్తాను. నా ప్రాణమైనా బలిపెడతాను. ఆమాట మళ్ళీ అనకు!' అంటూ ఆమె తల నిమిరాడు.

గౌరి కేకలు ఆగిపోయాయి

'చెప్పమ్మా ! వాడెవడు ?'

గౌరి శ్వాస స్తంభించింది.

'వాడేనా ? రాజమ్మ కొడుకేనా ?'

గౌరి బావురుమని ఏడ్చింది.

నాగరాజు ఆమె కన్నీళ్ళు తుడిచాడు. 'ఏడవకు ! వెళ్ళి పడుకో ! దిగులుపడకుండా హాయిగా నిద్రపో !' అన్నాడు.

ఇంట్లో క్రమంగా సద్దుమణిగింది.

నాగరాజుకు నిద్రపట్టలేదు. అతడు వెల్లకిలా పడుకుని, ఆలోచిస్తున్నాడు. నీతి, న్యాయం, ధర్మం, పుణ్యం మొదలైన వాటికంటే బ్రతకడం అనేది ఒక్కటే అతనికి విలువైనదిగా కనిపించింది.

అతని కళ్ళు ఎర్రగా వున్నాయి !

(వ శే ష ము)

క్రొత్తది!


అమృతాంజన్ లిమిటెడ్‌వారి విశిష్ఠమైన

ఆముదము

శుద్ధిచేసినది. వాసనలేనిది.

అమృతాంజన్ ఆముదము
సాధారణంగా ఇండ్లలో వాడుకొనే మందులను
తయారుచేసే సుప్రసిద్ధ అమృతాంజన్
కంపెనీ వారి మరో విశిష్ఠమైన ఉత్పత్తి.

**అమృతాంజన్ ఆముదము
ఆరోగ్యవంతమైన కుటుంబాలకు.**





మూడు
సైజులలో
లభిస్తుంది:
50 మిలి
100 మిలి
200 మిలి

OBM 3270 TG

యక్షులూ - యక్షగానమూ

శ్రీ అబ్బూరి గోపాలకృష్ణ

యక్షగానం అనేది తెలుగు దేశపు నాటక ప్రక్రియ. తెలుగు గడ్డను పుట్టిపెరిగి తన శాఖలను పొరుగు భాషా ప్రాంతాలకు గూడా వ్యాపింపచేసి నవనవోన్మేషంగా, వేల సంవత్సరాలు కాకుంటే మానె, వందల సంవత్సరాలనుంచైనా కళాపరిమళభరితాలైన ఆనంద కుసుమాలను సమర్పించింది. యక్షగానం అనే పేరులోని అంతరార్థాన్ని చాలామంది పండితులూ, కళాభిలాషులూ, వీలైనంత పరిశ్రమించి సాధ్యమైనంతగా చర్చించి ఊహాగానాలను చేశారు. మనంకూడా కాసేపు, సత్యదర్శనార్థమై, కొన్ని కొత్తపుంతలు తొక్కి ఊహల షికార్లు చెయ్యడానికి అవకాశం ఉంది.

ఈ యక్షగానపు చరిత్ర "తెర వెనక భాగవతాన్ని" అర్థం చేసుకోవాలంటే, యక్షులెవరో, వాళ్ళ కథేమిటో ఆరా తీస్తేనేకాని సాధ్యం కాదు. భారతేతిహాసంలో యక్షులు చరిత్రకారులకు చిరపరిచితులు. ముఖ్యంగా బౌద్ధయుగంలో ఈ యక్షులు అటు వాఙ్మయంలోనూ, ఇటు శిల్పాలలోనూ గూడా దర్శన మిస్తారు. మౌర్య యుగంలో వీరి ఉనికి ఆనాటికి నాగరికతా పవనాలు సోకిన భారత భూభాగం అంతటా కనిపిస్తోంది. ఈ యక్షులు దేవయోనులు. రాక్షసులకు ఒక మెట్టుపై వారు. ఇంకా నిష్కర్షగా చెప్పుకోవాలంటే గ్రామ శక్తులని చెప్పుకోవాలి. కొన్ని జాతక కథలలో క్షుద్ర దేవతలుగా కూడా దర్శన మిస్తారు. వీరి ప్రస్తావన వేదకాలంనాటికే ఉంది. ఈ యక్షులు జగన్మోహన రూపులూ, కామరూపధారులూ కూడా. వీళ్ళు సాధారణంగా పామర జనుల పూజ లందుకొంటూండే వారని చరిత్రకారుల అభిభాషణ. (1) కుబేరుడు యక్షుడు. ఉత్తర దిశకు పాలకుడు. అతను యక్షరాజు. ఈ యక్షులలో అనేక తరహాల పెద్దరికాలున్నాయి. (2)

యక్షుల ప్రతిమలు బార్‌హూత్, సాంచీ, అమరావతి స్తూప శిల్ప ఫలకాల మీద విశేషంగా కానవస్తాయి. సిరిసంపదల కోసమూ, సంతాన ప్రాప్తికీ, ఆపదల నివారణకూ, సుఖమయ జీవనం కోసమూ జానపదులు యక్షులను కొలిచేవారు. ఈ యక్షులు మరణాన్ని కూడా అనుశాసించగల సమర్థులు. మానవులను అమరులను చేయగల ఉదారులు. (3) హిందూ దేవాయతనాలలో అధిష్ఠానదేవతతో పాటు పరివార దేవతలకు గూడా స్థానం లభించినట్టే, బౌద్ధ క్షేత్రాలలో తథాగతునితోపాటు ఈ యక్షులకు గూడా సముచిత స్థానం కల్పించబడింది. బుద్ధునికి పూర్వంనుంచే పూజ లందుకొంటున్న యక్షులను సరసను చేర్చుకొని సామాన్యులకు చేరువకాగలిగిందని చెప్పవచ్చు.

ఆ కాలంలో గ్రామ గ్రామానా ఒక యక్ష దేవత గ్రామ రక్షక శక్తిగా కుదురుకొని వున్నట్లు, దేశ వ్యాప్తంగా కానవస్తున్న యక్ష ప్రతిమలను బట్టి వూహించవచ్చు. బార్‌హూత్ శిల్పాలలో ప్రతిమలతో బాటు యక్షుల పేర్లు కూడా చెక్కారు ఆ నాటి శిల్పులు.

"సుపవసొ యఖో, విరూధకొ యఖో, సుచిలో మోయఖో, కుపిరోయఖో, అజకాలక యఖో, సుదసన యఖి, చదాయఖి, సిరిమా దేవతా, చులకోక దేవతా, మహాకోక దేవతా" (4) మొదలైనవి కొన్ని పేర్లు. వీటిలో కుపిరోయఖో అంటే కుబేర యక్షుడన్నమాట. చదాయఖి అంటే చంద్రయక్షి. వీళ్లిద్దరి ప్రతిమలూ అమరావతి స్తూపశిల్ప ఫలకాల మీద కూడా దర్శన మిస్తాయి. సిరిమా దేవత అంటే శ్రీలక్ష్మి అన్నమాట. అత్యంత ప్రాచీనకాలం నుంచీ పూజ లందుకొంటున్న మాతృదేవత [Mother Goddess] ఈమె గజలక్ష్మి రూపంలో సాంచీ ద్వార శిల్పాల మీద ప్రత్యక్ష మవుతుంది. సాంచీ ద్వారాల కటూ ఇటూ వృక్ష శాఖలను చేతబట్టి సవిలాసంగా నిలచిన భామినులు గూడా యక్షులే. యక్ష దేవతల సంఖ్యను కనుకొనడం దుస్సాధం, అనేక తరహాల పట్టికలున్నాయి. "మహా మయూరి" అనే బౌద్ధ గ్రంథంలో ఒక పట్టిక వుంది. జైన వైదిక గ్రంథాలలో వున్న పట్టికలు సరేసరి. శిశుహరణం యక్షుల ప్రత్యేక లక్షణం, క్షేమేంద్రుడి రచన "బోధిసత్త్వావదాన కల్పలత" లో "హారీతి దమనకావదానం" లో హారీతకి అనే యక్షిణి కథ వుంది. ఈ హారీతకికి ఇక్ష్వాకుల విజయపురిలో ఆలయం వుంది. ఆ కథలో హారీతకి శిశువులను అపహరించే యక్షిణిగా అభివర్ణితమైంది. (5)

తొలి యక్ష విగ్రహాలు మౌర్య యుగం నాటివి. అంతకు ముందు బహుశా విగ్రహాలను కేవలం దారువుతోనే నిర్మించి ఉండడం వలన కాబోలు ఆ నాటి విగ్రహాలేవీ నేడు కానరావడంలేదు. శిలాశిల్పం ప్రచారమైన తరవాత కూడా దారువుతో విగ్రహాలను నిర్మించడం కొనసాగుతూనే వచ్చినట్లు, తరువాతి కాలపు శిలా విగ్రహాలను పరీక్షిస్తే తెలుస్తుంది.

ఋగ్వేదంలోని ప్రస్తావనలను (6) దృష్టిలో పెట్టుకుని

చూస్తే యక్ష పూజ ప్రాగైతిహాసిక కాలం నుంచే ఉన్నదని భావించడం అసంగతం కాబోదు. మౌర్యుల కాలంనాటి విగ్రహాలు స్పష్టంగా జానపద కళారీతిని వ్యక్తం చేస్తున్నాయని శ్రీ వాసుదేవ అగ్రవాలా గారు అభిప్రాయ పడుతున్నారు. (7)

అశోకశాసనస్తంభాలమీది సింహత్రయం, దీదార్‌గంజ్ చామర గ్రాహిణి మొదలైన శిల్పాలతో, ఆనాటి యక్ష విగ్రహాలను పోల్చి చూస్తే, ఈ రెండు శైలుల మధ్యవున్న తేడా కొట్టవచ్చినట్టు కనబడుతుంది. ఆనాటి యక్ష విగ్రహాలు బృహత్పరిమాణంలో గండరింపబడినై. తొలికాలపు బుద్ధ ప్రతిమలూ, శివ, విష్ణు విగ్రహాలుకూడా ఆనాటి యక్ష విగ్రహాల నమూనా మీదనే నిర్మిత మైనట్టు గూడా గ్రహించవచ్చు.

పరిశోధకులు నిర్ణయించినట్టు యక్ష శబ్దం నుంచే జక్కు శబ్దం వచ్చివుండాలి. (8) ఈ జక్కు శబ్దం ఒక్క తెలుగు దేశాననే గాదు ఉత్తర భారతంలోగూడా చాలా ప్రాంతాలలో కనిపిస్తోంది. భరత్‌పూర్ జిల్లాలోని ''నోహ్'' గ్రామంలో లభించిన యక్ష విగ్రహానికి ''జఖయా'' అనే పేరు సాంప్రదాయసిద్ధంగా వస్తోంది. అలాగే సుప్రసిద్ధ బౌద్ధ శిల్ప కేంద్రమయిన మధురకు సమీపాన, (మధుర జిల్లాలో) ''బరోడ'' అనే గ్రామంలో లభించిన యక్ష విగ్రహంకూడా ''జఖయా'' అనే పేరుతోనే పూజలందుకొంటున్నట్టు డాక్టర్. వోగెల్ పండితుడు (9) పేర్కొన్నాడు. మరొక విగ్రహంకూడా ''జఖేయా'' పేరుతో పూజింపబడుతూన్నట్టు అగ్రవాలాగారు గుర్తించారు. (10) మధురకు కొద్ది మైళ్ళ దూరంలో వున్న గ్రామం 'ఛీంగా—కా—నగ్రా'లో ఒక యక్షిణి ప్రతిమ నేటికీ పూజలలో వుంది.

తెలుగు యక్షగానాల గురించి మొట్టమొదటగా పరిశోధన చేసిన పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారు ''యకులు అను పదమునకు మన పండితులు జక్కులు అనునది తద్భవ రూపమని వ్యవహరించు నాచారమున్నది. కాని జక్కులు అను మాట కేవలమును దేశ్యమని నా భావము. మనవారు దేశ్య శబ్దముల కనేకమునకు ఆర్యతా ప్రాకట్యమునకుఁగాబోలు — సంస్కృత రూపములను గల్పించి వ్యత్యయముచేసి, సంస్కృత భావత్వమును అనుగ్రహించియున్నారు'' అని అభిప్రయపడ్డారుగాని (11) అది సరికాదు. ఆ విషయం పైన పేర్కొన్న ఉదాహరణలతోనే తెలుస్తోందికదా.

సాధారణంగా యకుల మందిరాలు చెరువుల దగ్గిర, తటాకాల దగ్గరగా వుంటూవుంటాయని శ్రీ అగ్రవాలాగారు భావించారు. (12) లభించిన విగ్రహాలన్నీ జలాశయాలకు దగ్గరగానే లభించాయని గూడా ఆయనే అన్నారు. రాయలసీమలో జక్కుల పేరుతో వున్న కొన్ని గ్రామాలున్నాయి. (13) జక్కసానికుంట్ల, జక్కుల చెరువు, జక్కుల చెరువు, జక్కసముద్రం, జక్కులొడికి మొదలైనవి. ఇవన్నీ జలాశయాలని సూచించే పేర్లతో వుండడం గమనించదగ్గ విశేషంకదా.

ఇంత చరిత్రని సృష్టించిన యక్షులు మన యక్షగానానికి గూడా పరోక్షంగా సృష్టికర్తలు. వీళ్లని గణనలోకి తీసుకోకపోతే యక్షగానపు పుట్టుపూర్వోత్తరాలను కనుగొనడం అసంభవం.

యక్షగానానికి తెలుగుపేరు జక్కులకథ, యక్షగానం అంటే యక్షకథాగానమన్నమాట. యకుల ప్రీత్యర్థం వాళ్ల కథలను చెప్పుకొనడంకోసం ఈ కథాగానపద్ధతి యేర్పడింది. ఈ విషయాన్ని ఇంకా వివరంగా ముందు ముందు వివరిస్తాను. ఈ నాటికీ పూజా గౌరవాలను పొందుతున్న యక్షదేవతాశ్రేణి సప్తమాతృకలు. ఈ సప్తమాతృకలకే తెలుగులో ''అక్కల''ని పేరు. ఈ ''అక్క'' అనే పేరు పాలీభాషాపదం ''యఖో'' నుంచి దిగుమతి అయి వుండాలి. కన్నడ సాహిత్యంలో కనిపించే ''ఎక్కల గాణ''లు (14) ఈ యక్షకథాగానం చేసే గాయకులే. ''ఎక్క'' అన్న పదంగూడా పాలీభాషాపదానికి వడపోతే. తెలుగుదేశపు గ్రామదేవతలలో ''ఎక్కలమ్మ''కూడా ఉంది. ''ఎక్కిలిదేవి'' అనేది ఈ పేరుకే మరొక రూపం. (15)

సప్తమాతృకల విగ్రహాలు దాదాపు ఆంధ్రదేశపు అన్ని ప్రాంతాలలోనూ కనిపిస్తున్నాయి. అక్కలపేరున తెలుగుదేశాన పేరుకెక్కిన సప్తమాతృకలు, యక్షదేవతలేనని క్రీడాభిరామం సాక్ష్యం పలుకుతోంది. వీళ్ళు ''మాణిభద్రకులోద్భవులైన దేవతలు'' (16) మాణిభద్రుడు యక్షుడు. యక్షరాజైన కుబేరుడి సేనాపతి (17) గ్వాలియరు సంస్థానానికి చెందిన 'పావాయ' అనే ప్రాంతంలో లభించి, గ్వాలియరు మ్యూజియంలో భద్రపరచబడిన యక్ష విగ్రహం ఒకటి వుంది. ఆ విగ్రహ వేదికమీద ఆరు పంక్తుల సంస్కృత శాసనం ఉంది. లిపి క్రీ. శ. మొదటి శతాబ్దానిది. భక్తులచేత ఒక గోష్ఠిలో ఈ మాణిభద్రవిగ్రహం ప్రతిష్ఠించబడిందని శాసన సారాంశం. (18) దిగువ తిరుపతిలో ఒకచోట అక్కల గుడిని చూశాను. అక్కడ మృణ్మయ నిర్మితాలైన అశ్వరూపాలనూ, చిత్రమైన ఆకారాలు గల పాత్రలనూ ఆ దేవతలకు భక్తులు సమర్పించడం చూశాను. ఆ మృణ్మయ శిల్పాలూ పాత్రలూ ప్రాగైతిహాసిక కాలంనాటి శైలిలోనే తీర్చి దిద్దబడడం నాకు ఆశ్చర్యాన్ని కలిగించింది. రాయలసీమలో నిన్న మొన్నటివరకూ అత్యంత వైభవంగా పూజింపబడుతూన్న గ్రామదేవతల ఆలయాలు చాలా వున్నాయి. కడపజిల్లా రాయచోటి తాలూకాలో, కేశాపురం, మల్లూరు, అనంతపురం గ్రామాలలో గంగమ్మకు దేవాలయాలున్నాయి. ఆరెమమ్మకు వంగిమళ్ల రాచపల్లెలోనూ, ఇరుగులమ్మకు హసనాపురంలోనూ దేవాలయాలున్నాయి. (19) ఈ దేవాలయాల వాస్తువూ, శిల్పశైలీ వైదిక

సంప్రదాయాలకి భిన్నమైనవి. ఈ దేవతలు అతిప్రాచీనులై వుంటా రనడంలో సందేహంలేదు. ప్రాచీనమైన యక్షదేవతా పరంపరే ఈ దేవతా రూపంగా మార్పుచెంది వుండవచ్చు. ఈ దేవతలందరికీ ఈ నాటికీ జాతరలూ, కొలుపులూ జరుగుతూండడం చూస్తే వీళ్ల ప్రభావాన్ని సులభంగా ఊహించుకోవచ్చు. ప్రాచీనకాలపు యక్షులకు లాగానే ఈ గ్రామ శక్తులకూ జానపదులే భక్తులు. లేపాక్షికిసమీపాన ఉన్న గొంగటిపల్లెలో సింహవాహిని ముత్యాలమ్మ ఉంది. లేపాక్షికి సమీపాననే ఉన్న మరొక గ్రామం చోళసముద్రంలో చౌడేశ్వరీదేవిఆలయం చాలా ప్రాచీనమైందిగా కనిపిస్తోంది. సంతానం కలిగినందుకు కృతజ్ఞత తెలుపుకుంటూ విజయనగర చక్రవర్తి కృష్ణదేవరాయలు వేయించిన శాసనం ఈ దేవాలయంలో ఉంది. (20) సంతాన దాతలుగా యక్షులు చాలా ప్రసిద్ధులు.

ఈ రకపు గ్రామదేవతల ఆలయాలలో దేవతామూర్తులన్నీ సాధారణంగా బృహత్ పరిమాణంలో ఉన్నాయి. అన్నీ దారు నిర్మితాలో లేదా చెక్కసున్నంతో చేసినవో అయివున్నాయి. ఈ విగ్రహాలన్నీ రంగులతోనూ, అద్దం ముక్కలతోనూ నయనానందకరంగా అలంకరింపబడి వుంటాయి. చిత్తూరు జిల్లాలో ములకల చెరువు దగ్గర వున్న గ్రామం సోమపాలెంలో కోట చౌడేశ్వరి ఆలయం వుంది. ఈ దేవికి కావలిగా పోతురాజు విగ్రహం ఉంది. అక్కలకు కాపుగా పోతు రాజును శివుడు సృష్టించి నిలిపినట్టు కామేశ్వరి కథలో వుందని శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు రాశారు. (21) ఈ కోట చౌడేశ్వరి ఆలయం పెద్ద ఆలయం.

ఏకవీర, కాకతి, కాటేడు, పోతురాజు, కంబమయ్య, పుట్టలమ్మ, అంకమ్మ, ఎక్కిలిదేవి, ధర్మరాజు మొదలైన దేవతలు చాలా శతాబ్దుల కిందటే గ్రంథాల కెక్కిన గ్రామ శక్తులు. చెరువు గంగమ్మ, జమ్ములమ్మ, జాకర, జోకుమారుడు, దరగయ్య, పెద్దమ్మ, పొలిమేరమ్మ, పోచెమ్మ, పోలేరమ్మ, బంగారమ్మ, మారెమ్మ, సత్తెమ్మ, కొత్తెమ్మ, సుంకులమ్మ పేర్లతో పూజ లందుకొంటున్న దేవతలు నేటికీ మన జానపదులకు ఆపద్బాంధవులు. ఈ దేవతల చుట్టూ ఒక ప్రత్యేకమయిన సంస్కృతి అభివృద్ధిచెంది వ్యాపించి వుంది. కాలక్రమాన వైదిక ధర్మానికీ, జానపద ధర్మానికీ ఇచ్చి పుచ్చుకోవడాలు జరిగినా కూడా, రెండూ వేరు వేరుగానే కనిపించే లక్షణాలు యెక్కువగా ఉన్నాయి.

మనకి గ్రంథస్థమైన ఆధారాలు ఇటీవలి కాలంనుంచే కనబడు తున్నా, యక్షగాన చరిత్ర అంతకన్నా చాలా ముందుగానే ప్రారంభం అయివుండాలి. దేవతలను గీత నృత్యాలతో కొలవడం ప్రాచీన మానవులు ప్రపంచమంతటా అనుసరించిన విధానమే. ''ప్రాథమిక నాటకీయ కర్మకాండ నుంచి పుట్టిన ఆదిమ (మానవుల) గీతం సామాజిక కార్యకలాపం. కర్మకాండ సామాజిక జీవనాన్ని సమున్నతంగా ఎత్తి చూసే ప్రపంచంలో, గీతం అతి ముఖ్యమైనదై, ఒక వంక అతిలోక శక్తులతో సంబంధాన్ని నెరపడమేకాక మానవుల సంతోషాతిశయమూ, దుఃఖమూ మొదలైన గాఢమైన ఉద్వేగాలకు ప్రకటనా ద్వారంగా ఉంది.'' (22) అన్న బౌరామాటల్లో ఆదిమ మానవుల గీతం యొక్క ప్రాశస్త్యం చక్కగా రూపు కట్టుకుంది. సామాజిక జీవనానికి కేంద్రం అమానుష శక్తులే. ఈ శక్తిని విడదీసి చూస్తే ఆనాటి సమాజాలను గురించి చెప్పుకోదగ్గది ఏమీ వుండదు. నిత్య జీవితంలో యెదురయ్యే కష్టసుఖాలూ, ఆహారం, ఉరుములు మెరుపులూ, అన్నీ ఆదిమ మానవుడి ఊహాశక్తిని మేలుకొలిపాయి. తన పర్యంత ప్రపంచానికి హేతుబద్ధమైన వివరణను ఆవిష్కరించే యత్నంలో మానవుడు ప్రకృతి శక్తులను గుర్తించాడు. ఆ ప్రకృతిని స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించడంలో ఆ శక్తులకు తృప్తిని కలిగించడమే ధ్యేయంగా యేర్పరుచుకొన్నాడు. ఆ శక్తుల ప్రత్యర్థం తన తొలి కళాకృషిని వినియోగించాడు.

ప్రథమంలో దేవతాస్తుత్యర్థం గానం చేసిన గీతాలు ఆశువు గానే వుండివుంటాయి. పెద్దల నుంచి చిన్నలకు తరతరాలుగా సంక్రమించడం కూడా సహజ పరిణామమే. మన జానపద గీతాలలో బహుశా ఇలాగ ఆదిమ యుగాలనుంచీ మనకి సంక్రమించినవి చాలా వుండే వుంటాయి. వాటిని గుర్తించడం కూడా కష్టమే. ఆదిమ జానపద గేయాలలో చాలా భాగం, ఆ గేయాల పుట్టుకకు సంబంధించిన స్థితిగతులుగానీ, వాటి అర్థాలుగానీ, మరపుతెరల మాటు మణిగినప్పటికీ, సాంప్రదాయికంగా ఒక తరంనుంచి మరొక తరానికి సంక్రమించినట్టివి. అలాంటి గేయాలు ప్రత్యేక భక్తి గౌరవాలను పొందుతూ, జ్ఞానవంతులని ప్రసిద్ధిపొందిన భూతవైద్యులచేతా, కులపెద్దలచేతా, సంరక్షింప బడుతూ వచ్చాయి'' 2

ఇలాగ గీతాలు మంత్ర తంత్రాలలో కలగలిసిపోయి కర్మకాండలో భాగమైనతర్వాత తమచుట్టూ ఒక విచిత్ర ప్రపంచాన్ని సృష్టించుకొంటాయి. గీతాలలో నిగూఢమైన పదాలు సంకేతాల పుట్టుకకు కారణమవుతాయి. సంకేతాలకు వివరణలు ఇస్తే మత పరమైన సాహిత్యం ఉద్భవిస్తుంది. తరువాతి మెట్టు అద్భుతమయమైన గాథలు.

దాదాపూ ఇదేవిధంగా మొలకెత్తిన ఆదిమగీతాలు ఆదిమ మానవుడి మనోలోకానికి అధినేతలయిన యక్షులను ప్రస్తుతించి వుంటాయి. అయితే ఆ ఆదిమగీతాలు మనకు లభ్యంకావు. ఆ గీత శకలాలే పరంపరగా వచ్చే గీతాలలో సంకేతాల రూపంగా కనపడవచ్చు. వాటిని గుర్తించడానికి మార్గమే లేదు కనీసం బౌద్ధయుగంలోనైనా లిపిబద్ధం అయివుంటే కొంత మేలు జరిగేది. కాని తొలినాటి బౌద్ధం

జానపదులను ఆకర్షించేందుకై యక్షులకు తన దేవతాశ్రేణి సరసన పెద్దపీట వెయ్యడానికి సిద్ధమై వుండవచ్చుగానీ, వాళ్ల గాధాలాపాల నన్నింటినీ స్వీకరించడానికి ఇష్టపడి వుండదు. అలా చేసినట్లైతే బౌద్ధం రూపుమారిపోయి వుండేది. అటువైదిక ధర్మావలంబులకు గానీ, ఇటు బౌద్ధ దీక్షాపరులకు గానీ అంగీకారయోగ్యంకాని యక్ష సాహిత్యం శృతిపూర్వకంగా వస్తున్నప్పటికీ తగిన వాతావరణం లేని కారణాన గ్రంథస్థం కాలేదని భావించాలి. కాలక్రమేణా బౌద్ధం అడుగంటి, వైదిక ధర్మ పునరుజ్జీవన కాలంలో వైదిక దేవతల సహపంక్తిని స్థానం లభించినప్పుడు, యక్షులు వేషంమార్చి, పేర్చు మార్చి, యెక్కులమ్మలుగా, యెల్లమ్మలుగా రంగప్రవేశం చేశారు. అయితే వాళ్ల భక్తపరివారం మాత్రం తొలినుంచీ జానపదులే.

మన పరిశోధకులు చాలామంది "యక్షగానం" అంటే యక్షులు చేసేగానం అనే అర్థం చెప్పుకుని దారితప్పారనుకొంటున్నాను.

"యక్షగానమనగా యక్షులయొక్క పాటయని సామాన్యార్థము" అని డాక్టర్ యస్వీ. జోగారావుగారు 24

"యక్షగానమం"టే "యక్షుల గానం" (యక్షులు చేసే గానం) యక్షులకోసం చేసే గానం ని రెండర్థాలు. యక్షుల గానం వలె చేసే గానం అనికూడా మూడో అర్థాన్ని చెప్పుకోవచ్చు" అని శ్రీ వడ్లమూడి గోపాలకృష్ణయ్యగారు (25) అంటున్నారు. ఇద్దరూ కూడా దేవయోనులైన యక్షులను భౌమ జీవులుగా మార్చడానికి కొంత శ్రమపడ్డారు. జోగారావుగారు మట్టుకు యక్షులయొక్క పాట అనే అర్థం తీసుకొని ఆ మార్గంలోనే అన్వేషణ సాగించారు. ఆ కారణంగానే క్రీడాభిరామంలో అక్కల పూజ (మాణిభద్రకులో ద్వహలైన యక్షకన్యలు) పూజలో అక్కల ప్రతినిధులుగా పీటలమీద కూర్చొనివున్న ముత్తైదువలు, శివమెత్తి ఆడిన ఆటను "యక్ష కన్యల" నృత్యంగా భ్రమించారు డాక్టర్ జోగారావుగారు.(26) శ్రీ జోగారావుగారూ, గోపాలకృష్ణయ్యగారూ భావించినట్లు దేవతలైన యక్షులు నృత్య గీత ప్రియులే కావచ్చు. వారే సాక్షాత్తూ గాయకులూ నర్తకులూ కూడా కావచ్చు. వ్యవహార జగత్తుకు సంబంధించని దేవయోనుల వల్ల నాట్యం గానీ, గానం గానీ యేవిధంగా ఉద్భవించగలదు ? ఈ యిబ్బందులను తొలగించుకోవడానికి యక్షులు భౌమ జీవులని ప్రతిపాదిస్తున్నారు. ఇందుకు జోగారావుగారు అస్పష్టమైన దేశ చరిత్రలనూ, వడ్లమూడివారు పురాణాలనూ సాక్ష్యానికి పిలుస్తున్నారు. యక్షులను ఈవిధంగా దివి నుండి భువికి దింపడానికి చేసే ఈ ప్రయత్నమంతా వృధా ప్రయాస అని నామతం. నాట్య కళను బ్రహ్మ సృష్టి అంటే నాటకాల్లో బాగానే వుండవచ్చుకాని నాటక చరిత్ర రచనలో కుదరదు.

యక్షగానం అంటే యక్షుల ప్రీత్యర్థం చేసే గానం అనే

అర్థం చెప్పుకోవాలి. ఈ అర్థాన్ని దృష్టిలో పెట్టుకుని చూస్తే నేటికీ మనమధ్య నిలచివున్న వాఙ్మయాన్ని గుర్తించడం తేలికవుతుంది. యక్షగానం అనే పేరు ఈనాడు ఒకరకమైన దేశి రూపకాలకు మాత్రమే చెల్లుతోంది. తొలి యక్షకథా గాన కలాపం నుంచి పుట్టిన రూపకాలకు మాత్రమే ఈ పేరు నిలిచివుందన్న మాట. తొలి యక్ష కథాగాన కలాపాల తీరుతెన్నులను తెలుసుకోవడానికి మన జానపద వాఙ్మయంలోని కథా గేయాలు చాలావరకు ఉపకరిస్తాయి.

అయితే యక్షగానాల నుంచి ఉద్భవించిన నాటక రూపాలు యక్షగానం పేరుతో నిలిచివున్నాయిగానీ అసలు గీతాలు చాలాకాలం వరకూ గ్రంథస్థం కాలేదు. నాటక రూపంగా పరిణతి చెందిన తర్వాతనే నాగరికులు ఈ ప్రక్రియను ఆదరించారు. అందువల్లనే నాగరిక రచనలే మిగిలి జానపద రచనలు తెరచాటు అయినాయి. జానపద రూపంలో గేయం, సంభాషణ, ఆశువుగానే ఉండి ఉంటాయనుకోవడంలో అసంగతమేమీ లేదు. ఈనాటికీ యక్షగానం, బయలాట, వీధినాటకం మొదలైన పేర్లతో చలామణి అవుతున్న రూపక ప్రదర్శనలలో చాలా భాగం సంభాషణలూ వగైరా ఆశువుగానే వుంటున్నాయి.

యక్షగాన ప్రక్రియ ప్రాథమిక రూపంలో కనీసం క్రీ. శ. మూడో శతాబ్దానికే ఆంధ్రదేశంలో ఉన్నదని ఊహించడానికి ఆధారం లేకపోలేదు. నాగార్జునకొండ లోయలో బయటపడిన విజయపురి శిథిలాలలో హారీతి దేవాలయం ఒకటి ఉంది. (27) ఇక్కడ ధ్వంసమైన హారీతి విగ్రహం, తొడమీద ఒక శిశువును కూర్చోపెట్టుకుని ఉన్నట్టు గండరించబడిఉన్నది. ఈ ఆలయానికి ముందు భాగాననే ప్రసిద్ధి చెందిన "బహిరంగ నాట్యశాల" ఉంది. (28) బహుశా ఇది యక్ష సంకీర్తనం చేసేటందుకై నిర్మించబడిన సభామందిరం. హారీతి యక్షిణి అని ఇందాకనే చెప్పడం జరిగింది. నాగార్జునకొండలోనే లభించిన నగ్నదేవీ విగ్రహం ఒకటి ఉంది. సిరి ఎహువుల చాంతమూలుడి కాలంలో ఈ విగ్రహం ప్రతిష్ఠించబడినట్టు ఆ విగ్రహం మీద శాసనం ఉంది. ఈ దేవీ విగ్రహం నగ్నంగా ఉండి "శ్రీ దేవీ ఖడ్గమాలాస్తోత్రం"లో కనిపించే దేవీనామం "ఉపస్థేంద్రియాధిష్ఠాయి" అని భావించతగ్గదిగా ఉంది. ఈమెకు శిరసుకు బదులు కమలం ఉంటుంది· బహుశా ఇది యోగ పరిభాషలోని సహస్రార కమలమై ఉండవచ్చు. అమరావతి, నాగార్జునకొండలలో కనిపించే పూర్ణకుంభం ఈ దేవికే సంకేతం కావచ్చు. ఈమె విగ్రహం స్థూలంగా పూర్ణకుంభాన్ని పోలి ఉంటుంది. క్రీడాభిరామంలో "వీణాశూన్యకటీరమండలము" అనే వర్ణన ఈమెకు అక్షరాలా వర్తిస్తుంది. ఈ దేవి యేకవీర. నాగార్జునకొండ శిల్పంపై శాసనంలో ఈ దేవిని "మహాదేవి"గా పేర్కొన్నారు. క్రీడాభిరామం కూడా ఈమెనే "ఏకవీరామహాదేవి"గా ప్రస్తుతించడం గమనార్హం. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం మ్యూజియంలో కీ. శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగారు సంపాదించిన శిల్ప ఫలకం ఒకటి ఉంది. ఈ ఫలకంలో వరుసగా బ్రహ్మ, శివలింగము, నగ్న కబంధము, కుమారస్వామి, నరసింహ మూర్తులు చెక్కబడి వున్నాయి. ఈ ఫలకం నిస్సందేహంగా నాగార్జునకొండ శిల్పసాంప్రదాయానికి చెందినది. వీటన్నిటి బట్టీ ఏకవీరాదేవి పూజ చాలా ప్రాచీన మైందిగా గ్రహించవచ్చు. తంజావూరు నేలిన విజయరాఘవ భూపాలుడి "పూతనాపహరణము" అనే యక్షగాన రూపకంలో కూడా ఏకవీర ప్రస్తావనలు కనిపిస్తాయి. బవనీలు కొలిచిన యెల్లమ్మ యక్షిణి. ఈ ఎల్లమ్మకే ఏకవీర అని మరో పేరు. ఈ ఏకవీరాదేవి యక్ష వీరాదేవి అయివుంటుందనడంలో సందేహంలేదు. "మహా మయూరి" అనే బౌద్ధ గ్రంథంలో ఉన్న యక్షుల పట్టికలో "వీర" అనే పేరు కనిపిస్తోంది. ఈ శక్తి కరహాట ప్రాంతాల పూజలందుకొంటున్న మహా మయూరి కథనం. (29) ఈ దేవతా విగ్రహాలన్నీ మాతృకా పూజకు సంబంధించినట్టివి. అలంపురం యెల్లమ్మ సంతాన ప్రదాయిని. ఈ విధంగా మనకు మాతృకా పూజా, యక్ష పూజా సంప్రదాయాలు నేటివరకూ కొనసాగుతూనే వచ్చినట్టు భావించవచ్చు.

యక్షులను భౌమ జీవులనుగా చిత్రించే ప్రయత్నంలో పరిశోధకులు "జక్కుల"నే జాతి ప్రస్తావనను తీసుకొస్తున్నారు. ఈ జక్కులు "**Wizards, and a dancing and thea trcal caste**" గా థర్‌స్టన్ మాటల్లో (30) వర్ణితులైనారు. ఈ మాటల్లో వీళ్లకి నాటక ప్రదర్శనలతో కాదనరాని సంబంధాన్ని ఎత్తిచూపే మాటేలేదు. వీళ్లు కళావంతుల్లో ఒక తెగవారు కావచ్చుగాని అసలు కళావంతు లందరికీ నృత్య గానాదులతో ప్రసక్తి చాలా కాలం నుంచే ఉంది. వీళ్లకి యక్షగానంతో సంబంధ ముండి ఉన్నట్లయితే, కూచిపూడి భాగవతుల లాగా చరిత్రకెక్కి ఉండేవారు. అలా లేదు కాబట్టి జక్కుల కథకీ, జక్కుల జాతికీ సంబంధం ఆధార రహితం. కేవలం నామ సామ్యాన్నే దృష్టిలో పెట్టుకుంటే ప్రమాదాలున్నాయి. మరి "విక్రమార్క చరిత్ర" కర్త జక్కన సంగతేమిటి ?

తెలుగు దేశంలో అనేక తరహాల కథా గాయకులున్నారు. ఈ గాయకులు అర్వాచీన కాలంలో వీరగాథలను గానం చేస్తూన్నా, ఆదిలో గ్రామదేవత కథా గానం చేస్తూన్నా, ఆదిలో గ్రామదేవత కథాగానం చేస్తూండేవారని అనుకోవచ్చు. ఈ నాటికీ వీళ్లల్లో చాలా మంది శక్తి కథాగానాలను చేస్తూన్నారు.

పరిశోధకులు తరచూ ప్రస్తావించే క్రీడాభిరామం లోని పద్యంలో [31] బవనీలు పాడే పరశురాముని కథకు చోటు దొరి

కింది. ఇలాంటి శక్తి కథా గాయకులలో బీరన్నలవారు, బవనీలు, పిచ్చుక గుంట్లు, శారద కాండ్రు, వీరముష్టులు ప్రసిద్ధి కెక్కిన వారు. బవనీలు యెల్లమ్మ, పోచమ్మ, అంకమ్మ, పెద్ద దేవరల కథాగానం చేస్తే, పిచ్చుకగుంట్లు పోచమ్మ, యెల్లమ్మ, ఇడమ్మల కథాగానం చేస్తారు. వీరముష్టులు ముత్యాలమ్మ, పోచమ్మ, మారెమ్మల కొలువు గాయకులు. వీరముష్టులకే మరో పేరు వీర భటులు. "ముష్టి యనగా పిడికిలి. వీరులగు యోధులనియు వీర (శైవ) భికుకులనియు వీరముష్టివారి కర్థము చెప్పవచ్చును." అన్నారు శ్రీ బి. రామరాజుగారు. (32) అది సరైన అర్థం కాదను కుంటాను. బీరన్న, బీరప్ప అనే గ్రామదేవతను కొలిచే బీరన్నలవారని మరొక జాతి ఉంది. గ్రామశక్తి నామంనుంచే వీరముష్టులకు గూడా పేరు వచ్చివుంటుంది. వీరన్న—బీరన్నలు ఒకే గ్రామశక్తికి రెండు పేర్లు అయివుండవచ్చు. బీరన్నలవారు బీరన్న కథలను గానం చేసే గాయకులు. ఈ బీరన్న యకుడై వుంటాడనుకోవడంలో అసంగత మేమీ వుండదు. "బెంగాల్ నుంచి సౌరాష్ట్రం వరకూ, హిమా లయాలనుంచి తమిళదేశం వరకూ "బీర్, జాఖా, యకన్" అనే పేర్లతో యక్షపూజ నేటికీ ఉంది" అని అంటారు శ్రీ అగ్రవాలా గారు. ఈ "బీర్" అన్న నామం నేటికీ చాలాచోట్ల ఉత్తరభారతంలో ఉంది. కాశీ ప్రాంతాలలో "గాఁవ్ గాఁవ్ కే ఠాకూర్, గాఁవ్ గాఁవ్ కే బీర్" అనే లోకోక్తి నేటికీ వినిపిస్తుంది. యకులను గీతాలతో కొలిచే సాంప్రదాయం నేటికీ ఈ విధంగా తెలుగుదేశాన సజీవమై నిలిచివుంది. ఈ కథా గాయకులే యక్షగాన గాయకులు, ఎక్కలగాణాలు, జక్కుల కథకులు.

ఆధారాలు స్వల్పంగానే ఉన్నప్పటికీ, యక్షదేవతా సమక్షాన గానం చేయబడిన కథావస్తువులను ఊహించడానికి అవకాశం ఉంది. ప్రథమంలో యక్షదేవతా ప్రీత్యర్థం ఆ దేవత కథనే గానం చేసి వుంటారు. కాలక్రమాన ఉత్తమ భక్తుల సాహసాలనూ, వీర చరిత్ర లనూ గూడా గానం చేసి వుండడానికి అవకాశం వుంది. మనకు కాక తీయుల కాలం నుంచీ తెలిసిన ఏకవీరా మహాదేవికి భక్తులు ఇలాంటి కథలు వినిపించేవారు.

"వాద్య వైఖరిఁ గడు నెరవాది యనఁగ
నేకవీరా మహాదేవి యెదుట నిల్చి
పరశురాముని కథ లెల్లఁ బ్రౌఢిఁ బాడె
జారుతరకీర్తి బవనీల చక్రవర్తి. 33

ఈ ఏకవీరయే యెల్లమ్మ పేరుతో తెలుగుదేశపు నాలుగు చెర గులా కనిపిస్తుంది ఈ ఎల్లమ్మకు ఊరూరా, ఏటేటా జాతరలు వైభవంగానే జరుగుతున్నాయి. ఈమెను గురించిన జానపద సాహి త్యమూ విస్తృతంగానే ఉంది. ఈమెకు జానపదులు పాడిన మేలు కొలుపులను డాక్టర్ తూమాటి దోణప్పగారు గ్రంథస్థం చేశారు.

"యెడమన కుడమన యెండీ గొడుగూ
నెత్తిమింద కిరీటమ్మ
ఆకుల్ పూజల అందమేమమ్మా
యెయ్‌గన్నుల యెల్లమితల్లీ మేలుకో మేలుకోవమ్మా" (34)

యాదవుల కులదైవం గంగ. తెలుగు దేశపు పల్లెసీమల్లో ఈమెకు పలుకుబడి హెచ్చు. ఈమె ప్రత్యర్థం జరిగే జాతరలలో కాటమరాజు కథను గానం చేస్తారు. ఈ కథలో వచ్చే పాత్రలు కొన్ని చారిత్రకాలే అయినా, కథంతా చారిత్రకమని భావించడం సరికాదను కొంటాను. ఈ కథలో కనిపించే ఒంటికొమ్ము బొల్లి ఆవుకు పేరుకు తగినట్టు నెన్నుదుట ఒకటే కొమ్ము ఉంటుంది. భారత సంప్రదాయం బట్టి చూస్తే ఇలాంటి వింత జీవం ఒక్క సింధు నాగరికతతో తప్ప కానరాదు. (35) మొహెం—జో—దారో, హరప్పా లలో లభించిన రాచ్చిప్పరాతితో చేసిన ముద్రికల మీద ఈ రూపం (Unicorn) ఎక్కువగా కనిపిస్తుంది. కొన్ని జానపద గాథలకు స్థూలంగా రూపమేర్పడడం ప్రాగైతిహాసిక యుగంలోనే జరిగి వుండాలి. యకులు పుట్టిన కాలం కూడా అదే అనుకున్నాం కదా! అసలు కాటమరాజు కథలో పాత్రల పేరులే ఆ కథ ప్రాచీనత్వాన్ని సూచిస్తున్నాయని నా అనుమానం.

ఈ విధంగా యకులు తొలినుంచీ గ్రామ శక్తులుగానే ఉన్నప్ప టికీ, మారుతున్న కాలంతో మారుతున్న సామాజిక వాతావరణంలో పేర్లను మాత్రం మార్చుకొన్నారు. వాళ్ల కథలు గూడా కొద్దో గొప్పో మార్పుకు లోనైవుంటాయి. వీళ్ల కథాగానమే యక్షగానం. ఈ గ్రామ శక్తులే యకులు. ఎల్లమ్మ కథ, పోచమ్మ కథ, బీరన్న కథ నేటికీ నిలిచివున్న యక్షగానాలు. ఈ యక్షగానం నుంచే రూపకా విర్భావం జరిగింది. ఈ రూపక విశేషం యక్షగానమనే పేరును స్వంతం చేసుకుంది. శాఖోప శాఖలుగా నాలుగు చెరగులా విస్త రించింది.

అధోజ్ఞాపికలు

1. Vasudev Saran Agrawala: Student in India art. పుట 87.
2. Alain Danielou : Hindu Polythesm. పుటలు 135–137.
3. V. S. Ag:awala: Studies in Indian Art. పుట 87
4. Cunningham · Stupa of Barhut. పుటలు 132–142

5. క్షేమేంద్రుడు : బోధిసత్వావదాన కల్పలత (శ్రీ తిరుమల రామచంద్ర అనువాదం)
6: V. S Agarwala : Studies in Indian Art పుట 87
7. పై గ్రంథమే – పుట 121
8 డా. యస్వీ జోగారావు. ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర పుట 24
9 Dr J Ph Vogel · Catalogue of Mathura Museum పుట 92
10 V. S. Agrawala Studies in Indian Art. పుట 119. అలెగ్జాండర్ కన్నింగ్‌హామ్‌గారు కునావర్, సిమా లలో "జక్‌దేవ్" అనే దేవతా రూపాలు పూజలందు కున్నట్లు పేర్కొన్నారు. Stupa of Barhut పుట 25.
11. పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారు. "యక్షగానములు లేక జక్కుల పాటలు" ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక, 1921, పుటలు 121-126
12. V. S. Agrawala Studies in Indian Art. పుట 88.
13. డా. తూమాటి దొణప్ప : జానపద కళా సంపద పుట 42. డా. యస్వీ జోగారావు : ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర. పుట 18.
14. K. S. Upadhyaya: Yaksha Gana Bayalata. (A brief Introduction) పుట 2.
15. సురవరం ప్రతాపరెడ్డి: ఆంధ్రుల సాంఘిక చరిత్ర. పుట 318.
16. క్రీడాభిరామము: (శ్రీ ప్రభాకర పరిశోధన మండలి) వచనం 139. పుట 47
17. A Danielou· Hindu Polytheism. పుటలు 135-137
18. V. S. Agrawala Studies in Indian Art పుట 119
19. ఈ దేవాలయాలగురించి మొట్టమొదటగా శ్రీ వి. వి. శేషాచార్యులుగారు తెలియచేశారు. చూ. "రాయచోటి ప్రాంత దేవాలయాలు" భారతి, అక్టోబరు 1962. తరవాత వారితో కలిసి ఈ దేవాలయాలను చూశాను.
20. ఈ శాసనం గురించి ఒకసారి ప్రస్తావన వశాన డా నేలటూరి వేంకట రమణయ్యగారు నాతో చెప్పారు. వారికి నా కృతజ్ఞత.
21. క్రీడాభిరామము : పీఠిక, శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి. పుట 107.
22. C. M Bowra . Primitive Song. పుట 32.
23. అదే గ్రంథం. పుట 33.
24. డా యస్వీ. జోగారావు ఆంధ్ర యక్షగానవాఙ్మయ చరిత్ర, పుట 3.
25. వద్దమూడి గోపాలకృష్ణయ్య · యక్షగాన వాఙ్మయము. నాట్యకళ (పత్రిక) మే 1972, పుట 7.
26. డా. యస్వీ. జోగారావు : యక్షగానము, ఆం. ప్ర. సంగీత నాటక అకాడమీవారి ప్రచురణ. పుట 4.
27. Indian Archaeology. (వార్షిక సంచిక) 1954–1955. పుట 22–23.
28 తెలుగు విజ్ఞాన సర్వస్వము 3వ సంపుటి 890.
29. V. S. Agrawala : Studies in Indian Art, పుట 134
30. E Thurston Castes and Tribes of South India, Vol. II పుట 438
31. క్రీడాభిరామం: పద్యం 130, పుట 42
32 డా. బి. రామరాజు వీరముష్టులు, తెలుగు విజ్ఞాన సర్వస్వం 3వ సంపుటి, పుట 1092.
33. క్రీడాభిరామం. పద్యం 130, పుట 42
34. డా. తూమాటి దొణప్ప: తెలుగులో కొత్త వెలుగులు, పుటలు 195–196
35 Sir. Mortimer Wheeler. Indus civilization. Plate XXIII.

శబ్దమై ప్రాణమై

డా. మాదిరాజు రంగారావు

1

నాలో ధ్వనిస్తూంది
  ప్రపంచం శబ్దమై,
  నాలో స్పందిస్తూంది
  ప్రపంచం ప్రాణమై,
  ఆ దిక్కున
  తల ఎత్తిన ఆకాశం
  ప్రతిఫలిస్తోంది నాలో,
  ఆత్మకు సంకేతమై.
  ఈ కింద
  ఎద పరచిన అవని
  నన్ను ప్రతిబింబిస్తోంది,
  బ్రతుక్కి సంకేతంగా.
  ప్రాణంనుండి
  బీజభూతమైన ప్రపంచం
  సంకల్పంతో
  శాఖాకీర్ణమైన జీవితం,
  అనుభవానికి వాస్తవం
  ఆత్మకు సన్నిహితం.

2

నేను రాత్రి పడుకుంటాను
కళ్లలో ఆదర్శ ప్రపంచంతో.
నేను ఉదయం మేల్కొంటాను
కళ్ళముందు వాస్తవ జీవితంతో.
ఇటు ఆదర్శమూ
అటు వాస్తవమూ
రెండు తీరాలమధ్య
ప్రవాహాన పడవవలె, నేను.
ప్రతి వస్తువుకూ ఉంది చరిత్ర
చరిత్ర గతి గుర్తించిన మనిషి
ఉనికిని స్థిరపరుచుకుంటూ
రూపాన్ని సరిదిద్దుకుంటూ
ఎప్పటికపుడు సాగే క్రియా మతి,
అతని మనస్సు
సంస్కృతికి గతి బిందువు,
అతని ప్రవర్తన
ఆకృతికి రేఖాంతరం.

3

నిశ్శబ్దం,
నిశ్శబ్ద ముఖాన సూర్యుడు
జీవం పల్లవించే హృదయం వలె.
నిశ్శబ్దం
నిశ్శబ్ద ముఖాన మంచు
కదలే స్మృతిపరంపర వలె.
నిశ్శబ్దం
నిశ్శబ్ద ముఖాన శబ్దం
శిలపై వానజల్లు వలె.
అనుక్షణం వర్ణాలు మారే
ముఖంలో శబ్ద రూపం.
ప్రతిక్షణం ఊహలు తరల్చే
మనస్సులో నిశ్శబ్ద పవనం.
ఆరి చల్లనైన నిప్పులో
చిపురు వేయని మోడులో
నీరు ఇంకిన సరస్సులో
నిటారుగా నిశ్శబ్ద శిఖరం.

బ్రతుకుకై ఆగాటపడే
ప్రాణంలో నిశ్శబ్దరూపం.
ఆకృతికై తహతహలాడే
బిందువులో నిశ్శబ్ద జీవనం.
నిశ్శబ్దం !
నిశ్శబ్ద ముఖాన చంద్రుడు
హృదినుండి ఎగసిన అనుభవం వలె.
సూర్య చంద్రులతో
వెలిగే ఆకాశాన - శబ్దం
వస్తువూ స్మృతినీ
భాసించే మనస్సు నిశ్శబ్దం

4

దిక్కుల్లో ఉదయం వలె
శరీరంలో ప్రాణస్పందనం,
ఆకలి ఉసిగొల్పిన తెలివితో
మనిషి యాత్ర ప్రారంభం.
చీకటికి భయపడి గుహలో దాగి
వెలుగ్కి వచ్చి సంతోషంతో బయటికి
సాగే బతుకులో విజ్ఞాన దశ
ఆకలి తీరడంతో ఆరంభం.
పగలు ఏలా గడచినప్పటికీ
ఏదో పోగొట్టుకొని దారిలో,
వెతుక్కునే పిల్లవాడికిమల్లే
రాత్రి ఆకాశంలో చంద్రుడు !
గుంపులో ఉన్న మనిషికి
ఎక్కడిది ఒంటరితనం!
గుంపు తనలో ఉన్నప్పుడు
ప్రపంచంతో లేదు భేదం !
మనస్సులో ఈ మూలనుండి ఆ మూలకు
ఎగిరేను ఖేచరాలు శ్రేణులుగా,
మనస్సులో
ఈ ఒడ్డు నుండి ఆ ఒడ్డుకు
ఈదేను జలచరాలు గుంపులుగా,
మనస్సులో
ఈ చోటునుండి ఆ చోటుకు
కదలేను భూచరాలు వరుసగా.
ఆకాశమూ సముద్రమూ భూమీ,
సర్వమూ ఒదిగిన మనస్సుతో
అవును! ఇంతకూ మానవుడు;
ప్రాణి, మాత్రమే కాదుగా !

5

చెట్లు రాలుస్తాయి
పూలు జలజలా
త్యాగం అంటే ఏమిటో
నిర్వచిస్తూ గాలి విసరుతో !
అర్ధరాత్రి చెట్లను
మేల్కొల్పుతుంది గాలి
పలికిస్తు ప్రేమంటే ఏమిటో !
ఉదయ మవుతుందో లేదో
మంచు కురిసే దిక్కులు
చూపిస్తాయి బ్రతుకంటే ఏమిటో
మనం ఎక్కడ ఉన్నాం
గాలిలో కాదు భూమిపై
మనం ఇక్కడే ఉన్నాం
కలలో కాదు వాస్తవంలో.
ఎండ విరిసింది
మంచు తొలగింది,
నీడ సాగింది — కాని
మిగిలే ఉన్నాయి శిలలు
పేదగా అంబేదగా
తరాల దుఃఖ శకలాలుగా.

లేమి లేని సమాజం

1951 లో............

ఒకనాడు మన తెలుగుగడ్డమీద ఒక ఆధునిక ఋషీశ్వరుడు కాలూనాడు

ఆయనే భూదానోద్యమ తపస్వి వినోబాజీ.

పోచంపల్లిలో హరిజన కుటుంబాలవారు పులకాంకితదేహులైనారు.

అది చరిత్రాత్మక సంఘటనే కాని భూమి సమస్య ఆమాత్రంతో తీరదు.

1973 సంవత్సరపు భూ కమతాల గరిష్ట పరిమితి చట్టం యిప్పుడు మన రాష్ట్రంలో అమలు జరుగుతున్నది భూస్వాములనుండి తీసుకున్న మిగులు భూమిని భూమి లేని నిరుపేదలకు. హరిజనులకు, గిరిజనులకు పంచుతారు

ఇవ్వాళ లేనివాడు రేపు ఉన్నవాడవుతాడు. పాతికేండ్లనాడు ప్రారంభమైన యీ ఉద్యమం ఫలించబోతున్నది.

సామ్యవాద సమాజ మార్గంలో యిదొక పెద్ద మజిలీ.

సమాచార, పౌర సంబంధ శాఖ, హైదరాబాదు.

4/75-76

దూరం

శ్రీ ఇచ్ఛాపురపు రామచంద్రం

జీవితం మాస్టారి లాటిది.

సంఘటనలు — పాఠాలే

ఒక్కొక్క అనుభవమూ నీతినో, నిజాన్నో గ్రహింపుకు తెస్తుంది. సునిశితమయిన మనిషయితే అనుభవాల ఆస్తితో జీవితాన్ని సుసంపన్నం చేసుకోగలడు.

ఒక్కొక్క సంఘటన మరీను !

మనిషిని కదిలించి — అతని అహాన్నీ అజ్ఞానాన్నీ కుదిపి వదులుతుంది.

... ...

కుషన్ సీటుమీద కులాసాగా కూర్చుని — విలాసంగా తలను వెనుక కాన్చి కారు వేగాన్ని ఆనందంగా అనుభవిస్తూ — జరపబోయే కార్యక్రమానికి మెదడులో రిహాస్టల్ వేసుకుంటున్నాడు ప్రభాకరం— లెక్చరర్.

అతను — వెనుక సీటులో కూర్చుంటే —

కారు నడుపుతున్నాడు శేఖరం—ఓ పబ్లిక్ కన్సర్న్‌లో ఆఫీసరు.

కారు — స్లో ఔతూ — ఆగింది.

కళ్లు చిట్లించి చూశాడు ప్రభాకరం. శేఖరం—కారు దిగి...

ఆశ్చర్యపోయాడు ప్రభాకరం. శేఖరం పొరపాటు పడలేదు కద ? హటాత్తుగా మతి భ్రమించలేదుకద ?

శేఖరం — ఆ మాసిన బట్టల మనిషికి నమస్కరించాడు కుశల ప్రశ్నలు వేశాడు. అంతటితో ఆగలేదు ఆతని చేయి పట్టుకుని ఎంతో ఆదరంగా గౌరవంగా — స్వయంగా కారెక్కించి తన పక్కన కూర్చోబెట్టుకున్నాడు.

కారు కదిలింది.

ప్రభాకరానికి మెదడు పనిచేయడం మానేసింది.

శేఖరం ఆషామాషీ ఆఫీసరు కాదు. అంత గొప్పవాడి దగ్గర పనివాడిగా ఉండేందుకు కూడా అర్హత లేదీ మాసిపోయిన మనిషికి. అటువంటి వాణ్ణి శేఖరం కారే కాకుండా నెత్తికూడా ఎక్కించుకుంటున్నాడు !

"సుశీలకు పెళ్లి చేశారా మాస్టారూ ?"

"చేశాను బాబూ..."

"అబ్బాడేం చేస్తున్నాడు ?"

"ఎలిమెంటరీ స్కూలు టీచరు..."

"ప్రసాదేం చేస్తున్నాడు ?"

"వాడిదే సమస్యగా ఉండిపోయింది నాయనా! బి. కామ్. పాసై రెండేళ్లయింది. ఇంతవరకూ ఉద్యోగం లేదు. ఏదో — వాడి కాళ్లమీద వాడు నిలబడగలిగితే అదే పదివేలు. రేపిక్కడ ఏదో ఇంటర్వ్యూ ఉందంటే వాడితోపాటు నేనూ వచ్చాను. బాబూ! నువ్వేం చేస్తున్నావ్ ?"

"అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా అపాయింట్ అయ్యాను. రెండు వేల పైచిలుకే అందుతుంది నెలకి..."

"చాలా సంతోషం నాయనా ! వృద్ధిలోకి వచ్చావు. ఇప్పుడు నాకు చాలా ఆనందంగా ఉంది...మా అబ్బాయే గొప్పవాడైనంత..." ఆనందం ఆపుకోలేక — తడబడ్డాడు.

"ప్రసాదుకి ఉద్యోగం యిప్పించే పూచీ నాది. మీరు నిశ్చింతగా ఉండండి. రేపు జరగబోయే ఇంటర్వ్యూకి సెలక్టింగ్ ఆఫీసర్‌ని నేనే !—"

ఈ సంభాషణ వింటున్న ప్రభాకరం గుండెల్లో బండరాయే పడింది. ఐతే— మరుక్షణం అతను తేరుకున్నాడు. ఇంతాచేస్తే యితను బడిపంతులన్నమాట ! వాటమూ అదీ చెబుతూనే ఉంది. ఈ మాస్టరు — శేఖరానికి అ ఆ లో, ఇ ఈలో చెప్పి ఉంటాడు. అఆ ఇఈలకే అంత విలువైతే తను చెప్పిన పర్‌ఫెక్ట్ కాంపిటీషన్, మానోపలీల విలువెంత ? మాస్టర్ని కారెక్కించుకుంటే — లెక్చరర్ నెక్కడెక్కించుకోవాలి ? అఆ ఇఈలు దిద్దించిన ఒకటో తరగతి మాస్టర్నే మరచిపోలేని శేఖరం — ఐదేళ్ల కిందట డిగ్రీ క్లాసులు తీసుకున్న తననెంత గుర్తుపెట్టుకుంటాడు ?

ఊహలలో తేలిపోతున్నాడు ప్రభాకరం.

తనంటే అమిత గౌరవం కనుకనే హాయిగా హుందాగా వెనక సీటు ఏర్పాటు చేశాడు — శేఖరం. అతనికి నిశ్చయంగా తెలుసు ఎవరి నెంత గౌరవించాలో. బడి పంతుల్నీ, లెక్చరర్‌నీ ఒక్కచోటే కూర్చోపెడితే — గాడిదనీ గుర్రాన్నీ ఒకేకొయ్యకి కట్టినట్లుండదూ? అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కనుకనే శేఖరం అనుగుణంగా ప్రవర్తించాడు. ఇప్పుడు—మాస్టరుకి చేసిన వాగ్దానం మాత్రం? ఏదో యాధాలాపంగా అన్నమాటే తప్ప నిజంగా ఉద్యోగం యిస్తాడా ఏం ? మాట వరసకని ఉంటాడంతే. ఆఫీసర్లది అదో టెక్నిక్. సాధారణంగా

మాటలలో ఎవరినీ నొప్పించరు. క్రియ విషయం వచ్చేసరికి—ఉండనే ఉంది బ్రహ్మాస్త్రం — సారీ!

ముసిలాయన శేఖరం మాటలు నిజమే అనుకొని పొంగిపోతున్నట్లుంది — పూర్ ఫెలో!

నవ్వుకున్నాడు ప్రభాకరం.

ఒక్కసారి జిప్‌బ్యాగ్ తడిమి చూశాడు.

బ్యాగ్‌లో బ్లాక్ డాగ్ సురక్షితంగానే ఉంది. హోటల్లో డిన్నరు సిద్ధంగా ఉంటుంది. ఇంక ఉద్యోగం రాకేంచేస్తుంది తన తమ్ముడికి? మరొక విషయం. తను మాస్టారిలా బయటపడిపోలేదు. అంతా చాలా డిప్లొమాటిక్‌గా ఏర్పాటు చేశాడు. డిన్నర్ కలసి తీసుకుందుకు శేఖరాన్ని అంగీకరింప జేశాడు. సమయమూ సందర్భమూ చూసి తప్ప మనసులో మాట బయటపెట్టడు. అదీ — ఏ మూడో రౌండులోనో! అటువంటప్పుడు లేదనగలిగే శక్తి ఎవరికుంటుంది?

కారు—శేఖరం యింటిముం దాగింది.

"మీరు — డ్రాయింగ్ రూంలో కూర్చుని విశ్రాంతి తీసుకుంటూండండి" అని ప్రభాకరానికి చెప్పి — మాస్టార్ని లోపలకి తీసుకు వెళ్లాడు శేఖరం.

అరగంట తరవాత — ఒక్కడే వచ్చాడు. స్నానం చేసి బట్టలు మార్చుకున్నాడు. డిన్నర్ డ్రెస్. మళ్లీ పక్క గదిలోకి వెళ్లాడు.

"నన్ను క్షమించాలి మాస్టారూ! వారు మా లెక్చరర్. ఈ రాత్రి ఆయన ఆతిథ్యం స్వీకరిస్తానని వాగ్దానం చేశాను. అందుచేత మీతో కలసి భోజనం చేసే అదృష్టం రేపటి వరకూ వాయిదాపడింది. అరగంటలో వచ్చేస్తాను. ఈలోగా ప్రసాద్‌ని తీసుకువస్తాడు డ్రయివర్. క్షమిస్తారు కదూ!"

"ఎంతమాట! వెళ్లిరా బాబూ."

ప్రభాకరం నవ్వుకున్నాడు. అరగంట కాదు. ఆరు గంటలు. బ్లాక్ డాగ్ అంటే తమాషాలు కాదు. అది సేవించాక మాస్టారూ గుర్తుండడు, మనిషీ గుర్తుండడు. అంత మత్తూ మైకమూ. ప్రభాకరం — శేఖరంతో కలిసి కారెక్కాడు. కారెక్కాక — బ్యాగ్ ఉందో లేదో మళ్లీ జాగ్రత్తగా చూసుకున్నాడు. ఔను. అది—విదేశీ సరుకు. చాలా శ్రమపడి—ఎక్కువ డబ్బుపెడితే తప్ప దొరకలేదు.

రిజర్వు చేయబడిన రూములోకి తీసుకువెళ్లాడు శేఖరాన్ని. ఖరీదయిన హోటల్‌లో — కళ ఉట్టిపడుతూందా గది. కాలికి గిలిగింతలు పెట్టే కార్పెట్. కిటికీ దగ్గర చక్కని టేబులు. దానిమీద తళతళలాడుతున్న ప్లేట్లలో ఆహారపదార్థాలు. రంగురంగుల గ్లాసులు పానీయాలతో రంజిల్లాలని ఎదురుచూస్తున్నాయి. ఒక్క మాటలో ఆ గదీ పరిసరాలూ అట్టహాసంగా ఉన్నాయి. బ్లాక్ డాగ్ నోరు తెరచి

సీసాలోంచి గ్లాసులలోకి ఉరికింది. ఐసు — ఆనందంతో కరిగిపోతోంది.

"ఛీర్స్—" అన్నాడు ప్రభాకరం- నవ్వుతూ.

"ఒక్క మాట—"

"ఏమిటి ?"

"ఈ పార్టీ మీరెందుకు ఏర్పాటు చేసినట్టు ?" అడిగాడు శేఖరం

ఉలిక్కిపడ్డాడు ప్రభాకరం. అంతలోనే సర్దుకుని—"ఏమీలేదు, ఉత్తినే." అన్నాడు.

"చెప్పండి—" మళ్లీ అడిగాడు శేఖరం – సూటిగా చూస్తూ.

గదిలో ఓమూల – అంతవరకూ కనిపించకుండా కూర్చున్న గోవిందరావ్—ప్రభాకరం తమ్ముడు భయపడ్డాడు.

ప్రభాకరం నోరు విప్పలేకపోయాడు.

ఈసారి శేఖరం నవ్వాడు "క్షమించండి. ఇదంతా చాలా న్యాయం—" ప్రభాకరం మౌనం దాల్చాడు. తన ప్రణాళిక యిలా తారుమారు అయిందేమిటి? బ్లాక్ డాగ్ ... తందూరీ చికెన్ ... ఇవేవీ శేఖరాన్ని ప్రలోభపెట్టలేకపోతే...

"రేపటి ఉద్యోగం కోసమేఐతే...సారీ...నేనేమి చెయ్యలేను."

"శేఖరం !—"

"మీరు మీ మనసులో మాట ముందే చెబితే...యీ అనవసర ప్రయాస, ఖర్చూ ఉండేవి కావు—"

"అంటే ?" తెల్లబోతూ అడిగాడు ప్రభాకరం.

"మీ క్యాండిడేట్‌కి నేను ఉద్యోగం యివ్వలేను—"

"ఎందుకని ?"

"నిజంగా మీకు తెలియదూ ? మీముందేకదా నేను వాగ్దానం చేశాను యీ మాస్టారికి ?"

"నేను నీ మాస్టారినే!" నవ్వబోయాడు ప్రభాకరం.

"కాదు—" కచ్చితమైన స్వరంతో అన్నాడు శేఖరం— "మీరు- లెక్చరర్ !"

"లెక్చరర్— మాస్టారికంటే ఎక్కువేకదా ?"

"ఎలా ?"

"ఆయన నీకు అఆలు చెబితే— నేను అంతకంటె పెద్ద విషయాలే చెప్పానుకదా ?"

"ఔను. కాని— అఆలే లేకపోతే ?" ఎదురు ప్రశ్న వేశాడు శేఖరం.

ప్రభాకరం తెల్లమొహం వేశాడు.

"మాస్టారు నా విద్యకి పునాదులు వేస్తే— మీరు అంతస్తులు కట్టారు. మాస్టారు చెప్పినవి పాఠాలు. మీవి లెక్చర్స్. ఆయన పాఠాలు మనసుకి పట్టేవి. మీ లెక్చర్స్— చెవులలో..."

"అంటే...నా లెక్చర్స్...?"

"ఊహూఁ నా ఉద్దేశం అది కాదు. కాని—ఒక్కతేడాచూడండి. ఆయన నెనెవరినో నా హోదా ఏమిటో తెలుసుకోకుండానే సహజమైన ధోరణిలో ఆప్యాయతా వాత్సల్యమూ కురిపించారు. మీరు— నామీద పెద్ద ప్రణాళిక వెయ్యబోయారు. తేడా లేదూ ?"

అతనేమీ అనలేకపోయాడు.

"నిజానికి మీరు చనువు తీసుకుని సూటిగా వ్యవహారం గురించి అడిగితే నేను చాలా సంతోషించేవాడిని. ప్రయత్నించేవాడిని. కాని— మీరు మీ ప్రవర్తనతో నన్ను చాలా దూరంచేసి..."

ప్రభాకరం పశ్చాత్తాప పడుతున్నాడు.

"బెటర్ లక్ నెక్స్ట్ టైమ్." గదిలోంచి నడుస్తున్న శేఖరాన్ని వారించడానికయినా నైతిక బలం చాలలేదు ప్రభాకరానికి. అ ఆ ఇ ఈ లు చెబుతున్న మాస్టారే కళ్లముందు మెదులుతూంటే భరించలేనట్టు గ్లాసు గొంతులో వొంపుకున్నాడు.



సోమసుందర్ కవిత్వం

శ్రీ మిరియాల రామకృష్ణ

ఆధునిక కవిత్వం వారపత్రికల్లోనూ మాసపత్రికల్లోనూ ఆవిష్కృతమై వేలాది పాఠకుల నాకర్షించి నాగరికతకు, కళలకు కొత్తదారులు చూపుతోంది. జాతి నూతనాలోచనలకూ ఊహలకూ కొత్తరేకులు విప్పుతోంది. పత్రికల్లో వచ్చిన ఈ కవిత్వం ఆ రచయితల ఆర్థిక స్తోమతను బట్టి కానీయండి, పలుకుబడిని బట్టి కానీయండి—తరవాత పుస్తకరూపం ధరిస్తోంది. కానీ అన్ని రచనలకూ—అవి గొప్పవైనా సరే—అలాంటి అవకాశం కలగడంలేదు. ఇందుకు కారణాలు ముఖ్యంగా రెండు—(1) పుస్తక ప్రచురణకు పూనుకుంటే అది గ్రంథకర్తకు నష్టదాయకంగా పరిణమించడం (2) ప్రచురణ కర్తలలో విచక్షణ లోపించడం. మనదేశంలో—ఫెబర్ పేపర్‌బాక్ వంటి కంపెనీలు ఇంకా ఆవిర్భవించలేదు. ప్రచురణకర్తలు తాము ప్రచురించే గ్రంథాల ఎంపికకు ఒక అభిజ్ఞ సంపాదకుడ్ని పెట్టుకునే సదాచారం మనకింకా బాగా ఏర్పడలేదు. అదిగాక నవలల యుగంలో కవిత్వ ప్రచురణ వెనకబడింది.

సమస్త సాహిత్య ప్రక్రియల్లోనూ నూతన సంవిధానాలు మొట్టమొదట కవిత్వంలో వచ్చాకనే తతిమ్మా ప్రక్రియల్లో రావడం సహజం. ఎందుచేతనంటే కవిత్వం సంక్షిప్తతకూ హ్రస్వలిపికీ అల్పాక్షరాల అనల్పార్థ రచనకూ పుట్టినిల్లు. ఈ హ్రస్వలిపి ఏ కళకైనా ప్రాణం. కథైనా నవలైనా కొన్ని కొన్ని చిన్నమాటల కిటికీల్లోంచి ఆకాశమంతటినీ చూపించగలిగితేనే గొప్పదవుతుంది. అదే నూటికి నూరుపాళ్లూ జరుగుతుంది కవిత్వంలో. ఒక విలక్షణమైన కవిత్వం యొక్క ప్రభావం ఆధునిక ప్రక్రియల మీదా ఆధునిక జీవితం మీదా కూడా మనం గుర్తించలేనంత గాఢంగా పడుతుంది. అందువల్ల ఆధునిక ప్రక్రియల సర్వతోముఖ—ఇతోధిక వికాసానికి కవితా సంపుటుల ప్రచురణ యవనికాంతరం నుంచి దోహదం చేస్తుంది. ఈ విషయాన్ని మన అకాడమీలు, ప్రచురణ సంస్థలు గుర్తించి నూత్న కవితా సంపుటుల ప్రచురణకు దోహదం చేయడం మరింత ఆవశ్యకం.

అకాడమీలు ఎంతసేపూ గ్రంథరూపంలో వచ్చిన తరవాతే పుస్తకాలకు బహుమానాలు ప్రకటించడం జరుగుతోంది. ముఖ్యంగా సృజనాత్మక గ్రంథాలకు అవార్డులివ్వడంలో అవలంబిస్తున్న పద్ధతి ఇదే! ఇందుతోబాటు వ్రాత ప్రతులుగా పేటికాంతరవాసం చేసే గ్రంథాలను కూడా ఆహ్వానించి అవార్డులివ్వడం అనే సంప్రదాయాన్నిత్వరగా ఆరంభిస్తే, కొన్నైనా మంచి గ్రంథాలకు ముద్రణావకాశం లభిస్తుంది. అదిగాక సృజనాత్మక శక్తిగల రచయితలకు ప్రోత్సాహం లభిస్తుంది. సాహిత్య రంగంలో చైతన్యం పరవళ్లు తొక్కుతుంది. ఈనాడు నవలలకు, నాటకాలకు, కథానికలకు మన వారపత్రికలు వేల రూపాయిలను బహుమానాలుగా ప్రకటిస్తున్నాయి. అందుకు కారణం పత్రికల కవసరమైన ముద్రణాహారమే కావచ్చు. కానీ పత్రికల స్వార్థమెలాగున్నా వచనరచనలో నూత్న ప్రయోగాలను అవి ప్రోత్సహిస్తున్నాయనక తప్పదు. అందువల్ల మన సాహిత్యం పరిపుష్టమవుతున్నది. కాని కవులకు ఇలాంటి ప్రోత్సాహం దొరికే అవకాశం మృగ్యంగా ఉంది. ఈలోటును తీర్చడానికి మనకు పత్రికలు లేవు. అందువల్లనే ఆ బాధ్యతను అకాడమీలు స్వీకరింపక తప్పదు. అచ్చయిన కావ్యాలలో మంచిదానికి బహుమానమివ్వడానికి బదులు నూత్నకావ్యాల వ్రాతప్రతుల నాహ్వానించి పోటీలో ఉత్తమమైనదానికి భారీ ఎత్తున బహుమానం ఇవ్వాలి. అప్పుడు కవితా ప్రమాణాలు పెరుగుతాయి. కవితా సంపుటుల ముద్రణావకాశం లభిస్తుంది.

ఈనాడు వందలువందలు కవితలను ప్రయోగఫణితిలోరచించి ప్రముఖ పత్రికలలో ప్రచురించి, పలువురి నాకర్షించి కూడా పుస్తక రూపంలో వాటిని వెలువరించే శక్తి లేకపోవడంవల్ల సమీక్షకవకాశం కలుగని కవులెందరో ఉన్నారు. ఇలాంటి కవుల్లో ప్రముఖులు శ్రీ సోమసుందర్.

గత పన్నెండేళ్లుగా శ్రీ సోమసుందర్ కావ్యసంపుటి ఏదీ అచ్చుకాలేదు. కానీ వందలు వందలు కవితా ఖండికలు పత్రికాముఖంగా వచ్చాయి. పన్నెండేళ్ల క్రితం ఆయన కావ్యాలు ఒక అరడజను వరకూ అచ్చయ్యాయి. ఆ రోజుల్లో ఆ కావ్యాలు నిరుపమానమైన ప్రతిష్ఠ నార్జించుకున్నాయి. కూడా. కానీ కవి వ్యక్తిగత కష్టనిష్ఠురాలవల్ల ఈ పదమూడేళ్లుగా తన కవితలను పుస్తక రూపంలోకి తేలేకపోయారు.

1949 63 మధ్య ప్రముఖ అభ్యుదయ కవిగా అక్షరాల కేతనాలెగురవేసి సోమసుందర్ కళాకేళీ నికేతన్ తరపున (1) వజ్రా

యుధం (1949) (2) కాహళి (1953), (3) గోదావరి జల ప్రళయం (1953) (4) రక్తాక్షి (1958) (5) మేఘరంజని (1963) (6) సోమరసం—సుందరకాండ (1963) అనే కావ్యాలను ప్రచురించుకున్నారు. ఇవికాక మిణుగురులు,[1] బానిసల దేశం,[2] మందీ మనిషి[3] కూడా ప్రచురితమయ్యాయి. నీలకంఠేశ్వరం చైతన్య భారతి, మదనోత్సవం, అంతరంగ తరంగం, అంగార తల్పం, రేపటిపాటల కోసం, వెన్నెలలో కోనసీమ, అనలకిరీటం వగైరా వగైరాలెన్నో అముద్రితంగా ఉండిపోయిన అసామాన్య రచనలు. 1967–70లమధ్య శ్రీ సోమసుందర్ 'కళాకేళి' అనే ఆధునిక సాహిత్యమాసపత్రికను నడిపి యువతరంలో సాహిత్యాభిలాషను, సృజనశక్తిని రేకెత్తించారు. ప్రముఖ వారపత్రికల్లోనూ, మాస పత్రికల్లోనూ వారి రచనలు పుంఖాను పుంఖంగా వెలువడ్డాయి. వెలువడుతున్నాయి. 1970–75 మధ్య ఎన్నో సాహితీ విమర్శ వ్యాసాలు వ్రాశారు.

ఆధునిక కవిత్వంలో తెలుగుభాషకు సంబంధించినంతవరకూ మూడు ముఖ్యమైన ఉద్యమాలు కనిపిస్తాయి. (1) భావకవిత్వం (2) అభ్యుదయ కవిత్వం (3) విప్లవకవిత్వం. వీటినే సంవిధాన పరంగా చెప్పాలంటే (1) పద్య కవిత్వం (2) గేయ కవిత్వం (3) వచన పద్య (గేయ) కవిత్వం. చివరిది ప్రజాస్వామిక యుగానికి చెందిందని చెప్పవచ్చు. ఈ మూడు ఉద్యమాలలోనూ సోమసుందర్‌కు సంబంధం ఉంది. ఆయన తొలిదశలో భావకవిగా అవతరించారు.[4] కానీ ఏ కవికైనా వ్యక్తిత్వం ముఖ్యం. తన వ్యక్తిత్వాన్ని వెదుక్కుంటూ అభ్యుదయకవిగా మారారు. గేయఫణితుల్లో హాయనాలెన్నో గడిపారు. అందులోనే—ముమ్ముందు రాబోయే విప్లవ కవిత్వానికి నిజమైన నాందీ ప్రవర్తకు లయ్యారు.

అభ్యుదయ కవులందరూ విప్లవానికి పిలుపు నిచ్చినవారుకారు. విప్లవానికి పిలుపు నివ్వగల్గడం అదొక రక్త లక్షణం. ఆలాంటి తిరుగుబాటు—అధర్మం మీద తిరుగుబాటు—మనస్తత్త్వం రక్త నిష్ఠంగా ఉన్న సోమసుందర్ సమాజానికి సమకాలానికి ఏ సందేశం అవసరమో దాన్నే తన కవితా శంఖంతో నిధ్వనించారు.

వజ్రాయుధం

ధనస్వాముల పరిపీడనలో ప్రజావాహిని ఉక్కిరి బిక్కిరయి పోవడాన్ని సహించలేని గుణమే ఈయనచేత వజ్రాయుధమనే ఉజ్జ్వల కావ్యం రాయించింది. వజ్రాయుధమనే ఆ కావ్యనామకరణమే తెలుగు కవిత్వంలోని తిరుగుబాటును కూడా తెల్పుతుంది. ఆ కావ్యవిప్లవం ప బలమయిందనడానికి అప్పటి ప్రభుపక్షంవారు దానిమీద కన్నెర్ర జేయడమే రుజువు.[5] పీడక పీడిత సంఘర్షణకు కవిత్వపు పిడికిళ్ళు సరఫరా చేయడం విప్లవకవి లక్షణమే కానీ కేవలం అభ్యుదయ కవి లక్షణం కాదు. అభ్యుదయ కవి వెలుగును చూపిస్తే చాలు; విప్లవకవి వేడిని కూడా కలిగించాలి. పిడుగులు కురిపించాలి. నిజానికి కవి కర్తవ్య రంగంలోకి దూకడమంటే ప్రజల్లో వీరత్వం రాజబెట్టడమే! అలాంటప్పుడు కవితాపరమైన విలువలను విడిచిపెట్టడం జరుగుతూంటుంది. అందువల్లనే ఉద్యమాలు చల్లారగానే తదాశ్రితమైన కవిత్వాలూ తగ్గిపోతూ ఉంటాయి. కానీ నిజమైన కవిత్వం అలనాటి ఆ నిప్పులు చప్పబడిపోయినా కూడా మన ముందు సీతామహాదేవిలాగా సాక్షాత్కరిస్తుంది. అలాగే నిలిచింది వజ్రాయుధం.

1949 కి ముందే రచింపబడిన వజ్రాయుధం 49 లో పుస్తకరూపంలో ప్రచురితమై యువతరంవారి సామ్యవాద సాహిత్యపు టలమారుల్లో ఒక స్థానం సంపాదించుకుంది. పెక్కుసార్లు పునర్ముద్రితమయింది. విప్లవకవితాయుగానికి వెలుగులు సరఫరా చేసిన కొద్ది కావ్యాల్లోనూ వజ్రాయుధం ఒకటయింది. మాటలను ఈటెలుగా చెక్కి శత్రువుల గుండెల్లోకి గ్రుచ్చే గుణాన్ని యువ కవులు చాలామంది తెలిసో తెలియకో ఈ కవి నుంచి అభ్యసించారు. కోపావేశం కవిత్వానికి మూలధాతువుల్లో ఒకటని ఆధునికులు గ్రహించడానికి ఆకరమయింది వజ్రాయుధం. అంతేగాక ఆధునిక కవి అయినవాడికి నిర్దిష్టమైన ఒక ఆ యావళికూడా అవసరమని ఈ కవి చెప్పకుండానే చెప్పేశారు.

కాహళి

వజ్రాయుధం ధరించిన కవీంద్రుడు కాహళి[6] నూదాడు. తిరుగుబాటు గుణమే కవిచేత కాహళి నూదించింది. 'కాహళి' కూడా కపన సంరంభాన్ని వ్యక్తంచేసే బాకాయే! వీరుడు కానివాడు కాహళి నూదలేడు. ఆంధ్రరాష్ట్రం అవతరించడానికి ముందు తెలుగువాళ్ల యిక్కట్లకు మూలకారణ మవుతూ వచ్చిన గుంటనక్కల్ని ఈ కవి దులపకుండా ఉండలేకపోయారు. సభ్యతో అసభ్యతో కోపం వచ్చినప్పుడు శాపం పలకడంలోనే ఉంది ఔచిత్యం. ఆ కోపం రావడం ఆ సందర్భంలో అనుచితమేమీ కాదు. కవికే కోపం రాకపోతే, ప్రజల కోపం వ్యక్తం కాదు. ఎందుకంటే, ప్రజల కోపాక్షరాలను సృష్టించేది కవే! ప్రజల్లో తిరుగుబాటును, ఎదురుతిరిగి ప్రశ్నించే చైతన్యాన్ని కవి సరఫరా చెయ్యాలి. ఏ మాటలు ప్రజల్ని చైతన్య సమా

విష్ఫుర్జిల్లి చేస్తాయో వాటిని కవి అందిస్తాడు. అదే జరిగింది 'కాహళి' గీతాల్లో!

గోదావరి జల ప్రళయం

కవి కోపం దుష్ఫుడి ఉన్మాదం లాంటిది ఎప్పుడూ కాదు; కాగూడదు. భీముడి కోపం ప్రజ కోసమయితే, ధర్మజుడి కోపం కవి కోపం కావాలి! కానీ ఒక్కొక్కప్పుడు కవి భీమకోపం ప్రదర్శించవల సిన అవసరం వస్తుంది. అయినప్పటికీ కవి నవరస రుచిరుడే! అందు వల్లనే అతనిలో పరస్పర విరుద్ధాలయిన రసభావాలన్నీ సమైక్యంగా కాపురం చేస్తాయి. దేని అవసరం వస్తే, అదే యవనిక తొలగించు కుని ఇవతలికి వస్తుంది. మహా కావ్య నిర్మాతల విషయంలో ఇది నూటికి నూరుపాళ్ళా నిజం. లేకపోతే వారు నవరస రుచిరమైన ఇతివృత్తాలను నడిపించజాలరు. అందువల్లనే కోపాల పిడుగులు కురి పించిన కవి కారుణ్యాల వర్షాలు కూడా కురిపించగలడు.

శత్రువులమీద కోపం ప్రకటించినసోమసుందర్‌కు తనవారంటే, వారి కష్టాలంటే ఎంతో జాలి. కారుణ్యం చిత్తాన్ని ద్రవీకరింప జేస్తుంది. గోదావరికి జలప్రళయం వచ్చినప్పుడు ప్రజల కష్టనిష్ఠు రాలను చూచి కరిగిపోతూ, గోదావరి ప్రళయ తాండవాన్ని అభిశం సిస్తూ కావ్యం నవ్యధోరణిలో రచించారు సోమసుందర్. తెలుగుదేశ మంటే ఈ కవికి ఎంతో అభిమానం. తెలుగువారి గతాన్ని బాగా అధ్య యనం చేసి, పులకరించినా గతానికి తాకట్టుపడ్డవారు కాదీయన. ఈ కావ్యంలో ప్రజల యిక్కట్లను కళ్లకు కట్టినట్లు వర్ణిస్తా రీయన. వారి సాయానికి నడుం బిగించారు.

ర క్తా క్షి

ఆధునిక కవి లక్ష్యాలు రెండు—(1) సమాజంలో మార్పు (2) కవిత్వంలో మార్పు. ఈ రెండింటికీ అవినాభావ సంబంధం ఉంది. ఒక్కొక్కప్పుడు ఒక మార్పుకోసమే కవి ఎక్కువ కృషి చేస్తాడు. సమాజంలో మార్పు తల్క్షణావసరమైనప్పుడు వజ్రా యుధం, కాహళివంటి కావ్యాలు వచ్చాయి.

పై రెండు మార్పులూ కోరుతూ సోమసుందర్ రచించిన కావ్యం ''రక్తాక్షి''. ఇది నిజంగా ఈ కవి నవ్యకావ్య సృజన శక్తికి ఆసక్తికి ఒక మచ్చుతునక! ఛందస్సులో, సంవిధానంలో భాషలో వస్తువులో మార్పు తెచ్చిన నవ్యకావ్యాలను చెప్పమంటే వెంటనే జ్ఞాపకం రావలసిన కొద్దిపాటి కావ్యాలలోను రక్తాక్షి తప్పకుండా ఉంటుంది.

సామ్యవాది యగు కవి మానవేతిహాసానికి చేసిన ఆధునిక కవితా వ్యాఖ్యానం రక్తాక్షి. 1920–30లో ఆంగ్ల కవితా ప్రపంచంలో ఎలాంటి ప్రయోగాలు వచ్చాయో అలాంటి కొత్తసొకడలు రక్తాక్షిలో కనిపిస్తాయి. సంవిధానంలో సంప్రదాయాన్ని విచ్ఛిన్నం చేయడం నవ్య కవిత్వధోరణుల్లో ఒకటి. అయితే సాంప్రదాయిక సంవిధానాలను కూడా నూతన ప్రయోజనాల కోసం వాడుకోవడం నవ్యకవుల కొక సరదా! ఏమైనా వైచిత్రి, అపూర్వత, చమత్కారం మొదలయినవి వారి కిష్టాలు. ఇలా వైచిత్రీ బంధురమైన ప్రయోగాలు చేసిన ఆధుని కులు ఇద్దరే ఇద్దరు ముఖ్యంగా కనిపిస్తారు శ్రీశ్రీ తరువాతి తరంలో వారు (1) ఆరుద్ర (2) సోమసుందర్.

ఆధునిక కవులు గతాన్ని, మతాన్ని పూజించరు. గతాన్ని నిర సిస్తారనుకోవడం ఒక భ్రమ. గతానికి తాకట్టు పడరంతే! గతం నుంచి నేర్చుకుంటారు. గతమైనా వర్తమానమైనా అందులోని దురాచారాలను గర్హిస్తారు. వర్తమానాన్ని జంకు లేకుండా విమర్శి స్తారు. భవిష్యత్తు మీద వీరి భరోసా, మానవుడే వీరి దేవుడు. ఇదే సోమసుందర్ రక్తాక్షిలో అభివ్యక్తమవుతున్న సత్యం. ఈ కవి రక్తాక్షి నామ సంవత్సరంలో పుట్టారు. దుర్వ్యవస్థపై ఈయన రక్తాక్షి అవుతున్నారు—అనుకోవడం ఒక చమత్కారం.

మే ఘ ర ం జ ని

వర్ణన కవి కబ్బిన సువర్ణవరం. వర్ణన చెయ్యలేనివాడు కవే కాలేడు. అయితే ప్రతి వర్ణనకు ఒకహద్దు, ఔచిత్యం ఉండాలి. వాటిని పాటించనివాడు పరిహాసభాజనుడవుతాడు. సోమసుందర్ ప్రచారం, నినాదం మొదలయినవి కవిత్వంలో కాలప్రభావంవల్ల వచ్చిన నూతన ధోరణులనీ, వీటన్నింటినీ మించి సర్వకాలాలకూ శిరోధార్యమైన వర్ణన కవితకు ప్రాణమనీ గుర్తించారు. మేఘ రంజని వర్ణనకు పట్టంకట్టిన కావ్యఖండం.

ఆధునిక కాలంలో ఆత్మచరిత్ర సాహిత్య పట్టభద్రత సంపా దించుకున్న ప్రక్రియ. కవి తన ఆత్మచరిత్రలోని ఒక ప్రణయ ప్రయాణ ఘట్టాన్ని వర్ణించడానికి చేసిన ప్రయత్నం మేఘరంజని. నూత్నమైన అలంకార సామగ్రితో చేయబడ్డ వర్ణనలిందు ఆధునిక హృదయ రంజకాలు.

ఈ కావ్యంలో మరో విశేషముంది. వచన కవితా విపంచిమీద ఎన్ని అందాల చందాల రాగాల నాలపించవచ్చునో ఈ కావ్యం రుజువు చేస్తుంది. శ్రీశ్రీగారు ''కవితా ఓ కవితా''లో ఒక ఛందో విశేషాన్ని వచనానికీ కందానికీ సన్నిహితంగా ఆవిష్కరించారు. దాని ప్రేరణగానా

లను సోమసుందర్ ఈ కావ్యంలో మలిసారిగా ప్రతిష్ఠించారు, అందు వల్లనే వచన కవితోద్యమంలో మేఘరంజని[8] ఒక శారదాశింజినిగా నిలుస్తుంది.

వాస్తవికతను, భావుకతను మేళవించి వ్యక్తావ్యక్తాన్ని ఆవిష్కరించడానికి కూడా మేఘరంజనిలో కవి కొన్నిచోట్ల ప్రయత్నించారు. కవి నిజాయితీ చాలా చోట్ల అబ్బురం గొల్పుతుంది. రొమాంటిక్ కవిత్వంలో ఒక వినూత్న ప్రయత్న మిది!

సోమరసం — సుందరకాండ

మానసికంగా కవి పెరిగినకొద్దీ ఆలోచనాలోచనాలు విప్పుకుని, మానవజాతి చరిత్రనూ, విశ్వరహస్య లీలనూ కనుక్కొని ఆశ్చర్య చకితుడై ఒక మేధావిగా, ఒక జిజ్ఞాసువుగా మారడం ఆ కవి పరిణతికి ఒక తార్కాణమవుతుంది. కవిలో జ్ఞాన సంపద పెరగడం కవిత్వానికి సాధారణంగా పుష్టి కూరుస్తుంది.

సోమసుందర్ కేవలం విప్లవకవిగా ప్రాంతీయకవిగా మాత్రమే మిగిలిపోలేదు. ఆయన ప్రతిభ కొడిగట్టిపోనూలేదు. ఆయనొక తాత్త్విక కవిగా మారసాగారు. మరో మాటల్లో చెప్పాలంటే విప్లవ దృష్టిని నిల్పుకుంటూనే పరిస్థితుల అంతర్వాస్తవికత మీద నిఘా వేయసాగారు. కాలం, చరిత్ర, మానవుడు, ప్రకృతి, విప్లవం, పరిణామం, అభ్యుదయం — వీటి పరస్పర సంబంధాన్ని గురించి తీవ్రాలోచన చేయసాగినప్పుడు మహామేధావుల ఆలోచనా వీధుల్లో సిద్ధాంత విపణుల్లో షికార్లు కొట్టకతప్పదు అప్పుడే ఒక విశ్వజనీన దృష్టి ఏర్పడుతుంది. అనంత విశ్వంలో తన ఉనికి, నిరవధిక కాలంలో తన మనికి ఏమిటనే ఆలోచన తలుపులు తెరుచుకుంటుంది. ఉపనిషద్యుగంలో మనిషి మహా మేధావి అయి ఏ ఆలోచనల తరంగాలమీద ఉయ్యాలలూగాడో ఆ తరంగాలనే కవి నూతన కోణం నుంచి చూస్తాడు. తన రాష్ట్రం కాదు, తన దేశం కాదు, తన మానవుడు ఎక్కడెక్కడున్నాడో ఆయా దేశాలన్నీ, ఖండాలన్నీ, ద్వీపాన్నీ — అన్నీ తనవే అనిపిస్తుంది.

ఇలాంటి పరిణామం అదేదో సోమసుందర్‌లో వెల్లిపొడిచిన ముహూర్తాలలో వచ్చిన రచనయే ''సోమరసం — సుందరకాండ''. తెలంగాణా విప్లవం, ఆంధ్ర రాష్ట్రోద్యమం ఇవి రెండూ కవిచేత విప్లవగీతాలల్లించాయి. కానీ ఆ తరవాత వచ్చిన ఏ ఉద్యమమూ ఈయన [illegible]గా ఆకర్షి[illegible]దు. ప్రాంతీయ విప్లవాలను మించిన మానవతా విప్ల[illegible]దికి ఆయన దృష్టి వెళ్ళింది. ఇది అర్థం చేసుకోలేని విమర్శకులు సోమసుందర్‌లో విప్లవ కవిత్వం అస్తమించిందని వాపోయారు.

అచ్చయిన కావ్యాలలో 'వజ్రాయుధం' మొట్టమొదటిది. బహుశా ''సోమరసం—సుందరకాండ'' చివరిది? [6] వజ్రాయుధం రచనకు శ్రీశ్రీ కవిత్వం ఆయనకు ఒక ప్రేరణ. కానీ సోమరసం — సుందరకాండ రచనకు మరో తెలుగుకవి ప్రేరణమేదీలేదు. కానీ అమెరికన్ ప్రజాతంత్రకవి వాల్ట్ విట్‌మన్ రచించిన శాల్యూట్ ఆం మాండె అనే కావ్యం చదివినప్పుడు తనకు ఇలాంటి కావ్యం రచించాలనే అభిప్రాయం పుట్టినట్టు సోమసుందర్ చెప్పుకున్నారు. ఈ కావ్యాన్ని 1954–56 ల మధ్య రచించారాయన.[10] ఇందులోని చాలా భాగాలు ముందుగా పత్రికల్లో వచ్చాయి. ఈ కావ్యంలో కవి ఆత్మీయత సహృదయులను బాగా ఆకర్షిస్తుంది. కానీ ఏ కారణాల వల్లనో మన విమర్శకులు ఈ కావ్యాన్ని అనుశీలించడంలో తమ అసమర్థతనే చాటుకున్నారు.

మానవుడి మనస్సు అన్నమయకోశం నుంచి ఆనందమయ కోశం దాకా సాధించిన మార్గాలను ఈ కావ్యంలో అభివ్యంజించారు కవి. ఈ కవి జిజ్ఞాసువు జటాజూటంలో కవిత్వం గంగాజలంగా అవతరించింది. ''మనో హృదయాలకు మధ్య సాగే సంవాదరూపంలో పరాత్మకభావానుభూతుల నెన్నిటినో స్వాత్మకం చేసుకుని ప్రకటించానని'' కూడా కవి కంఠోక్తిగా చెప్పుకున్నారు.[11] అంతరాత్మను పట్టుకోకపోతే, మానవుడు మానవుడిగా మనజాలడు. అంతరాత్మ అనే సీతను వెదుక్కోవడంవల్ల ఇది 'సుందరకాండ' అయిందనీ, లోకశ్రేయస్సుకోసం సాగించే తాత్త్విక యజ్ఞంలో మానవులంతా సమష్టిగా ఆనందమనే సోమరసం ఆస్వాదిస్తారు కనుక 'సోమరసం' అయిందని కవి నామకరణ ఔచిత్యం గురించి వివరించారు.[1] అసలు కవి పేరులో సోమ, సుందర పదాలు రెండూ ఉండనే ఉన్నాయి. కృష్ణశాస్త్రి తన కావ్యానికి కృష్ణపక్షమని సార్థకనామం ఉంచుకున్నట్లే ఈయన కావ్యానికి సోమరసం — సుందరకాండ అని పేరు పెట్టారు. సమిష్టి ఆనందానికై వ్యష్టిగా ఈ కవి అన్వేషణ చేస్తారు. కావ్యమార్గాలలో ఇది ఈయన ఆశయం.

సోమసుందర్ కావ్యాలన్నింటిలోనూ సంవిధానం (ఫారం) గురించి ఒక ప్రత్యేక ప్రయోగం కనిపిస్తుంది. ఈ కావ్యంలోనూ ఒక రచనా సంవిధాన విశేషం ఉంది. వచనానికి సన్నిహితంగా వచ్చేటట్లు మాత్రమేకాదు, పద్యమా అని భ్రమణగొల్పే రీతిలో ఈరచన గేయఫణితిలో సాగింది. అయితే కవి ''చెప్పబడని విషయాన్ని చెప్పబడని రీతిగా చెప్పాలి.''[13] అనే ఆశయం గల గడుసువాడు. అందుకే

ఆ ఆశయం మేరకు ఈ కావ్యాన్ని ఇదివరకు చెప్పబడని రీతి (సంవిధానమని నేనన్నది ఇదే)లో చెప్పారు. ఇక విషయమూ ఇదివరకు చెప్ప బడనిదే! ఈ కావ్యమంతా గీతిమాధురి కేరటాలుగా ప్రవహించి జిహ్వకూ శ్రవణానికీ హాయి కలిగిస్తుంది.

సోమరసం—సుందరకాండ 1963 లో ప్రచురితమయింది. ఆ తరువాత ఈ పన్నెండేళ్లూ సోమసుందర్ కావ్యమేదీ గ్రంథ రూపంలో అచ్చుపడలేదు. అందుకు కారణాలు వ్యాసారంభంలోనే మనవి చేశాను. ఈ పన్నెండేళ్లుగా ఆయన ఎన్నో ఖండ కావ్యాలు రచించి అసంఖ్యాక పత్రికల్లో పుంఖానుపుంఖంగా ప్రచురించారు. వాటి తీరుతెన్నులను కాలానుసారంగా పరిశీలించి కవి తీసిన కొత్తదారు లేమిటో, ఆయనలో వచ్చిన పరిణామమేమిటో అంచనా వేయడానికి ఇప్పుడప్పుడే సాధ్యంకాదు.

సోమసుందర్ నిరంతర కవితా వ్యాసంగి మాత్రమేకారు. నిరంతర కవితాప్రయోగశీలి కూడాను. ఆయన ప్రవృత్తి మాత్రమే కాదు; వృత్తికూడా కవితావ్యవసాయమే! జీవితమంతా కవిత్వం కోసమే మీదు కట్టిన కవులు ఈకాలంలో అరుదే!

సోమసుందర్ ఇప్పుడు ఏభయ్యో పడిలో ప్రవేశించారు.[14] అయినా మానసికంగా ఈయన ఎప్పుడూ యువకులే! కవిగా రిటయిర్ కావడమంటే కవిత్వం వట్టిపోవడమే! సోమసుందర్ విషయంలో ఇది అబద్ధం.

సోమసుందర్ ఇటీవల రచించిన ఖండికల్లో "ఒక్క కొండలో వెయ్యి శిల్పాలు"[15] అనేది పేర్కొనదగిన కవిత. ఇందులోని వస్తు సంవిధాన శిల్ప వైచిత్రితో ఈ వ్యాసం ముగిస్తాను.

ఒక్క కొండలో వెయ్యి శిల్పాలు

ఒకప్పుడు ఎత్తుగా ఆకాశంలోకి వ్యాపించి పచ్చగా ఉన్న ఒక కొండ శ్రామికుల ప్రయత్నంవల్ల ఆవాసయోగ్యంగా మారిపోతున్న దృశ్యాన్ని కవి గమనించి ఈ ఖండికను రచించారు.

ఒకప్పుడు ఫ్యూడల్ వ్యవస్థకు ప్రతినిధిగా సమస్త భోగాలను అనుభవించిన ఒకానొక ధనస్వామి దేశకాలానుగుణంగా తన స్వార్థాన్నీ గర్వాన్నీ సర్వ సంపదలనీ త్యజించి బహుజన హితంకోసం, బహుజన సుఖం కోసం తన జీవితాన్ని మార్చుకున్నాడనే ఒక సమకాలీన సత్యాన్ని ఈ ఖండికద్వారా అభివ్యంజిస్తారు కవి!

ఇలా ప్రకృతిలో మానవ సమాజాన్ని చూడగల్గడం మానవ సమాజాన్ని ప్రకృతి కారోపించడం ఒక కళా చైతన్యం.

నవ్యకళావాదాల్లో ప్రముఖమయినది సింబాలిజం. మరొకటి ఇమేజిజం. ఈ రెండూ అభివ్యక్తి కెన్నో కొత్తదారులు చూపించిన సిద్ధాంతాలు. సోమసుందర్ కవిత్వంలో ఈ రెండు కళావాదాలూ పుంజీభవించాయి.

సింబాలిస్టులు మాటలను నిఘంట్వర్థంలో వాడరు. మాటల అర్థాలకు అర్థాంతరాలు ఉద్దేశిస్తారు. అయితే ఇది నేల విడిచిన సాముకాదు. ధ్వని సిద్ధాంతం ఈ చాయలలోనిదే! అర్థాల అర్థాంత రాలు ఆయా ప్రకరణాలనుబట్టి పరిణత పాఠకుడికి స్ఫురిస్తూనే ఉంటాయి.

ఇమేజిస్టులు మనోనేత్రానికి కనిపించే బొమ్మల్ని భావాలతో శబ్దాలతో ఊహలతో ధ్వనులతో చిత్రచిత్రంగా నిర్మిస్తారు. శబ్దార్థాలంకారాలే మరింత ప్రస్ఫుటమైన ప్రయోజనంతో రూపొందితే భావచిత్రాలు, శబ్దచిత్రాలు ఉద్భవిస్తాయి.

పూర్వోక్తమైన ఆ కొండను చూసినప్పుడు దాని ఠీవి, దాని పచ్చదనం కవిని ఆకర్షించాయి. వెంటనే ఆయన మనస్సులో ఒక భావ చిత్రం ఏర్పడింది. అది ఫ్యూడల్ వ్యవస్థకు చెందినది.

"చక్కని పచ్చల తివాసీ
పరచి ఉంటే
మొండిగా వచ్చి
తానే రాజులా కూర్చుంది కొండ
కాలం భయపడి
పాద పీఠిగా మారింది
అమాయిక శిశువులవంటి
ఆరు ఋతువులు
దాని కుచ్చెళ్లతో ఆడుకుంటున్నాయి."

ఇలా రాజభోగాలను కొండ అనుభవించడానికి దోహదం చేస్తున్నవారెవరు ? దాన్ని ప్రతీకలతో చెబుతారు కవి.

"తొలకరివాన వెండి బిళ్లలుగా
నేలను అభిషేకిస్తేనే
పువ్వు పువ్వుగా

'పులకరిస్తూ వస్తుంది
రంగు రంగుల వసంతం''

ఇందులోని తొలకరి వాన గ్రామికుల ఘర్మజలానికి ప్రతీకగాతోస్తుంది. ఆ ఘర్మజలం వెండి బిళ్ళలుగా (రూపాయిలుగా) మారుతోంది. అప్పుడు పుష్పించియమ్మే రంగురంగుల వసంతం వస్తుంది. అయితే ఈ వైభవం, ఈ సౌందర్యం, ఈ సమృద్ధి కడుపులను నింపించేది కాదు. ఆకలితో మాడిపోతున్నవారూ, బాధలతో మండిపోతున్నవారూ లోకంలో ఎందరో ఉన్నారు. తమ కూలికోసం ఈ కొండను త్రవ్వ నారంభించారు వారు. రోడ్లు వేయడానికో, ఇళ్ళు కట్టడానికో రాళ్ళు త్రవ్వుతున్నారు వారు.

''దొరలా కూర్చున్న కొండ
తరిగే బ్రతుకును పరామర్శిస్తోంది.''

ఇంతకుముందు ఈ కొండల అవసరం మానవలోకానికి కలగలేదు. వాటి సౌందర్యం చూసే ఆనందించారు మానవులు. కానీ వాటి ప్రయోజనం గుర్తించింది నాగరికత. కొండలను త్రవ్వి రాళ్ళతో సౌక ర్యాలు నిర్మించుకుంటున్నారు నాగరికులు. అందుకే కొండలు తరిగి పోతున్నాయి అందువల్ల ఇప్పుడు కొండకు బ్రతుకంటేఏమిటో అర్థమవు తోంది. అది ''తరిగే బ్రతుకును'' పరామర్శిస్తోంది. బాధా మాధు ర్యాన్ని గ్రహిస్తోంది.

''బాధల తటాకంలో
బ్రతుకే పంకజం
కోకిలగానం మినహాయిస్తే
వసంతానికి విలువలేనట్లే!
ఎర్రని తామరలేని కోనేటికి
ఏమీ విలువ ఉండదు!
ఎండగాడ్పుల కష్టం
పన్నని మల్లెల తోరణం!
సంగీతంలో తప్ప
సాదావెదురు బొంగుకి
ఏమన్నా విలువా? మన్నా?
వేణువైనా వీణయైనా
సంగీతం వినా ఒట్టి కట్టె!''

ఇందులో కవి చెప్పినవన్నీ ప్రతీకలు. తటాకం, కోకిలగానం, ఎర్రని తామర, సంగీతం, మల్లెల తోరణం—ఇవన్నీ బాధకు ప్రతీకలయ్యాయి. ఇవన్నీ తామున్నచోట ఆనందాన్నీ జీవితాన్నీ కలిగిస్తున్నవే! ఇవి లేక పోతే ఆ వస్తువులకు, ఆ ప్రదేశాలకు శోభలేదు. అలాగే బాధలేని జీవితానికి కూడా శోభలేదనే సత్యాన్ని ఫ్యూడల్ ప్రభువు ఇన్నాళ్లకు గ్రహించాడు. సాదా వెదురుబొంగు సంగీతంవల్లనే వేణువవుతోంది. ఎండగాడ్పులు మల్లెలవల్ల ఆచ్ఛాదనం పొందుతున్నాయి. వసంతం కోకిలగానంవల్ల విలువ సంపాదించుకుంటోంది.

తొలుత ఈ కొండనానుకుని ఏర్పడిన గ్రామం కాలాను క్రమంగా జనాభా పెరగడంవల్లనూ, వాణిజ్య వ్యవహారాలు పెరగడం వల్లనూ పెద్దదై నగరంగా మారిపోయి దూరదూరాలకు వ్యాపించ సాగింది. దానినే కవి ఉత్ప్రేక్షిస్తున్నాడు—

''తననుంచి దూరంగా పారిపోయిన
నగరాన్ని వీక్షిస్తోంది కొండ''

అయితే ఆ నగరాన్ని చూసినపుడు కొండకు కొన్ని ఊహలు రాసా గాయి. వాటిని చూడండి :—

''జనసమ్మర్దంతో నిండిన
మహానగరంకన్నా
రద్దీగా క్రిక్కిరిసిన చెట్లతో
ఒక చిట్టడవి గొప్పది''

నగరాలు జనాభాతో కిటకిటలాడుతూ ఆహారారోగ్యాది విషయాలలో అనేక సమస్యలను సృష్టిస్తున్నాయి. అక్కడ ప్రశాంతిలేదు. అంతా ఒక కృత్రిమ సౌందర్యం! అందువల్లనే రద్దీగా క్రిక్కిరిసిన చెట్లతోడి చిట్టడవిని గొప్పదిగా భావించడం! ఈ అడవి ఆ కొండను ఎప్పుడూ విడవకుండా ఉంటుంది. ఆ కొండకూ అడవికీ ఉన్న సంబంధం ఎలాంటిది?

''విశ్వాసంగల ముసలి సేవకునిలా
ఎప్పుడూ తనని విడువని''

అడవి అది! అడవి అంటే చెట్ల సముదాయం. ఆ చెట్లెలాంటివి? తనకన్నా (కొండకన్నా) గొప్పవి. తాను శ్రమజీవులపై ఆధారపడి బ్రతుకుతాడు. కాని చెట్లకెన్నో విశేషాలున్నాయి—పరోపకారులవి,

''చెట్టు మరో చెట్టు చెమటపై బతకదు
పిట్టల కాశ్రయమిస్తుంది
పాటలకు హాయిగా తలలూపుతుంది
వేయి జన్మల సుకృతాలకు మల్లే

పచ్చపచ్చని పల్లవాలెత్తుతుంది
ఆకుల్నించి పువ్వుల్నీ
పువ్వుల్నించి ఫలాల్నీ
పెంపొందించుకుంటుంది అడవి"

ఇదంతా పరిపూర్ణ జీవితంయొక్క లక్షణం. ఇందుకే చెట్లంటే కొండకు ప్రేమ. ఆ చెట్లను చూసి పరోపకారం, నిర్మాలిన్యం, గాన పారవశ్యం, అభ్యుదయ ప్రీతివంటి వాటినన్నిటినీ కొండ భావించుకుంది.

యుగాల అనుభవ పరిపాకం ఉంది కొండకి. అందువల్లనే దానికి సత్యం అవగతమవుతోంది. ఇన్నాళ్లూ స్థాణువుగా పడి ఉన్న పర్వతరాజు ఈనాడు ఆలోచించడం కూడా నేర్చుకున్నాడు. అతనికి కూడా భావుకత్వం అబ్బింది. అందువల్లనే చుక్కలనుచూసి చిత్రంగా ఊహిస్తాడు.

"ఇంత బలిష్ఠమైన చీకటి
స్వారీ చేయగా
అలసిన గుర్రాల జాలికన్నుల్లా
దీనంగా మెరుస్తున్నాయి దూరపుతారలు
ధరణి నెత్తిమీద పెట్టుకు తిరుగుతున్న దీపాలు" –

చుక్కలు గుర్రాల జాలికన్నుల్లాగున్నాయట. ఆ గుర్రాలు ఎంతో శ్రమపడి పోయినవి. శ్రామికులపట్ల జాలి ఇందులోని వ్యంగ్యం. శ్రామికులంటే సానుభూతి కలిగింది కొండకు—కఠినత్వానికి ప్రతీక అయిన కొండకు. వెలుగులు విరజిమ్మే నక్షత్రాలల్లో శ్రామికదైన్యం చూడటం ఒక అపూర్వమైన ఊహ. ఈ చుక్కలే ధరణి తన నెత్తి మీద ధరిస్తోన్న దీపాలు.

ధనస్వామికి ప్రతీకగా నిలిచిన ఈ కొండకు సూర్యచంద్రులు కూడా ఇప్పుడు పూర్వంగానే కనబడ్డారు. సూర్యుడొక కోపిష్ఠి గృహస్థుడి లాగున్నాడు. కానీ అతను రోజుకు రెండుసార్లయినా చల్లగా జాబిల్లిలాగుండాలనుకుంటాడట! కానీ ఇంతలో అతని కాలికి పబ్బో చెట్టో పిట్టో కోనేటిగట్టో (ఇవన్నీ సమస్యలకు ప్రతీకలు) అడ్డం తగుల్తుందా సమయానికి. అందువల్లనే అతను మళ్లీ కోపిష్ఠి అవుతాడు. ఇలా జీవితాన్ని అర్థం చేసుకుంటాడు ధనస్వామి.

కొండకే చూపులుంటే అవి ఆకాశాన్నే చూడగలవు గానీ క్రిందికి చూడజాలవు. దాన్నే కవి ఎలా చిత్రిస్తారో చూడండి—

"ఊహల ఉన్నత సౌధాంతర్భాగంనుంచి
సాగే పథాలలో పయనించే
కొండచూపులకు
ఆకాశం ఆశ్లేషించే పుష్పాలే గానీ
మట్టిని పిసుక్కునే వేళ్లు అనవు"

నిజమే! ఈ పర్వతరాజు ఇన్నాళ్లూ అధోజగత్తు (క్రీశిలోకం) ఎలాగుంటుందో ఎరగడు. అతడెరిగినది ఊర్ధ్వ జగత్తుమాత్రమే! అతనికి ఆకాశం ఆశ్లేషించే చుక్కల్లాంటి పువ్వులే కనిపించాయి కానీ ఆపువ్వులను పూసే చెట్లకు ఆధారభూతమైన వ్రేళ్లు కనిపించలేదు. ఇప్పుడు జగద్రహస్యం అతని కవగతమవుతుంది. పైకి కనిపించే ప్రతి సౌందర్యానికి స్రష్టలయినవారు అట్టడుగున పడిపోయి ఉంటారని, వారి శ్రమవల్లనే జగత్ సౌఖ్యం, సౌందర్యం రూపొందుతవని తెలుసుకున్నాడు. అంతేగాదు; తానిన్నాళ్లుగా ఏ పువ్వులనుచూసి మురిసిపోతున్నాడో ఆ పువ్వులే అతనికిప్పుడు మాత్సారం చెబుతున్నాయి. ఏమని?

"పువ్వులు ఆనందలాలసతలేకావు
జీవిత క్షణభంగురత్వానికి
వేయిరంగుల సందేశాలు"

తన జీవితంకూడా క్షణభంగురమే అనడానికి తన గుండెలనిండా విరిసిన పూవులే తార్కాణమవుతున్నాయి కొండకు. అవి జీవితక్షణభంగురత్వాన్ని బోధిస్తున్నాయతనికి ఈనాడు.

ఈ బోధ కలగగానే ఆ కొండకు పాపం గుండెల్లో దుఃఖం పేరుకుంది. వెంటనే కొండకు పరివర్తన వచ్చింది. రాళ్ళే అది రాల్చిన కన్నీటి చుక్కలయ్యాయి. రాళ్లను శ్రామికులు తొలిచారు. అందువల్ల ఆ కొండకు మరో సౌందర్యం కలిగింది. మన భావన మారితే సౌందర్యరూపాలుకూడా మారడం సహజమే! ఆకాశాన్ని చుంబించే కొండ ఒకనాడు అందం కావచ్చు. దానిని వికృత పరచడం వల్లకూడా మరో అందం ఏర్పడుతుందనే సంగతి వికృతపరిస్తేకానీ తెలియదు.

"కన్నీటి చుక్కల్లా ఒక్కొక్క రాతినీ రాల్చి
వేయి శిల్పాలుగా చెక్కుకోమంది"

కొండ. ఇంతకుముందు ఒకటే సౌందర్యం. ఇప్పుడు వెయ్యి సౌందర్యాలు.

వసంతం గ్రీష్మంగా పరివర్తన చెందడం ప్రకృతి సహజం. అప్పుడు బ్రతుకు దాహతప్తమయిపోతుంది. అలాంటి బ్రతుకును చూసి కొండ ఈనాడు జాలిపడుతోందట! అలాంటి బ్రతుకుకి ప్రతిగాలీ మధురోదకాలందించాలని మనసారా వాంఛిస్తుంది కొండ!

కానీ ఆ గ్రీష్మంలోనిప్రతిగాడ్పూ ఒక కఠోర సత్యంలాంటిదే!

ఆ గాడ్పే ఆ కొండ సరాల్లోని ఆర్ద్రహరితాన్ని హరిస్తోంది. అందు వల్లనే

"సుంద్రని కాలపు శిబిరంలో
ఘర్షణ సాగుతోంది అవిరళంగా"

కాలం మారిపోయింది. ఫ్యూడల్ వ్యవస్థ అంతరించింది. ప్రజా స్వామికం అవతరించింది. ఒక్కనికోసం అందరూ కాదు; అందరి కోసం అందరూ శ్రమపడవలసిందే! వ్యష్టి వైభవం ఇంకెన్నాళ్లు సాగుతుంది? అందుకే కొండ క్రమంగా రాళ్ళూ రాగాలూ రాల్చేసు కుందట! అంతేకాదు:

"స్వయంగా తానే దిగివచ్చి
ఎగుడు దిగుళ్ళు లేని
ఎంచక్కని పచ్చల తివాసీగా
మారిపోయింది"

ఈవిధంగా సమసమాజానికి దోహదం చేస్తోంది కొండ! ఎగుడు దిగుళ్ళులేని ఎంచక్కని పచ్చల తివాసీ" వర్గరహిత స్వర్గంకు ప్రతీక! కవి కలలు కంటున్న సమ సమాజం అదే!

సామ్యవాదం సోమసుందర్ ఊపిరిలో వజ్రాయుధ రచనా కాలం నుంచీ జీవధారగా అనుస్యూతంగా ప్రవహిస్తున్నది. సామాజిక స్పృహ ఆయన రక్తంలో ఉన్నది. ఆశయం గొప్పదే! అంతమాత్రాన ఎప్పుడూ గొప్పకవి కాలేడు. అయితే ఆశయం మహితం కాకపోయినా, ఆశయావశే లేకపోయినా ఏ కవీ గొప్పకవి కాలేడు. ఆశయంతోపాటు సంవిధానం, శిల్పం, భాష, అభివ్యక్తి వైవిధ్యం మొదలైనవికూడా విలక్షణమైనప్పుడూ శ్రేయస్సుతోపాటు ప్రేయస్సుకూడా ముడివడి నప్పుడూ వ్యక్తిత్వం ఉన్నవాడెవడైనా గొప్ప కవిగా మారతాడు. ఇది కాలక్రమేణా రావలసిన సహజపరిణామం మాత్రమే! అలాంటి గొప్ప కవి సోమసుందర్ పుట్టిడు కావ్యాలు ప్రచురించలేకపోయినా ఫరవా లేదు. సౌందర్యానికి గుణమేకానీ గణం ప్రధానం కాదు. అయితే జీవి తాన్ని పుష్కలంగా అనుభవించిన కవి, మేధావి అయిన రచయిత, జీవుని వేదన నొక గంగానదిగా తలదాల్చిన మనస్వి మౌనముద్ర వహించలేడు. వచస్తాండవం చేస్తూనే ఉంటాడు. కవితాజపం సాగి స్తూనే ఉంటాడు. అతని కలం ఒక ఢక్కలా మ్రోగుతూనే ఉంటుంది. సోమసుందరుడయిన ఈకవి నిజంగానే ఒక శివుడు. అందుకే అవసరమైనపుడు ఆయుధం ధరించారు; రక్తాక్షి విప్పారు; కాహళి నాదించారు. కదనానికీ కవనానికీ సేతువు కట్టారు.

సోమసుందర్‌కు నవత ఉచ్ఛ్వాసం; కవిత నిశ్వాసం. మానవత మందహాసం. ఆయన కావ్యాలన్నీ సంపుటాలుగా ఈ దశాబ్దాంతం లోగా రావాలని ఆశిద్దాము.

అథో జ్ఞాపికలు

1. వచన సంకీర్తనలు : ఆ ముఖం. శశాంక. ప్రచురణ 1963 ఫిబ్రవరి.
2. కథల సంపుటి
3. ఎర్నెస్ట్ టాలర్‌కు అనువాదం—వచన కవితా నాటకం.
4. విద్యుల్లత, మధులహరి, కచదేవయాని, విద్యాధరి, వసంతవిలాసం—ఈ దశలో రచించిన కృతులు
5. మద్రాసు ప్రభుత్వం ఆ కావ్యప్రతులను జప్తు చేసింది.
6. "ఆంధ్రరాష్ట్ర వాంఛను ఉద్ఘోషించిన ప్రజా హృదయాన్ని, విశ్వశాంతికై పరితపించే జగజ్జన మనోభావాలనూ కవితారీతిలో ప్రచురించడానికి ప్రయ త్నించాను"— కాహళి పీఠికలో కవి.
7. "వాస్తవాన్ని కళ్లారా చూచిన నేను ఈ విపత్కా లంలో యథాశక్తి గోదావరి జలప్రళయాన్ని ప్రక టించి తద్వారా వచ్చిన ఆదాయాన్ని వరద బాధితుల నిధికి సమకూర్చేం.
8. "ఈ కావ్యం 10–10–1959 తేదీని పూర్తి చేయబడింది" — సోమసుందర్. ప్రచురణ : లక్టోబరు 1963.
9. ప్రచురణ : 1963 అక్టోబరు. 10 చూ. ఈ కావ్యంలోని 'ప్రొలోగ్' 11, 12 చూ. అదే.
13. చూ. ఈ కావ్యంలోని 'ఎపిలోగ్'
14. జననం 18–11–1924 క్షీరాబ్ది ద్వాదశినాడు.
15 విశాఖ ఆకాశవాణినుంచి ప్రసారితం. 10–8–75 ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితం, ఈ కొండ విజయవాడ దగ్గర తాను చూసినదని సోమసుందర్ నాతో అన్నారు.

ప్రభుత్వ వాణిజ్య బ్యాంకుల ప్రగతి

శ్రీ ఐ. సత్యసుందరం

ప్రధాన రంగాలకు, దేశంలో ఆర్థికంగా, సాంఘికంగా వెనుకబడిన వారికి ఎక్కువ పరపతి సౌకర్యములు సమకూర్చుటకై 1969 జూలైలో 14 పెద్ద వాణిజ్య బ్యాంకులు జాతీయం చేయబడినవి. గత 6 సంవత్సరాలలో వాణిజ్య బ్యాంకులు కొన్ని చెప్పుకోదగిన విజయాలను సాధించినవి. వ్యవసాయ రంగానికి పరపతిని పెంచుట బ్యాంకుల జాతీయకరణ ముఖ్యోద్దేశము. బ్యాంకు వసతులులేని గ్రామీణ ప్రాంతాలలో అనుబంధ శాఖలను ఏర్పరచుటకు ప్రభుత్వ వాణిజ్య బ్యాంకులు ప్రస్తుతము కృషి చేయుచున్నవి. జాతీయకరణకు పూర్వము అనుబంధ శాఖలలో 80 శాతము పట్టణ ప్రాంతములో వున్నవి. 1973 చివరి నాటికి మొత్తం అనుబంధ శాఖలలో 36.5 శాతము గ్రామీణ ప్రాంతాలలో వున్నవి.

పెద్ద తరహాలో డిపాజిట్లను సేకరించుటకు, వెనుకబడిన వారికి ఋణాలను ఎక్కువగా సమకూర్చుటకై ప్రస్తుతము లీడ్ బ్యాంక్ స్కీమ్ **(Lead Bank Scheme)** అమలులో వున్నది. ఈ పద్ధతి ప్రకారం, ఒక జిల్లా అభివృద్ధి కార్యక్రమములకు కావలసిన పరపతిని ముఖ్యంగా ఒక బ్యాంకు చూసుకొనును. తన స్వాధీనంలో వున్న జిల్లాను సర్వేచేసి, ఏ ప్రాంతాలు, రంగాలకు ఎక్కువగా ఋణాలు కావలెనో ఈ లీడ్ బ్యాంకు పరిశీలించును. ప్రస్తుత కొన్ని తరగతుల ఆర్థికంగా వెనుకబడినవారికి ప్రభుత్వ వాణిజ్య బ్యాంకులు 4 శాతం వడ్డీరేటుకే ఋణాలను సమకూర్చుచున్నది. దీనినే **DiHerential Interest rate scheme** అందురు.

మన గ్రామీణ ప్రాంతాలలో డిపాజిట్ల సేకరణ తగినంతగా లేదు. కారణం, ఈ ప్రాంతాలలో ధనవంతులకు చాలాకాలంగా బ్యాంకులద్వారా పొదుపు చేసుకొనే అలవాటులేదు. ఉత్పత్తికి ఉపయోగపడని పెట్టుబడి చేయుటకు వీరు అలవాటు పడినారు. తమ ఆదాయాలలో ఎక్కువ భాగాన్ని వడ్డీకి ఇచ్చుటగాని, అంచనా వ్యాపారం చేయుటకు గాని, లేక బంగారం, వెండి, నగలను కొనుటకుగాని ఉపయోగించుట వీరి అలవాటు. గ్రామీణ ప్రాంతాలలో డిపాజిట్లను పెంచుట ఎలా అనునది వాణిజ్య బ్యాంకులు ఎదుర్కొనుచున్న ముఖ్యమైన సమస్య. కేవలం అనుబంధ శాఖలను ఈ ప్రాంతంలో స్థాపించుటద్వారా ఇది సాధించలేము. ఈ ప్రాంతాలలో ధనవంతులకు బ్యాంకులను ఉపయోగించుట అలవాటులేదు కాబట్టి, గ్రామీణ పరిస్థితులకు అనుగుణంగా తమ పద్ధతులను వాణిజ్య బ్యాంకులు మార్చుకోనవలెను. పొదుపు, ఆదాయ నిష్పత్తి గ్రామీణ ప్రాంతాలలో 2.1 శాతం మాత్రమే. ఇది 5 శాతం వరకు పెరిగే అవకాశం వున్నది. ఏమైనప్పటికి ఈ శాతం చాలా తక్కువనే చెప్పాలి. సరియైన ప్రచారం ద్వారా (ముఖ్యంగా పంట చేతికి వచ్చే సమయంలో) వాణిజ్య బ్యాంకులు గ్రామీణ ప్రాంతాలలో పొదుపు మొత్తాలను పెంచాలి. పట్టణ ప్రాంతాలలో వాణిజ్య బ్యాంకులు ఉపయోగించే పద్ధతులు గ్రామీణ ప్రాంతాలకు సరిపోవు. అక్కడి పరిస్థితులు వేరు కాబట్టి వివిధ ప్రాంతాలలోని ప్రజల వివిధ అభిరుచులను లెక్కలోనికి తీసికొనవలెను. అంతేకాకుండా, అన్ని గ్రామీణ ప్రాంతాలలో ఉత్పత్తి, పొదుపు పెరుగుదలలు ఒకేరకంగా వుండవు.

గ్రామీణ ప్రాంతాలలో ప్రజలలో ఎక్కువమంది నిరక్షరాస్యులు. అందుచే, వారు మామూలుగా ఆదాయాలను డిపాజిట్ చేసే పద్ధతిని అవలభించలేరు. వ్యవసాయదారులకు అనుగుణంగా బ్యాంకులు తాము పనిచేసే తీరును, పనిచేయు కాలమును మార్చుకొనవలెను. ఇటువంటి సమస్యలను ప్రభుత్వ వాణిజ్య బాంకులు నేర్పుతో ఎదుర్కొనుచున్నవి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో అనుబంధ శాఖలను స్థాపించుటలో గత ఆరు సంవత్సరాలలో ప్రభుత్వ వాణిజ్య బ్యాంకులు చేసిన కృషి ప్రపంచంలో మరి ఏ ఇతర దేశంలో జరుగలేదని తెలియుచున్నది. గత ఆరు సంవత్సరాలలో స్థాపించిన అనుబంధ శాఖలలో సగం ఇంతకుముందు బ్యాంకు సౌకర్యంలేని ప్రాంతాలలోనే స్థాపింపబడినవి. ఉదాహరణకు, జూలై 1969, మే 1975 మధ్యకాలంలో స్థాపించిన అనుబంధ శాఖలు 10,375. వీటిలో 5,518 ఇదివరకు బ్యాంకు వసతులులేని ప్రాంతాలలో స్థాపింపబడెను.

ప్రధాన రంగాలకు ఋణాలను చాలావరకు పెంచుట జరిగెను. గత ఆరు సంవత్సరాలలో ప్రధాన రంగాలకు ఋణాలు ఏవిధంగా

రచయిత మచిలీపట్టణము హిందు కాలేజిలో పోస్టుగ్రాడ్యుయేట్ ఆర్థిక శాస్త్ర శాఖలో లెక్చరర్.

పెరిగినది పట్టిక తెలుపుచున్నది. పట్టిక 2 రాష్ట్రవారీగా వాణిజ్య బ్యాంకుల పురోభివృద్ధి తెలుపుచున్నది.

పట్టిక 1

వివిధ రంగాలకు వాణిజ్య బ్యాంకుల ఋణాలు

రంగము	(కోట్ల రూపాయలలో) జూన్ 1969	ఏప్రిల్ 1975
ప్రభుత్వ ఆహార ధాన్యాల సేకరణ	233	563
వ్యవసాయము	188	767
చిన్నతరహా పరిశ్రమలు	286	1024
ఎగుమతులు	258	731
ఇతర ప్రధాన రంగాలు	30	314
ప్రధాన రంగాలు మొత్తం	995	3399
	(27.6)	(39.6)
ఇతరములు	2605	5191
	(72 4)	(60.4)
మొత్తం ఋణాలు	3600	8590

(బ్రాకెట్లలో వున్న సంఖ్యలు మొత్తంలో వాటా శాతం తెలుపుచున్నవి)

(పట్టిక—2 ప్రక్క పేజీలో చూడుడు)

పట్టిక 1ని బట్టి వ్యవసాయరంగానికి ఋణాలు బాగా పెరిగినట్లు తెలియుచున్నది. 1969లో ఈ రంగము 188 కోట్ల రూపాయలు పొందగా, 1975లో ఇది 767 కోట్ల రూపాయలు వున్నది. వాణిజ్య బ్యాంకులు వ్యవసాయ రంగానికి పరోక్షంగా కూడా సహాయపడినవి. ఉదాహరణకు, వాణిజ్య బ్యాంకులనుండి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు 1969లో 4646 కోట్ల రూపాయలు పొందగా, 1973లో–12362 కోట్లరూపాయలు పొందినవి. తలసరి డిపాజిటు 88 రూపాయలనుండి 210 రూపాయలకు పెరిగినది. జాతీయ ఆదాయంలో డిపాజిట్ల శాతము (వస్తుత ధరలలో) 15.3 నుండి 20కు పెరిగినది.

గ్రామీణ ప్రాంతాలలో అనుబంధ శాఖల సంఖ్య విపరీతంగా పెరుగుట గమనించదగిన విశేషము. కేవలం లాభదృష్టితో కాకుండా ఆర్థిక సాంఘికలక్ష్యాలను దృష్టిలో వుంచుకొనుటచే ఇది సాధ్యపడినది. ప్రాంతాల వారీగా అనుబంధ శాఖల పంపిణీ పట్టిక 3లో చూపబడినది.

(పట్టిక—3 : 56 వ పేజీలో చూడుడు)

క్రొత్తగా స్థాపించిన అనుబంధ శాఖలు, డిపాజిట్లు, ఋణాల పెరుగుదలలో వివిధ ప్రాంతాల వాటాలు పట్టిక 4లో చూపబడినది. ఈ పట్టికను బట్టి గ్రామీణ ప్రాంతాలలో అనుబంధశాఖల స్థాపన డిపాజిట్ల సేకరణ, ఋణాలు కూడా హెచ్చు స్థాయిలో వున్నట్లు తెలియుచున్నది.

పట్టిక- 4

ప్రాంతము	క్రొత్తగా స్థాపించిన అనుబంధ శాఖలశాతం	డిపాజిట్ల శాతము	ఋణాల శాతము
గ్రామీణ	56.5	27.5	27.6
గ్రామీణ/పట్టణ	21.2	22.3	25.6
పట్టణ	11.9	22.5	21.1
పెద్ద పట్టణాలు/ రేవుపట్టణాలు	10.4	27.6	25.7
మొత్తము	100.0	100.0	100.0

ప్రభుత్వ రంగము, ప్రైవేటు రంగములో వున్న బ్యాంకులన్ని కలిసి 1969 జూలై, 1975 మే మధ్యకాలంలో 10,375 అనుబంధ శాఖలను స్థాపించినవి. బ్యాంకు వసతులున్న, బ్యాంకు వసతులు లేని ప్రాంతాలలో వివిధ బ్యాంకులు ఏవిధంగా అనుబంధశాఖలు స్థాపించినవో పట్టిక 5 తెలుపుచున్నది. ప్రభుత్వరంగంలో బ్యాంకులు ప్రైవేటు రంగంలో బ్యాంకులకంటె చాలా ఎక్కువ సంఖ్యలో అనుబంధ శాఖలను స్థాపించుట ఈ పట్టికలో గమనించవచ్చును.

(పట్టిక—5 : 56 వ పేజీలో చూడుడు)

అనుబంధ శాఖల పెరుగుదలతోపాటు, బ్యాంకుల డిపాజిట్లు కూడా చెప్పకోతగినంతగా పెరిగినవి, జూన్ 1975 నాటికి వాణిజ్య బ్యాంకుల మొత్తం డిపాజిట్లు, 12,362 కోట్ల రూపాయలు.

పట్టిక - 2

రాష్ట్ర వారిగా వాణిజ్య బ్యాంకుల ప్రగతి

రాష్ట్రం కేంద్ర పాలితం	అనుబంధ శాఖల సంఖ్య		డిపాజిట్లు (కోట్ల రూపాయలలో)		ఋణాలు (కోట్ల రూపాయలలో)		మొత్తం ఋణాలలో ప్రధాన రంగాల వాటా శాతం	
	జూన్ 1969	జూన్ 1974	జూన్ 1969	జూన్ 1974	జూన్ 1969	జూన్ 1974	జూన్ 1969	జూన్ 1974
1 ఆంధ్రప్రదేశ్	444	928	121.11	309.99	122.09	306.92	24.4	38.5
2 అస్సామ్	67	170	33.20	87.39	12.85	38.90	10.3	37.2
3 బీహార్	269	665	168.67	494.73	52 05	178.33	9.1	30.3
4 గుజరాత్	750	1425	401.31	810 89	194 89	504 04	15.9	33.7
5 హరియానా	140	294	48 79	125.59	23.15	87.03	28 2	52.3
6 హిమాచల్‌ప్రదేశ్	41	143	12 38	56.00	3 49	8.72	2.7	35.6
7 జమ్ము & కాశ్మీర్	17	91	17.95	37.04	0.86	9.63	30.3	59.0
8 కర్నాటక	510	1113	187.78	405 66	143.04	394.55	24.8	33.2
9 కేరళ	331	640	116.79	250.97	76 95	178.72	27.6	45.2
10 మధ్యప్రదేశ్	332	803	107.43	287.53	63.14	178.30	22.3	33.2
11 మహారాష్ట్ర	946	1728	902.67	1948.85	911.79	1696.10	12.4	19.9
12 మణిపూర్	2	9	1.06	3 69	0.15	1.12	–	89.3
13 మేఘాలయ	7	18	8.87	20.41	2.52	1.91	50.0	53.9
14 నాగాలాండు	2	7	1.07	3.18	0 06	0.78	40.0	39.7
15 ఒరిస్సా	96	241	29.49	85.72	14.60	45.89	11.2	32.5
16 పంజాబ్	290	611	185 41	416.87	50.29	184 11	27.9	51.1
17 రాజస్థాన్	311	613	73.73	171.91	38 20	102 50	16.8	38.7
18 తమిళనాడు	721	1239	233.48	624.98	311.32	705 30	25.5	25.8
19 త్రిపుర	5	18	3.76	10.65	0.16	1.28	9.5	62.5
20 ఉత్తరప్రదేశ్	639	1475	337 15	874 54	153.74	405.23	16 9	39.1
21 పశ్చిమబెంగాల్	428	903	456.45	1040 93	525.80	892.99	4.4	12.3
కేంద్రపాలితాలు								
1 చండీఘుర్	19	38	34 55	57.66	64.13	167.00	40.2	2.6
2 ఢిల్లీ	207	396	359.80	732.46	244.90	553.30	10.2	20.1
3 గోవా, డామన్, డయ్యు	83	129	48.68	98.32	19.68	43.63	12.6	35.9
4 పాండిచేరి	11	24	5.06	11.76	4.74	12.51	12.9	8 8
5 మిగిలినవి	1	20	0.33	4.58	0.01	0.77	–	88.3
మొత్తము	6669	13741	3896.97	9012.30	3034.60	6699.56	14.9	25.2

పట్టిక - 3

అనుబంధశాఖల సంఖ్య

ప్రాంతము	జూలై 1969	మొత్తంలో శాతము	జూన్ 1974	మొత్తంలో శాతము	జూన్ 1969 జూలై 1974 మధ్యకాలంలో పెరుగుదలశాతం
గ్రామీణ	1832	22.4	6175	36.5	50.1
గ్రామీణ—పట్టణము (semi-urban)	3322	40 1	5094	30.1	20.4
పట్టణ	1447	17.5	2891	17.0	16.6
పెద్దపట్టణాలు/రేవుపట్టణాలు	1661	20.0	2700	16.4	12.9
మొత్తము	8262	100.0	16936	100.0	100.0

పట్టిక - 5

క్రొత్తగా స్థాపించిన అనుబంధశాఖలు

	బ్యాంకు వసతులు లేని ప్రాంతంలో	బ్యాంకు వసతులు వున్న ప్రాంతంలో	మొత్తము
స్టేటు బ్యాంక్ ఆఫ్ ఇండియా	984	878	1842
స్టేటు బ్యాంక్ అనుబంధ సంస్థలు	469	375	844
14 జాతీయం చేయబడిన బ్యాంకులు	2874	2803	5677
మొత్తం ప్రభుత్వ బ్యాంకులు	4307	4056	8363
మొత్తం ప్రైవేటు బ్యాంకులు	851	1161	2012
మొత్తం వాణిజ్య బ్యాంకులు	5158	5217	10375

డిపాజిట్ల సేకరణలో వివిధ బ్యాంకుల కృషి పట్టిక 6లో చూపబడినది.

(పట్టిక—6 : 57 వ పేజీలో చూడుడు)

ప్రభుత్వరంగంలోని, ప్రైవేటు రంగంలోని బ్యాంకులను పోల్చి చూచినచో కొన్ని విషయాలు తెలియును. ప్రభుత్వ బ్యాంకుల ఋణాలలో నాల్గవవంతు ప్రధాన రంగాలకు చేరగా, ప్రైవేటు బ్యాంకులు తమ ఋణాలలో ఐదవవంతు మాత్రమే ప్రధాన రంగాలకు సమకూర్చినవి. ప్రభుత్వ బ్యాంకుల మొత్తం ఋణాలు 1971 లో 4342.09 కోట్ల రూపాయలు వుండగా, ఇవి 6175.17 కోట్ల రూపాయలకు పెరిగినవి. ప్రైవేటు బ్యాంకుల విషయంలో ఈ పెరుగుదల 771.80 కోట్ల రూపాయలనుండి 1095.44 కోట్ల రూపాయల వరకు డిపాజిట్లలో ఋణాల శాతము ప్రభుత్వ బ్యాంకుల విషయంలో 1971 లో 66.5,

పట్టిక-6

డిపాజిట్ల పెరుగుదల (కోట్ల రూపాయలలో)

	జూన్ 1969	జూన్ 1975
స్టేటుబ్యాంక్, దాని అనుబంధ సంస్థలు	1239	3543
14 జాతీయంచేయబడిన బ్యాంకులు	2633	6839
ప్రభుత్వ బ్యాంకులు మొత్తం	3872	10382
ప్రైవేటు బ్యాంకులు	774	1980
వాణిజ్య బ్యాంకుల మొత్తం	4646	12362

1972 లో 60.9, 1973 లో 65. ప్రైవేటు బ్యాంకుల విషయంలో ఈశాతము 68.1, 64.9 మరియు 66.6.

ప్రభుత్వరంగ బ్యాంకులు ప్రధాన రంగాలకు సమకూర్చిన ఋణాలు 1971 లో 971.02 కోట్ల రూపాయల నుండి 1973 లో 1547.14 కోట్ల రూపాయలకు పెరిగినవి. పెరుగుదల శాతము 22.4 నుండి 25 వరకు. ప్రైవేటు బ్యాంకుల విషయంలో ఈ ఋణాల పెరుగుదల 1972 లో 165.26 కోట్ల రూపాయలనుండి 210.98 కోట్ల రూపాయల వరకు. పెరుగుదల శాతం 18.5 నుండి 19.3 వరకు. మొత్తం డిపాజిట్లలో ప్రభుత్వ బ్యాంకుల డిపాజిట్ల శాతము 85.

ప్రభుత్వ బ్యాంకుల అనుబంధశాఖలు 1971లో 10,680 నుండి 1973 లో 13,434 కు పెరిగినవి. పెరుగుదలశాతం మూడు సంవత్సరాలలో వరుసగా 16.4, 13 మరియు 11.3. ప్రైవేటు బ్యాంకుల విషయంలో అనుబంధ శాఖల పెరుగుదల

1971 లో 1989 నుండి 1973 లో 2693 వరకు. మూడు సంవత్సరాంలో పెరుగుదల శాతం వరుసగా 17, 16.9 మరియు 15.9.

అనుబంధశాఖల సంఖ్య విపరీతంగా పెంచుటవలన వాణిజ్య బ్యాంకులు అనేక సమస్యలను ఎదుర్కొనవలసివచ్చెను. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో అనుబంధ శాఖలను సక్రమంగా నిర్వహించుటకు తగినంత సమర్థవంతమైన సిబ్బందిని పొందుట. అనుబంధ శాఖల విస్తరణ లాభాలను తగించుచున్నవి. సన్నకారు రైతుల పరపతి అవసరాలను తీర్చుట గ్రామీణ బ్యాంకుల ముఖ్య కర్తవ్యము. ప్రభుత్వ బ్యాంకులు వీరి సమస్యలను జాగ్రత్తగా పరిశీలించవలెను. వారి పరపతి అవసరాలు ముందు ముందు బాగాపెరగ గలవు. ఎఱువులు మొదలగు ఉత్పాదకాలను పొందుటలో వారికి సహాయ పడవలెను.

గ్రామీణ ప్రజలను వడ్డీ వ్యాపారస్థుల బాధలనుండి విముక్తి చేయుటకు కేంద్ర ప్రభుత్వము ప్రత్యేకమైన గ్రామీణ బ్యాంకులను ఇటీవల స్థాపించినది· ఖాతాదారుని సేవలను మెరుగుపరచే విషయం పరిశీలించుటకు ప్రభుత్వము రెండు కమిటీలను ఏర్పరచినది. గ్రామీణ బ్యాంకులు ఎవరు నిర్వహించవలెను ? సహకార సంఘాలు వ్యవసాయదారుని సేవల సంఘాలలో (Farmer's Servicing Societies) వాటికి ఎటువంటి సంబంధము వుండవలెను? మొదలగు సమస్యలను పరిశీలించుటకు ప్రభుత్వం ఒక సాంకేతిక కమిటిని స్థాపించినది. సహకార సంఘాలు గ్రామీణ—పరపతిని తగినంతగా సమకూర్చక పోవుటవలన జాతీయం చేయబడిన వాణిజ్య బ్యాంకులుకూడా అనేక సమస్యలను ఎదుర్కొనుట వలన గ్రామీణ బ్యాంకులను స్థాపించవలసిన అవసరం వున్నదని ఆర్థిక మంత్రి శ్రీ సుబ్రహ్మణ్యం అన్నారు. ప్రణాళికా లక్ష్యాలను సాధించుటలోను, గ్రామీణ పరపతి సౌకర్యాలను కల్పించుటలోను వాణిజ్య బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులు భవిష్యత్తులో మంచి విజయాలను సాధించగలవని ఆశించవచ్చును.

వాణిజ్య బ్యాంకులు పనిచేసే తీరులో మనము కొన్ని లోపాలను గమనించుట జరిగినది. ఋణాలను ఇచ్చుటలో ఇంకా భద్రతకే ఎక్కువ ప్రాదాన్యత ఇచ్చుచున్నది. బ్యాంకు మేనేజర్లు తగినంత చొరవ, సాహసము చూపెట్టుటలేదు. స్వయం ఉపాధి కల్పించుకునే వారికి, సన్నకారు వ్యవస్థాపకులకు ఎక్కువగా పరపతి సౌకర్యాలు కల్పించవలెను. బ్యాంకులు తమ ఖర్చులను సాధ్యమైనంతవరకు తగ్గించుకొనుట అవసరం. గ్రామీణ ప్రాంతాలలో సేకరించిన డిపాజిట్లు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి వినియోగించవలెనేగాని పట్టణ ప్రాంతాలకు తరలించరాదు. క్రొత్త పథకాలను అమలు పరచుట మంచిదేగాని, వాటివలన సత్ఫలితాలు లభించకపోయినచో వాటి వలన ప్రయోజనం లేకపోగా నష్టములు వచ్చును. ఉత్పత్తి పెరుగుదలకు తోడ్పడే కార్యక్రమములకు అధిక ప్రాధాన్యత ఇచ్చి, అవస్థాపన (infrastructure) కల్పించుటలో బ్యాంకులు ప్రత్యేక శ్రద్ధ చూపవలెను.

విపరీతమైన నష్టాలు పొందే అనుబంధ శాఖల సంఖ్య ఇటీవల పెరుగుచున్నది. నూతనంగా స్థాపించే అనుబంధ శాఖలకయ్యే ఖర్చు, వాటివలన వచ్చే లాభాలను శ్రద్ధగా పరిశీలించవలెను. డిపాజిట్లు మొత్తం 3698 కోట్ల రూపాయలు పెరగగా, క్రొత్త అనుబంధ శాఖల వాటా 283 కోట్ల రూపాయలు మాత్రమే. 500 కోట్ల రూపాయలు గ్రామీణ, పట్టణ—గ్రామీణ (semi-urban) ప్రాంతాల నుండి పట్టణ ప్రాంతాలకు తరలించుట జరిగెను. ఇది వాంచనీయముకాదు. అనుబంధ శాఖలు గ్రామీణ ప్రాంతాలలో స్థాపించునపుడు అవి కనీసం నష్టపోకుండా చూడవలెను. ప్రధాన రంగాలకు చెందే పరపతి ఇటీవల శాతం రూపంలో తగ్గుట జరిగినది. తిరిగి చెల్లించని ఋణాల సంఖ్య కూడా పెరుగుచున్నది. కొన్ని అనుబంధ శాఖల విషయంలో ఇచ్చిన రుణంలో 20శాతం మాత్రమే చెల్లించుట జరిగెను. బ్యాంకు సిబ్బందికి జీతాలు హెచ్చుస్థాయిలో వున్నా, సమర్థవంతమైన సిబ్బందిని బ్యాంకులు పొందుటలేదు. గ్రామీణ అనుబంధ శాఖల విషయంలో ఇది నిజం. సిబ్బందికి సంబంధించిన యూనియన్లు శక్తివంతమైనవి అగుటచే అసమర్థులైన సిబ్బందిపై కఠిన చర్యలు తీసికొనుట సాధ్యపడలేదు. ఖాతాదారుని సేవలు తక్కువ స్థాయిలో వున్నవి. గ్రామీణ బ్యాంకుల మేనేజర్లు దగ్గరలోవున్న పట్టణ ప్రాంతాలలో నివసించుట ఇప్పటికి జరుగుచున్నది. పరిపాలనా నిర్వహణను పూర్తిగా మార్చి, ఉత్పత్తికి ఉపయోగపడే పథకాలను చేపట్టి వారిపై ఎక్కువ శ్రద్ధ చూపినచో, ప్రభుత్వ బ్యాంకులు గ్రామీణ అభివృద్ధి విషయంలో మంచి విజయాలను సాధించగలవు.

ఆస్య వివరం:

తెలుగు వర్ణాల పునర్వర్గీకరణ

శ్రీ వెన్నెలకంటి ప్రకాశం

భాషోచ్చారణకు ఉపయోగించే ఉచ్చారణావయవాలను వివిధ బాగాలుగా విభజించవచ్చు: (1) శ్వాసకోశం, (2) నాదపేటిక (స్వరపేటిక) Larynx) (3) సప్తపథ (Pharynx), (4) ఆస్యవివరం (Oral Cavity), (5) నాసావివరం (Nasal Cavity). శ్వాసకోశం నుంచి బయల్వెడలిన గాలి నాదపేటికద్వారా పయనిస్తూ నాదంగా మారి సప్తపథలోగాని, ఆస్యవివరంలోగాని ఒక ఆకారం పొంది మనకు ధ్వనిగా వినిపిస్తుంది. శ్వాసకోశం చేసేపని గాలిని పైకి పంపడం మాత్రమే. నాదపేటికచేసే పనిని ఇంకొకచోట వివరంగా చెప్పడం జరిగింది (ప్రకాశం 1975). తెలుగు భాష విషయంలో సప్తపథ చేసే పని ఏమంతలేదు గాబట్టి దానిని గురించి వదిలేద్దాం. ఇకపోతే మిగిలింది ఆస్యవివరం. ఆస్యవివరం అనేది పెదవులనుంచి పైన లంబిక (Uvula) వరకు కింద జిహ్వామూలం (root of the tongue) వరకు ఉన్న ప్రాంతం. ఈ ప్రాంతంలోనే అచ్చులకు, హల్లులకు ధ్వనిరూపం ఏర్పడేది.

అచ్చుల హల్లుల ఉత్పత్తిలో జరిగే ప్రక్రియలను కిందివిధంగా చెప్పుకోవచ్చు. ఉచ్చారణావయవాలలో చలన శీలమైనది నాలుక. నాలుకలోని ఏ బాగమైనా ఆస్యవివరంలోని ఊర్ధ్వబాగాన్ని ఎక్కడైనా తాకవచ్చు. అలాకాక కేవలం దగ్గరకు చేరి 'అనురణనగుండం' (resonance chamber) తయారు చెయ్యవచ్చు. తాకి హల్లుల ఉత్పత్తికి కారణమయ్యే ప్రక్రియను 'సంపర్కం' (articulation) అని, తాకకుండా అనురణన గుండాలను సృష్టించి అచ్చుల ఉత్పత్తికి కారణమయ్యే ప్రక్రియను 'సందానం' (approximation) అని అనుకుందాం. (ఇంగ్లీషులోని పారిభాషిక పదాలను లాడిఫోగెడ్ (1972) గారు ఉపయోగించారు). సంపర్క ప్రక్రియలో సప్తపథ దాటి వచ్చిన నాదానికి కొద్దో గొప్పో ఆటంకం కలుగుతుంది. అలా ఏర్పడిన ధ్వనులే హల్లులు. ఏ ఆటంకం లేకుండా సంధానం వలన ఏర్పడినవి అచ్చులు. సంపర్కం విషయంలో గాని, సంధానం విషయంలోగాని మనం ముఖ్యంగా పేర్కొనదగ్గ అంశాలు మూడు: స్థానం, కరణం, విధానం (ప్రయత్నం). స్థానం అనేది ఉచ్చారణ విషయంలో తాకబడేది గాని లేక దగ్గరకు రానిచ్చేది గాని అయిన ఆస్యవివరభాగం. కరణం కదులుతూ తాకేదిగాని లేక దగ్గరకు చేరేదిగాని అయిన భాగం. తెలుగు బాషోచ్చారణ విషయంలో యీ కింది భాగాలు స్థానకరణాలుగా పనిచేస్తాయి.

స్థానాలు : అ) పై పెదవి
ఆ) పై దంతాలు
ఇ) దంతమూలం (alveolum)
ఈ) తాలువు (prepulate)
ఉ) మూర్ధం (hard palate)
ఊ) మృదుతాలువు (Velum)
ఎ) కంఠం

కరణాలు : అ) కిందిపెదవి
ఆ) జిహ్వాగ్రం (apex)
ఇ) జిహ్వోపాగ్రం (lamina)
ఈ) జిహ్వామూలం (dorsum)

సంపర్క సందాన ప్రక్రియలలో పైనచెప్పిన కరణాలు స్థానాలను స్పృశించడమో, దగ్గరికి చేరడమో జరుగుతుందన్నమాట. పై ప్రక్రియలలోని ప్రయత్న విదానాలు (manner of articulation/approximation) ముఖ్యంగా మూడు రకాలు :

అ) సంవృతం (close)
ఆ) మాధ్యమికం (mid)
ఇ) వివృతం (open)

సాధారణంగా ఈమూడు విధానాలను అచ్చుల విషయంలో మాత్రమే

చెప్పారు. కాని యిక్కడ అదేవిధానాలను సంపర్క సంధాన వ్యత్యాసంతో హల్లులకు, అచ్చులకు కలిపి చెప్తున్నాం.

విధానం	హల్లుల/అచ్చుల తరగతి
అ) సంవృత సంపర్కం	స్పర్శహల్లు (stop)
ఆ) మాధ్యమిక సంపర్కము	ఊష్మహల్లు (fricative)
ఇ) వివృత సంపర్కం	శ్రుతి/అనిరుద్ధం(glide/continuant)
ఈ) సంవృత సంధానం	సంవృతాచ్చు (closed vowel)
ఉ) మాధ్యమిక సంధానం	మధ్యాచ్చు (mid vowel)
ఊ) వివృత సంధానం	వివృతాచ్చు (open vowel)

సంవృత—వివృత వ్యత్యాసం అనేది సంధానం విషయంలో అనురణన గుండం యొక్క పరిమాణాన్ని నిర్ణయిస్తుంది. నాలుకకు ఆస్య వివరపు పైభాగానికి ఉన్నదూరం అచ్చుల రూపాన్ని నిర్ణయిస్తాయి. అంతేగాక పెదవులు విస్తారిత స్థితి (spread position) లో ఉన్నాయా లేక వర్తులిత స్థితి (rounded position) లో ఉన్నాయా అన్నదిగూడా అచ్చుల విషయంలో చూచుకోవాలి. తెలుగు అచ్చులను స్థాన, కరణ, విధాన, ఓష్ఠ్యస్థితి దృష్ట్యా కింది విధంగా వర్ణించవచ్చు:

	స్థానం	కరణం	సంధాన విధానం	ఓష్ఠ్యస్థితి
అ	కంఠం—మృదుతాలువు	జిహ్వామూలం	వివృతం	విస్తారితస్థితి
ఇ	తాలువు	జిహ్వోపాగ్రం	సంవృతం	విస్తారితస్థితి
ఉ	కంఠం—మృదుతాలువు	జిహ్వామూలం	సంవృతం	వర్తులితస్థితి
ఎ	తాలువు	జిహ్వోపాగ్రం	మాధ్యమికం	విస్తారితస్థితి
ఒ	కంఠం—మృదుతాలువు	జిహ్వామూలం	మాధ్యమికం	వర్తులితస్థితి

తెలుగులో స్వతంత్రంగాఉండే ఈ అచ్చులు కొన్ని సంధి సందర్భాలలో రూపాంతరాలు పొందుతాయి. ఈ విషయాలు వివరంగా వేరే చోట చర్చించడం జరిగింది (ప్రకాశం, 1972). దీర్ఘాచ్చులను హ్రస్వాచ్చుల దీర్ఘరూపాలుగా చెప్పకోవచ్చు గాబట్టి వాటిని వేరుగా చర్చించనక్కర్లేదు.

ఆస్యవివరం దృష్ట్యా స్పర్శ స్పర్శోష్మ హల్లులను కింది విధంగా వర్ణించవచ్చు.

	స్థానం	కరణం	సంపర్క విధానం
క/గ	మృదుతాలువు	జిహ్వామూలం	సంవృతం
చ/జ	తాలువు/దంతమూలం	జిహ్వోపాగ్రం	సంవృతం మాధ్యమికం
ట/డ	మూర్ధం	(పరివేష్టిత) జిహ్వాగ్రం	సంవృతం
త/ద	దంతమూలం	జిహ్వోపాగ్రం	సంవృతం
ప/బ	పై పెదవి	కింది పెదవి	సంవృతం

పైన చెప్పినట్లు ఆస్యవివర ప్రకారం మనం కొంతవరకు రెండేసి వర్ణాలకు ఒకటేవర్ణన యివ్వవచ్చు. వాటిని నాదపేటికలోఉన్న నాద పుటాల (vocal folds, వీటిని సాధారణంగా నాద తంత్రులు (vocal chords) అంటారు) దృష్ట్యా వేరుచేసుకోవచ్చు. క, చ, ట, త, ప ల ఉచ్చారణ సమయంలో నాదపుటాలు కంపించక వాటిని శ్వాసాత్మక (voiceless/breathed) ధ్వనులుగా ఉండనిస్తాయి. గ, జ, డ, ద, బ ల విషయంలో అవి కంపించి వాటిని నాదాత్మక (voiced) ధ్వనులుగా మారుస్తాయి. (ఈ సందర్భంలో ఒక చిన్న విషయం గమనించాలి. శ్వాసాత్మక ధ్వనుల ఉచ్చారణలో 'స్థానం'కొద్ది ముందుగాను, నాదాత్మక ధ్వనుల ఉచ్చారణలో 'స్థానం' కొద్ది వెనుకగాను ఉండడం తటస్థిస్తోంది. దీనికి కారణం నాదోష్మ్య కంపన సమయంలో నాలుక కాస్త వెనుకకు లాగబడుతూండడం కావచ్చు). పైన వర్ణించిన హల్లులను 'పూర్తి హల్లులు' అనవచ్చు. వాటి ఉచ్చారణ విషయంలో హల్లుల ఉత్పత్తిలో పైన ఉంటుందన్న ఆటంకం పూర్తిగా ఉంటుంది. పైగా వీటి ఉచ్చారణను పొడిగించడం కొంతవరకే సాధ్యం.

ఇక మిగిలిన హల్లులు : మ, న, ణ, ర, ల, ళ, య, వ, స. ఈ తొమ్మిది స్పర్శేతర హల్లులలో ఆటంకం ఉంటే పాక్షికం మాత్రమే. అనునాసికాలయిన మ, న, ణ ల విషయంలో ఆస్య వివరంలో ఆటంకంఏర్పడ్డా నాసావివరం (**nasal cavity**) ద్వారా గాలి బయట పడుతుంది. పార్శ్వికాలు (**laterals**) గా వర్ణించబడే ల, ళ ల విషయంలో జిహ్వాగ్రం గాలిని ఆపినా పక్కలనుంచి తప్పించు కొనే వీలుంది. రేఫం (ర) విషయంలో గాలి జిహ్వాగ్రం నుంచే తప్పించుకుంటుంది. ఊష్మమయిన 'స' విషయంలో జిహ్వోపాగ్ర-దంతమూల సంపర్క విధానం మాధ్యమిక మైనందువల్ల గాలి రాపిడి (**friction**) తో బయట పడుతుంది. ఈ హల్లుల నన్నిటిని పొడి గించి పల్కడం సులభమే. ఆ విధంగా అవన్నీ అనిరుద్ధాలు (**continuants**). ఆశ్చర్యకరమైన విషయ మేమిటంటే వివృత సంపర్కం (సంవృత సంధానం ?) వల్ల ఉత్పత్తి అయ్యే య, వ లను అనిరుద్ధాలుగా కన్న శ్రుతులు (**glides**) గానే చెప్పుకోవాలి. వీటిని పొడిగించలేము. పై వర్ణనలను పట్టిక రూపంలో కింది విధంగా చూపవచ్చు.

	స్థానం	కరణం	సంపర్క విధానం	అనిరుద్ధ విధానం
మ	పై పెదవి	కింది పెదవి	సంవృతం	అనునాసికం
న	దంతమూలం	జిహ్వాగ్రం	సంవృతం	అనునాసికం
ణ	మూర్ధం	పరివేష్టిత జిహ్వాగ్రం	సంవృతం	అనునాసికం
ల	దంతమూలం	జిహ్వాగ్రం	సంవృతం	పార్శ్వికం
ళ	మూర్ధం	పరివేష్టిత జిహ్వాగ్రం	సంవృతం	పార్శ్వికం
ర	దంతమూలం	జిహ్వాగ్రం	సంవృతం మాధ్యమికం	(తాడితం) కంపితం
స	దంతమూలం	జిహ్వోపాగ్రం	మాధ్యమికం	ఊష్మం
య	తాలువు	జిహ్వోపాగ్రం	వివృతం (సంవృత సంధానం)	కాదు(శ్రుతి)
వ	పై పెదవి/ పై దంతాలు	కింది పెదవి	వివృతం (సంవృత సంధానం) :	కాదు (శ్రుతి)

ఇప్పటివరకు వర్ణించిన హల్లులు తెలుగు భాషలోని తద్భవ, దేశ్యపదాల ఉచ్చారణకు సంబంధించినవి. ఇవికాక సంస్కృతంనుంచి తీసుకొన్న తత్సమ, అర్ధతత్సమ పదాల ఉచ్చారణలో మరికొన్ని ధ్వనులు విన్పిస్తాయి. వాటిలో మహా ప్రాణులైన ఖ, ఘ, ఛ, ఝ, ఠ, ఢ, థ, ధ, ఫ, భ లు ఊష్మాలైన శ, షలు ఉన్నాయి. మహా ప్రాణులను శ్వాసాత్మకమైన 'హ'తో గూడిన అల్పప్రాణులు అనుకో వచ్చు కాబట్టి వాటిని వేరుగా వర్ణించనక్కర్లేదు. ఇకపోతే శ, ష, హ లను ఇంగ్లీషు ఉర్దూ భాషలనుండి వచ్చిన పదాలలో వినిపించే 'ఫ'ను కింది విధంగా వర్ణించవచ్చు.

	స్థానం	కరణం	సంపర్క విధానం
శ	తాలువు	జిహ్వోపాగ్రం	మాధ్యమికం
ష	మూర్ధం	జిహ్వోపాగ్రం	మాధ్యమికం
ఫ	పై దంతాలు	కింద పెదవి	మాధ్యమికం
హ	నాదద్వారం(**glottis**)		వివృతం మాధ్యమికం

ఇంతవరకు తెలుగులో వినవడే అచ్చులను హల్లులను ఆస్య వివరం ఆధారం చేసుకొని ధ్వన్యాత్మకంగా వర్ణించడం జరిగింది. ఇప్పుడు దేశ్యపదాలను మనసులో ఉంచుకొని హల్లుల వర్గీకరణ గురించి చర్చించుకుందాం. సాధారణంగా జరిగే వర్గీకరణం ప్రకారం మనం తీసుకొన్న ధ్వనులను కిందివిధంగా రాసుకోవాలి :

కంఠ్యాలు (మృదుతాలవ్యాలు) : క, గ
తాలవ్యాలు : చ, జ
మూర్ధన్యాలు : ట, డ, ణ
దంత్యాలు : త, ద, న
ఓష్ఠ్యాలు : ప, బ, మ
అంతస్థాలు : య, ర, ల, ళ, స, వ

అంతస్థాలను తప్పిస్తే మిగతా హల్లుల వర్గీకరణ 'స్థానం' ప్రధానంగా తీసుకొని చేసేది. ఈ వ్యాసకర్త అభిప్రాయంలో ఈ వర్గీ

కరణకన్నా కరణం ప్రధానంగా తీసుకొని చేసే వర్గీకరణ ఎక్కువ ఉపయోగకరం. దాని ఉపయోగం ముఖ్యంగా సంధి కార్యవర్ణనలో కన్పిస్తుంది. కింది ఉదాహరణలను పరీక్షిద్దాం.

(1) చెరుకు + గడ = చెరుగ్గడ
(2) పెరుగు + కోసం = పెరుక్కోసం
(3) పాత + దయ్యం = పాద్దయ్యం
(4) సూది + తో = సూత్తో
(5) చేప + బరువు = చేబ్బరువు
(6) గూబ + పోటు = గూప్పోటు
(7) గూబ + మోగింది = గూబ్మోగింది
(8) కోట + ను = కోట్ను
(9) మాట + లో = మాట్లో
(10) బడి + ని = బణ్ణి
(11) బడి + లో = బళ్ళో
(12) బడి + లు = బళ్ళు
(13) తాడు + లు = తాళ్ళు
(14) పాత + చెరువు = పాచ్చెరువు
(15) పాత + జల్లెడ = పాజ్జల్లెడ
(16) పాత + సూది = పాస్సూది
(17) కోత + లు = కోతలు
(18) కోత + ను = కోతను
(19) ఆకు + ను = కును
(20) పాప + ను = పాపను

సంధి జరిగే (1–16) సందర్భాలను; జరగని (17-20) సందర్భాలను పరికించి చూస్తే మనకీ కింది విషయాలు తెలుస్తాయి: (1) కొన్ని హల్లుల మధ్య అచ్చు లోపిస్తుంది. (2) అచ్చులోపించిన తర్వాత హల్లులు కొన్ని కొన్ని మార్పు (లు) చెందుతాయి.

అచ్చు లోపించే సందర్భాలు :

(1) క్–గ్, (2) గ్–క్; (3) త్–ద్; (4) ద్–త్; (5) వ్–బ్; (6) బ్–ప్; (7) బ్–మ్; (8) ట్–న్; (9) ట్–ల్, (10) డ్–న్; (11-13) డ్–ల్, (14) త్–చ్; (15) త్–జ్ (16) త్–స్

అచ్చు లోపించని సందర్భాలు :

(17) త్–ల్, (18) త్–న్; (19) క్–న్; (20) ప్–న్.

పైన చెప్పిన స్థానాశ్రిత వర్గీకరణను ఆధారం చేసుకొని గమనిస్తే ఒకటే వర్గానికి చెందిన త, న ల మధ్య సంధి జరగకపోవడం (18), భిన్నవర్గానికి చెందిన ట/డ, న ల మధ్య జరగడం (8, 10) అదే విధంగా భిన్నవర్గాలకు చెందిన త, చ/జ మధ్యగూడ జరగడం (14, 15), ట/డ ల లకు సంధి జరగడం (8, 11–13) అదే విధంగా 'త' కు వర్గేతర 'స' కు సంధి జరగడం (16) మనకొక విషయాన్ని తెలియజేస్తాయి : వర్గీకరణ కేవలం వర్ణాలను సులభంగా గుర్తించుకోవడానికి చేసిందేకాని దానికి వర్ణ ప్రవర్తన (**phonological behaviour**) కు ఎట్టి సంబంధంలేదు. కరణాశ్రిత వర్గీకరణ యిలా ఉంటుంది :

ఓష్ఠ్యాలు : ప, బ, మ [వ=అర్ధాచ్చు, శుతి]

జిహ్వోపాగ్రాలు : త, ద, స, చ, జ [య=అర్ధాచ్చు, శ్రుతి]

జిహ్వాగ్రాలు : ట, డ, న, ణ, ల, ళ, ర

జిహ్వా మూలీయాలు : క, గ

ఈవర్గీకరణాధారంతో సంధికారంలో సంధికార్యాలను గమనిస్తే వాటిని సూత్రీకరించడం సులభమని తేలుతుంది :

సూ (1) "ఒకే వర్గానికి చెందిన హల్లులమధ్య అచ్చు లోపిస్తుంది"

అందుకనే త, న ల మధ్య అచ్చులోపించదు.

అందుకు అపవాద మనిపించే కొన్ని ఉదాహరణలను చూద్దాం :

21 పాల + తో = పాల్తో
22 నూనె + తో = నూన్తో
23 చారు + తో = చార్తో

ల, న, ర లు తవరానికి చెందకపోయినా అచ్చులోపించడానికి కారణం మొదటి మూడు అనిరుద్ధాలు కావడమే. అప్పుడు అచ్చు లోపానికి ముందుగా కింది సూత్రం చెప్పాలి :

సూ (౦) "జిహ్వాగ్ర అనిరుద్ధాలు సంధికి పూర్వంలో ఉన్నప్పుడు పరంలోఉన్న జిహ్వోపాగ్రాలలో కరణం విషయంలో సమీకృత మౌతాయి"

ఈ సూత్రం తర్వాత (1) ని వర్తిస్తే (21–23) లో అచ్చు లోపించడం సాధ్యపడుతుంది. మిగిలినవాటికి తిన్నగా (1) నే వర్తించవచ్చు.

అచ్చు లోపించిన తర్వాత హల్లులలో జరిగే మార్పులకోసం మనం హల్లులను స్పర్శాలుగాను స్పర్శేతరాలుగాను గుర్తించాలి ;

వ, య, స, చ, జ, న, ణ, ల, ళ, ర లు స్పర్శేతరాలు. స్పర్శోష్మా లయిన చ, జ లను ఇక్కడ చేర్చడానికి కారణం వాటి ప్రవర్తన మాత్రమే. స్పర్శేతరాలు పూర్వంగాను స్పర్శాలు పరంగాను వస్తే అచ్చు లోపం మాత్రమే నిత్యం. హల్లులలో ఎక్కువ మార్పురాదు. స్పర్శోష్మాలు కొన్నిచోట్ల తమ స్పర్శతను కోల్పోయి ఊష్మతను మాత్రం ఉంచుకొంటాయి. జిహ్వాగ్రాలు పరంలో ఉన్న పరివేష్టిత జిహ్వాగ్రాల కారణంగా తము గూడ పరివేష్టిత ధ్వనులౌతాయి. ఉదాహరణకు :

(24) కాచు + తే=కాస్తే
(25) లేచు + తే=లేస్తే
(26) వచ్చు + తూ=వచ్చుతూ
(27) పాల + డబ్బా=పాళ్డబ్బా
(28) నూనె + డబ్బు=నూణ్డబ్బు
(29) తోలు + టోపీ=తోళ్టోపీ
(30) తారు + దబ్బా=తార్డబ్బా

[ర : మూర్ధన్యరేఫం—ఇది కేవలం సాధ్యరూపం, సిద్ధంకాదు]

అలాకాకుండా స్పర్శేతరాలు పరంలో ఉంటే పూర్వంలో ఉన్న స్పర్శాలను పూర్తిగా మారుస్తాయి. (10–16)లో జరిగిందేమిటో పరిశీలిద్దాం.

(10) బడి + ని=బణ్ణి
(1) వర్తించాక అచ్చు లోపించాలి.

[1]

(10 I) బడి + ని = బడ్ + ని

ఇప్పుడు 'పరివేష్టితసూత్రం' వర్తించాలి. అదేమిటంటే :

సూ (2) "జిహ్వాగ్ర హల్లు పక్కనే ఉన్న పరివేష్టిత జిహ్వాగ్రంనుంచి పరివేష్టితను పొందుతుంది"

(2) వర్తించాక (10I) నుంచి సాధ్యమయ్యే రూపం

[2]

(10 II) బడ్ + ని = బడ్ + ణి

ఇప్పుడు వర్తించవలిసిన సూత్రం 'అనునాసిక–పార్శ్విక సూత్రం' :

సూ (3) "నాదాత్మక (పరివేష్టిత) జిహ్వాగ్రస్పర్శం పరంలో ఉన్న పరివేష్టితను పొందిన అనునాసిక/పార్శ్విక అనిరుద్ధ జిహ్వాగ్రాలనుండి అనునాసికత/పార్శ్విక తను పొందుతుంది" ఈ సూత్రం వర్తించాక లభ్యమయ్యే రూపం :

[3]

(10 III) బడ్ + ణి = బణ్ + ణి = బణ్ణి

(12) విషయంలో సంధి సూత్రాల వర్తన కిందివిధంగా జరుగుతుంది :

[1]

(12 I) బడి + లు = బడ్ + లు

[2]

(12 II) బడ్ + లు = బడ్ + ళు

[3]

(12 III) బడ్ + ళు = బళ్ + ళు = బళ్ళు

(11) విషయంలో కూడా అలాగే జరుగుతుంది. ఇంకో ఉదాహరణ కూడా తీసుకుందాం :

[1]

(11 I) బడి + లో = బడ్ + లో

[2]

(11 II) బడ్ + లో = బడ్ + ళో

[3]

(11 III) బడ్ + ళో = బళ్ + ళో = బళ్ళో

[1]

(31 I) కోడి + నే = కోడ్ + నే

[2]

(31 II) కోడ్ + నే = కోడ్ + ణే

[3]

(31 III) కోడ్ + ణే = కోణ్ + ణే = కోణ్ణే

వర్గీకరణ అనుకూలంగా లేకపోతే పైన చెప్పిన సంధికార్యాలుగాని, వాటి సూత్రాలుగాని సులభంగా అంతుపట్టేవికావు. ట, డ, న, ల, ళ లను ఒక వర్గంలో చేర్చబట్టే పై తతంగమంతా సహజమే ననిపించే అవకాశముంది.

అదే విధంగా (14–16) లను సహజమనిపించే సూత్రాల కిందికి తీసుకురావాలంటే త, ద, స, చ, జ లను ఒక వర్గంలో చేర్చక తప్పదు. అవన్నీ జిహ్వాప్రాగ్రాలేకదా; ఇక్కడి సంధి స్వరూపాన్ని కింది విధంగా సూత్రీకరించుకోవచ్చు :

సూ (4) "పూర్వంలో ఉన్న జిహ్వాప్రాగ్ర స్పర్శాలు పరంలో

ఉన్న ఊష్మంతోను, సఘోష్మంలోను స్థాన విధానాల విషయంలో సమీకృత మౌతాయి."

[1]

(14^{I}) పాత + చెరువు = పాత్ + చెరువు

[4]

(14^{II}) పాత్ + చెరుకు = పాచ్ + చెరువు=పాచ్చెరువు

[1]

(15^{I}) పాత + జల్లెడ = పాత్ + జల్లెడ

[4]

(15^{II}) పాత్ + జల్లెడ = పాజ్ + జల్లెడ=పాజ్జల్లెడ

[1]

(16^{I}) పాత + సూది = పాత్ + సూది

[4]

(16^{II}) పాత్ + సూది = పాస్ + సూది = పాస్సూది

ఈ వ్యాసంలో వర్గీకరణ ప్రాధాన్యతను సూచించే సంధి కార్యాలను మాత్రమే వర్ణించడం జరిగింది. మిగతా వాటికోసం వివరాలకోసం ప్రకాశం (1972) చూడవచ్చు. వర్గీకరణకు వర్ణ ప్రవర్తనకు ముడిపెట్టడంతో స్థానాశ్రిత వర్గీకరణకన్న, కరణాశ్రిత వర్గీకరణ ముఖ్యమూ, ఉపయోగకరమూ అని తేలినది.

Lade Foged, P. (1972) Preliminaries to Linguistic Phonetics. Univ of Chicago press.

ప్రకాశం, వె. (1972) A Systemic Treatment of certain Aspects of Telugu Phonology. Univ of York D. Phil Thesis.

ప్రకాశం, వె. (1975) "నాదోత్పత్తి" (తెలుగు 4/3 పేజీలు: 167-172)

కలగూరగంప

"తెలుఁగు నవలా సాహిత్య వికాసము" గ్రంథ విమర్శపై వివరణ

1975 వ సం. సెప్టెంబరు భారతిలో నేను వ్రాసిన "తెలుఁగు నవలా సాహిత్య వికాసము" గ్రంథంపైన శ్రీ రామమోహన్‌గారు చేసిన విమర్శను చూచిన పిమ్మట నాకు ఆశ్చర్యం కలిగింది. కారణం — వారు దాన్ని గురించి కొన్ని మంచిమాటలు వ్యక్తం చేసినప్పటికీ, దాన్ని సరిగ్గా చదివి విమర్శించక పోవడమే. దీనివల్ల పాఠకులలో అనిశ్చితమైన సందేహాలు కలగటానికి అవకాశం ఏర్పడుతుంది గనుక అసలు విషయం వివరించి చెప్పటం గ్రంథ కర్తగా నా కర్తవ్యమని భావించాను. అంతేగాక దీన్ని అసలు ఏ ప్రాతిపదికపైన నేను రచించానో, నేను ఏర్పరచుకున్న ప్రణాళిక యేమిటో వారు సరిగ్గా గ్రహించినట్లు తోచదు. వారు వెలిబుచ్చిన సందేహాలన్నింటికీ నా గ్రంథంలో సమాధానాలు వివరించబడి ఉన్నాయి. ఏది యేమైనా గ్రంథ విమర్శన చేసేప్పుడు విమర్శకులు సత్యదృష్టితో, విషయ సదవగాహనతో గ్రంథాన్ని అమూలాగ్రంగా పరిశీలించి రచయితకు భావికాలంలో సన్మార్గదర్శక పరిధిలో నిర్మాణాత్మకమైన సూచనలివ్వాలి. దానితోపాటు పాఠకులకు గ్రంథములో వున్న గుణదోషాలను వివరించి చూపాలి ఆ చెప్పే విషయం హేతుబద్ధంగా వుండాలి. అలా కాక అసలు విషయాన్ని మరుగుపరచి, ఉన్నవి లేనట్లు లేనివి వున్నట్లు వ్రాయడం సమంజసం కాదు. విమర్శ అంటే పొగడ్తకాదు విషయాన్ని వింగడించి గుణదోషాలను సమదృష్టితో చెప్పడం. అది నా గ్రంథ విషయంలో సరిగ్గా జరుగలేదు.

నా గ్రంథం పేరు "తెలుఁగు నవలా సాహిత్య వికాసము" కాగా భారతి 60 వ పేజీలో శ్రీ రామమోహన్‌గారు "తెలుఁగు నవలా సాహిత్యము" అను పేరుతో పెద్ద శీర్షికనుంచారు. ఆ పిమ్మట 61 వ పేజీ మొదటి పేరాలో "నాటి నుండి నేటి వరకు వచ్చిన నవలలపైన విమర్శ పూర్వకంగా వ్రాయబడిన గ్రంథాలు ఇటీవలే వచ్చాయి. ఆ గ్రంథాలలో మొదటిది మొదలి నాగభూషణ శర్మగారి "తెలుఁగు నవలా వికాసము" రెండువది పుల్లాభొట్ల వెంకటేశ్వర్లుగారి "తెలుఁగు సాహిత్య వికాసము" అంటారు. 60 వ పేజీలో "తెలుఁగు నవలా సాహిత్యము" 61 వ పేజీలోని "తెలుఁగు సాహిత్య వికాసము" అను ఈ రెండు పేర్లు నా గ్రంథానికి నేను పెట్టిన పేర్లుగావు. ప్రక్క ప్రక్క పేజీలలోనే రెండు భిన్నమైన పేర్లుంచారు వారు. కాగా 61 వ పేజీలో ఇంతవరకు నవలలపైన విమర్శనా పూర్వకంగా వ్రాయబడిన గ్రంథాలు రెండు అని స్పష్టంగా చెప్పి మొదటిది మొదలివారిదని రెండవది 'నాది' అని అంగీకరిస్తూనే భారతి 64వ పేజీలో మొత్తం మీద ఈ "తెలుఁగు నవలా సాహిత్య వికాసం" పైన డాక్టర్ బొడ్డపాటి వెంకట కుటుంబరావుగారి "ఆంధ్ర నవలా పరిణామం", మొదలి నాగభూషణశర్మగారి "తెలుఁగు నవలా వికాసము" అను గ్రంథాల ప్రభావం ఉన్నట్లు చెప్పవచ్చును అంటారు. ఇవి పరస్పర విరుద్ధమైన మాటలు చూడండి.

వారు 61 వ పేజీలో రెండు గ్రంథాలు మాత్రమే వెలువడినట్లు స్పష్టంగా తెలిసి, 64 వ పేజీలో మూడవ గ్రంథం పేరు చెప్పి, ఈ రెండు గ్రంథాల ప్రభావం నా గ్రంథంపైన ఉన్నదని ఉల్లేఖించటంలో వారి ఉద్దేశం విశదం కావడంలేదు. 61 వ పేజీలో గుర్తురాని గ్రంథం 64 వ పేజీలో గుర్తుకు వచ్చింది వారికి. అయితే అది 61 వ పేజీలో వారు చెప్పిన రెండు గ్రంథాలకన్నా వరుస క్రమంలో అది ముందా ? వెనుకా ? వారు 64 వ పేజీలో దానిని గురించి ఉదహరించి, హఠాత్తుగా దాని సంగతి చెప్పటంవల్ల వారికి గూడా ఏదిముందో ఏది వెనుకో తెలియదన్న మాట. 61 వ పేజీలో మొదటివి రెండుగా ఒక వరుసను నిర్ణయించి వారే చూపారు. గనుక, ఇక వారి వాదాన్ని బట్టే శ్రీ బొడ్డపాటి వారి గ్రంథం మూడవదని వేరే చెప్పనక్కరలేదుగదా. శ్రీ రామమోహన్‌గారు నిర్ణయించిన వరుసనుబట్టి చూచినా మూడవ గ్రంథం ప్రభావం రెండవ దానిపైన ఏట్లా ప్రసరిస్తుందో అనూహ్యంగా ఉంది. ఈలా ఏది గుర్తుకువస్తే దాని ప్రభావం ఇతరులపైన వున్నట్లు చెప్పడంలోని విమర్శనకుగల ఔచిత్యం శంకాస్పదం గదా! ఈ కొలదిపాటి విమర్శలో ఇంతటి పరస్పర విరుద్ధమైన భావ ప్రకటన !

మరొక విషయం వివరిస్తాను. నా "తెలుఁగు నవలా సాహిత్య వికాసాన్ని" ఏ సందర్భంలో యెప్పుడు యెట్లా ప్రారంభించానో, యే యే విధంగా అది ముద్రణ జరుగుతూ వచ్చిందో అన్నివిషయాలు నా నివేదనములో మనవి చేశాను. శ్రీ రామమోహన్‌గారు దానిని చదివినట్లైతే మొదటి గ్రంథంగా పేర్కొన్న శ్రీ మొదలి వారి "తెలుఁగు నవలా వికాసం" ప్రభావం నా పైన ఉండగలదని ఎలా ఊహించగలిగారో తెలియరాకుండా ఉంది. ఇది పూర్తిగా అపోహతో కూడిన ఆరోపణ.

నేను తెలుఁగు నవలా సాహిత్య చరిత్ర నివేదనములో పూర్వాచారాలన్నింటిని విశదంగా వివరించినా శ్రీ రామమోహన్‌గారు దానిని

చూడాకుండానే తమ విమర్శలో తోచినట్లు వ్రాసి నా గ్రంథాన్ని సిద్ధాంత పరంగా వెలువడిన ప్రథమ గ్రంథంగా అంగీకరించక పోవడం దురదృష్టకరం.

భారతి 61 వ పేజీలో తెలుగులో తొలి నవలా రచయిత ఎవరు? అన్న విషయంలో నేను నా గ్రంథం 80 వ పేజీలో తడివి చూచి 'వీరేశలింగం పంతులు – తెలుగు తొలి నవలా రచయిత' అని పేర్కొన్నట్లు వివరించి అది సమంజసం కాదు అంటారు వారు. "తెలుగు తొలి నవలా రచయిత ఎవరు ?" అన్న శీర్షిక వారన్నట్లు 80 వ పేజీ కాదు, 79 వ పేజీలో. తెలుగు తొలి నవలా రచయిత ఎవరు అని ప్రశ్నించుకొని శ్రీ కొక్కొండ వేంకటరత్నం గారి మహాశ్వేత 1867 వ. సం.లోను, శ్రీ నరహరి గోపాలకృష్ణమ్మశెట్టి గారి శ్రీ రంగరాజ చరిత్ర 1872 లోను ప్రకటింపబడినట్లు తెలిపి, 80 వ పేజీలో "వీరేశలింగం పంతులు – రాజశేఖర చరిత్ర" అన్న శీర్షికతో విషయాలన్నీ చర్చించి విమర్శకుల మధ్య గల భిన్నాభిప్రాయాలను విశదీకరించి, రాజశేఖర చరిత్రకుగల సమగ్రతవల్ల పై ఇరువురికి లభించని ప్రచారం, జనాదరణ దీనికి లభించి, ప్రథమ నవలా రచనా గౌరవం ఇది పొందిందని తెలిపి పెక్కుమంది విమర్శకులు ఈ అభిప్రాయాన్ని బలపరుస్తున్నారని తెలియజేశాను. ఈ విషయంలో ఏకాభిప్రాయం లేదన్న సంగతి జగమెరిగిన సత్యం. ఇక్కడే శ్రీ నిడదవోలు వేంకటరావు పంతులుగారు కొక్కొండ వారిని ప్రథమ నవలా రచయితగా పేర్కొనడం పొరపాటు అంటారు శ్రీ రామమోహన్‌గారు. అంతేగాక చింతామణి పత్రికలో నవలలను గురించి చెప్పిన నిబంధనలన్నీ శ్రీ రంగరాజు చరిత్రలో వున్నాయిగనుక తప్పక దానినే ప్రథమ నవలగా అంగీకరించమంటారు. చింతామణి నవలల పోటీకి ఏర్పరచిన నిబంధనలన్నింటికి శ్రీ రంగరాజ చరిత్ర సరిపోతుంది గనుక దానిని ఒక ప్రమాణంగా అంగీకరించాలా ? లేక వీరేశలింగం పంతులుగారు తమ స్వీయ చరిత్రలో ఏనాడో స్పష్టంగా తెలుగున మొదటి వచన ప్రబంధము నేనే చేసితిని అని చెప్పిన మాటను ప్రమాణంగా స్వీకరించాలా? ఇక శ్రీ రామమోహన్‌గారు వీరేశలింగంగారు ఏర్పరచిన చింతామణి నిబంధనలనే చూపి వాటికి శ్రీ రంగరాజ చరిత్ర సరిపోయిందని తెలిపి తమ వాదాన్ని సమర్థించుకున్నారే తప్ప మరొక చారిత్రక ఆధారాన్ని చూపలేదు. అలా వారు చూపిఉంటే బాగుండేది. ఈ కొద్ది విమర్శలోనే తమ స్వంత అభిప్రాయాన్ని తెలియజేసినప్పుడు వేయి గ్రంథాలను పరామర్శ చేసి ఒక గ్రంథాన్ని వ్రాసినప్పుడు నాకు తోచిన అభిప్రాయాన్ని నేను చెప్పటంలో దోషం ఉండబోదనుకుంటాను. ఇక శ్రీ రామమోహన్‌గారి విమర్శవల్లనే 'తెలుగులో తొలినవల ఏది' అన్న విషయంలో స్పష్టంగా మూడు అభిప్రాయాలు ఉన్నవని తేలిందిగదా! అలాంటప్పుడు ఇంత స్పష్టంగా కనబడుతూ ఉంటేనే శ్రీ రామమోహన్‌గారు మా మూడు గ్రంథాలలో ఏది ముందో ఏది వెనుకో తేల్చిచెప్పలేక తాము తికమకపడి పరిశీలను ఇంత తికమక పెడుతున్నారే ? ఏ నాడో వెలువడ్డ శ్రీ కొక్కొండ, శ్రీ నరహరి, శ్రీ కందుకూరిగార్ల విషయంలో తమ వాదమే సరియైనదని శ్రీ నిడదవోలు వారు, నేను పొరపడ్డామని వ్రాస్తే అది యెంతవరకు అంగీకారయోగ్యమో ఆలోచించండి!

ఇక శ్రీ రామమోహన్‌గారు నా గ్రంథంలో 98–114; 150–160 పేజీలు అనవసరం అంటారు. ఈ పేజీలలో లోగడ నేను చెప్పినట్లు నా గ్రంథ ప్రణాళిక ననుసరించి, భారత దేశంలోను ఆంధ్రదేశంలోను జరిగిన పెక్కు ఉద్యమాలను వివరించి అవి ఏ ఏ తేదీలలో యెక్కడెక్కడ జరిగాయో క్లుప్తంగా అసలు ప్రకరణాలతో సంబంధంలేకుండా తెలియజేశాను. భావిచరిత్రకారులకు, పరిశోధకులకు అవి ఉపయోగించేలా ఆయా సంఘటనలు జరిగిన తేదీలు వివరించాను. వాటి ప్రభావంలో రచయితలు ఉత్తేజితులై రచించిన నవలల పేర్లు చెప్పక కేవలం వాటి విషయమే ప్రస్తావించి ఊరుకుంటే, జరిగిన ఉద్యమాల స్వరూప స్వభావాలు పరిశీలకు ఏలా విశదమౌతుంది ? విషయాన్ని గూడా "క్రొనలాజికల్ ఆర్డర్" లో వివరించాను. గాంధిమహాత్ముని ప్రభావం ఈ ఇరవయ్యో శతాబ్దంలో భారతదేశం నాలుగు మూలలలో చెలరేగిన యే ఉద్యమాలపైన ప్రసరించలేదో ఏవరైన చెప్పగలరా ? ఒక కవులను మాత్రమే ఆ ఉద్యమాలు ఆకర్షించాయా ? అవి కవితా వికాసానికి మాత్రమే దోహదం చేశాయా ? ఎంత విచిత్రం. ఆ మహాపురుషుడు నడిపిన ఉద్యమాలను ఆలంబనం చేసుకొని కవులు కావ్యాలు, నాటకకర్తలు నాటకాలు, గేయకవులు గేయాలు, నవలాకారులు నవలలు వ్రాశారు. ఇక శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణగారి "మాలపల్లి" నవల ఏ ప్రభావంతో తెలుగు నవలా ప్రపంచంలో ఆవిర్భవించినట్లు ? శ్రీ దామరాజు పుండరీకాక్షుడుగారు పెక్కు దేశభక్తి ప్రపూరితాలైన నాటకాలు వ్రాసి ప్రజలలో చైతన్యం కలిగించినట్లు ? బసవరాజు అప్పారావుగారు అమరగేయాలను సృష్టించారే ! ఇప్పటికి ఆ ప్రభావంతోనేగదా పెక్కు నవలలు వెలువడుతున్నాయి. కొడవటిగంటి వారి చదువు నవల 244 పేజీ, 1915–40 సంవత్సరాల మధ్య భారత దేశంలోను, ఆంధ్రదేశంలోను చెలరేగిన జాతీయోద్యమాల ప్రభావాన్ని సజీవంగా చిత్రించిన నవలే. అలాగే మహీధర రామమోహనరావుగారి కొల్లాయిగట్టితేనేమి నవల 322, 323 పేజీలు, 1921 మార్చి 31, ఏప్రిల్ 1 వ తేదీలలో విజయవాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటి సమావేశం నాటి నుండి 1947వ సం. లో

స్వాతంత్ర్యం సిద్ధించే వరకు గల కాలాన్ని చిత్రిస్తున్నదే. పాలగుమ్మి పద్మరాజుగారి రామరాజ్యానికి రహదారి 400, 401 పేజీలలో దాస్య శృంఖలాల విచ్ఛేదంకోసం భారతదేశమందలి ఇతర ప్రాంతపు స్వాతంత్ర్య ప్రియులకు యే విధంగాను తీసిపోని మన తెలుగు వీరుల సాహసోపేతమైన గాథలను చిత్రించే గొప్ప నవలే. ఇక శ్రీ రామమోహన్‌గారు చెప్పినట్లు ఆ కాలాన్ని కేవలం కవితోద్యమాలకే పరిమితం చేసిచూస్తే, బంకించంద్రుడు,శరచ్చంద్రుడు,రవీంద్రుడు,ప్రేంచంద్ మున్నగు అగ్రశ్రేణి రచయితల నవలల సంగతేమిటి ? ఏ ఉద్యమాలనైనా, కవులు, రచయితలు, నాటక కర్తలు ముందువెనుకలుగా తమ తమ అవకాశాలనుబట్టి, తాము ఆ ఉద్యమాల ప్రభావంతో పొందిన అనుభూతులనుబట్టి వాటిని ఆలంబనం చేసుకొని తమకు తోచిన ప్రక్రియలలో రచనలు చేస్తారన్న సంగతి సర్వ విదితమేగదా! 'ఫలానా ఉద్యమం రాజకీయవాదులకు పరిమితం; ఫలానా ఉద్యమం కవులకు పరిమితం; ఫలానా ఉద్యమాన్ని నవలాకారులు మాత్రమే స్వీకరించాలి' అని నిర్ణయం యెక్కడైనా ఉందా ?

160 వ పేజీలో నేను బసవరాజువారి గీతంలో ఒక మాటను తప్పుగా చూపినట్లు భారతి 62 వ పేజీలో చూపారు. అది పొరపాటు. మలి ముద్రణలో కృతజ్ఞతతో సవరించుకుంటాను.

కాల్పనికోద్యమ ప్రభావంతో తెలుగునాట నవలా సాహిత్య ప్రక్రియకు సుస్థిరతను చేకూర్చిన విశ్వనాథ, చలం, బాపిరాజుగారలను గురించిన విమర్శలు స్వల్పంగా ఉన్నాయి అంటారు శ్రీరామమోహన్‌గారు. పై ముగ్గురికి సంబంధించిన చర్చ 165 నుంచి 226 పేజీలలో చేశాను. అచ్చం విశ్వనాథవారిని గురించి నా గ్రంథంలో యెన్నో సందర్భాలలో వివరించాను. ఇక ప్రత్యేకంగా వారినిగురించి 166 నుంచి 184; 277 నుంచి 288; 525 నుంచి 527; 592 నుంచి 593 పేజీలలో వివరించాను. అంతేగాక ఆయా సందర్భాలలో విశ్వనాథ కాల్పనిక ప్రభావంతో ఉత్తేజితుడై, హైందవ సంస్కృతీ పునరుజ్జీవన స్రవంతిని తమ నవలలలో చిత్రిస్తూ వ్రాసిన ప్రముఖ నవలలను పేర్కొని మనోవైజ్ఞానికతా దృష్టితో, అతివాస్తవికతా దృక్పథంతో వెలువరించిన నవలలెన్నింటినో పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో ఆయన చూపిన భిన్నరీతులను తులనాత్మకంగా వివరించాను. ఇక విశ్వనాథ డెబ్భైకి పైబడిన నవలలను వ్రాశారు. వాటి నన్నిటిని ఈ సందర్భంలో విమర్శ చేయటం అంత ఔచిత్యం కాదేమో! అంతేగాక ఇది కేవలం విశ్వనాథ సమగ్ర నవలా స్రవంతిని వివరించే గ్రంథం గూడ కాదు. ఈ ప్రక్రియ పుట్టిన నాటినుండి నేటి వరకు వెలువడిన తెలుగు నవలా సాహిత్యాన్నంతటిని నేను సిద్ధపరచుకున్న పరిధిలో చెప్పదలచుకున్న శాస్త్రీయ గ్రంథం యిది. ఇక బాపిరాజు కళాతపస్వి. ఆయన భావుకుడైన ఒక మహాశిల్పివలె విశాలదృక్పథంతో తీర్చి తమ నవలలను తెలుగువారికందించాడు. దాదాపు ఆయన నవలలన్నింటిని పరామర్శించాను. మూడోవాడైన చలాన్ని గురించి మరొకచోట వివరిస్తాను.

261 నుంచి 273 పేజీలలో నేను తెలిపిన పరిస్థితులు, చెప్పిన మాటలు అనవసరం అంటారు వారు. పైగా ఆయా పరిస్థితులు నవలారచనకు దోహదం చెయ్యలేదంటారు. ఇదొక విచిత్రం. ఆయా సంఘటన లన్నీ రచయితల నెంతగానో ప్రభావితం చేశాయి. వాటన్నిటికి సమాధానాలు చెప్పటం కష్టం గనుక ఒకటి, రెండు ఉదాహరణలు తీసుకొని వివరిస్తాను. 1948వ సం. లో తెలంగాణా ప్రాంతంలో జరిగిన రజాకారు దౌర్జన్యాలకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య ప్రియులు వీరోచితమైన పోరాటాన్ని సాగించారు. దీనివల్ల ఇంటా బయటా గొప్ప సంచలనం చెలరేగింది. ఆ సందర్భంలో శ్రీవట్టికోట ఆళ్వారు స్వామిగారి "ప్రజల మనిషి" 314, 315, 316, 317, 318 పేజీలలోను, "గంగు" 318 నుంచి 322 పేజీలలోను వివరింపబడ్డాయి. ఇట్టిదే మరొక నవల శ్రీ దాశరథి రంగాచార్యుల "చిల్లర దేవుళ్లు" 415, 621 పేజీలలో వివరించబడింది. ఈ నవలలు రాష్ట్రంలోపల జరిగిన ఘోర దురంతాలను వివరిస్తే, సరిహద్దులుగా వున్న గుంటూరు, కృష్ణాజిల్లాలలో ఆనాడు తోటి సోదరుల బాధలను గురించి వెల్లువవలె అసంఖ్యాక ప్రజలు తమ ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని కాందిశీకులై వచ్చిపడ్డ కష్టాలను శ్రీ మహీధరరామమోహన్‌రావుగారు "మృత్యువునీడల్లో" 323, 324 పేజీలలోను, శ్రీ బొల్లిముంత శివరామకృష్ణగారి "మృత్యుంజయులు" 395 నుంచి 397 ల లోను వివరించాను. ఈ నవలలను చదివితే ఆ నాటి రచయితలు పొందిన ఆవేదన, తపన అర్ధమౌతుంది. ప్రజలు పడ్డ వర్ణనాతీతమైన బాధలు అర్ధమౌతాయి.

అదే సందర్భంలో శ్రీ రామమోహన్‌గారు 1962వ సం లో ఇండియాపైన చైనా దాడి, 1965లో పాకిస్తాన్ ఇండియాపైన దురాక్రమణ; 1971 లో బంగ్లాదేశ్‌పై పాకిస్తాన్ సలిపిన ఘోర యుద్ధం తెలుగు నవలలపైన ప్రభావాన్ని చూపలేదు ఆయా పరిస్థితులకు కవులు వుద్రేకపూరితులై కవితలు మాత్రమే సృష్టించారు అంటారు. పై దండయాత్రలు కవులను మాత్రమే ప్రభావితం చేశాయని, నవలాకారులను ఎంతమాత్రం ప్రభావితం చెయ్యలేదని

చెప్పటం సాహసంతో కూడినమాట. నా తెలుగు నవలా సాహిత్య వికాసంలోనే నా దృష్టికి వచ్చిన చైనా మన దేశం పైన జరిపిన దురాక్రమణ సందర్భంలో వెలువడిన కొన్ని నవలలను వివరించాను. చూడండి... శ్రీ వినుకొండ నాగరాజుగారు వ్రాసిన "నన్నుపిలిచింది" 360వ పేజి; శ్రీ మాధురిగారు వ్రాసిన "విముక్తి" 361వ పేజి; శ్రీ యర్రం చంద్రశేఖర్‌గారి "ఆనంద నిలయం" 373 వ పేజీలు చదివితే తెలుస్తుంది. ఇవి నవలలు కావా? వీరు నవలా రచయితలు గారా? ఇంతటి ఈ సువిశాల భారతదేశంలో మరెన్ని అనర్ఘరత్నాలు ఈ సమస్యపైన వెలువడ్డాయో ఎవరైనా చెప్పగలరా?

కొన్ని మహోద్యమాలు జరిగిన తేదీలు తెలిపాను. ఆయా ఉద్యమాలపైన ఏ ఏ భాషలలో ఏమేమి జరుగుతున్నదో అవి ఎంతటి ప్రభావాన్ని కలిగిస్తున్నవో ఊహించగలమా? భారతదేశం అంతటి సంగతి అలా వుంచి, ఒక్క ఆంధ్రదేశం సంగతే తీసుకుందాం. ఈ సువిశాల ఆంధ్రభూమిలో ఏ మూల ఏ చిన్న సంఘటనకు ఉత్తేజితులై ఎవరు ఏమి వ్రాశారో! ఏమి వ్రాస్తున్నారో? చెప్ప గలమా...? కనీసం ఊహించనైనా ఊహించగలమా! ఇంతవరకు తెలుగులో ముప్పై వేలకు పైబడ్డ నవలలు వెలువడ్డాయని పెద్దలు చెపుతున్నారే. వాటిలో ఏ ఏ మహత్తర ఇతివృత్తాలు చోటుచేసు కున్నాయో అవి ప్రజలపైన ఎంతటి ప్రభావాన్ని కలిగించాయో వివరించగలమా!

శ్రీ రామమోహన్‌గారు నా గ్రంథం కవరు పేజీ పైన "తెలుగు నవలా సాహిత్య వికాసము" అని స్పష్టంగా కనిపిస్తున్నదని చెప్పి లోపల పేజీలలో "నవలా వికాసము" అని మాత్రమే కనుపిస్తున్నదని అన్నారు. నా గ్రంథం లోపలి పేజీలలో 2వ పేజీనుండి 628 వ పేజీ వరకు ప్రతి పుట పైన స్పష్టంగా "తెలుగు నవలా వికాసము" అని ప్రింటుచేయబడి వుంది. వారు కనీసం దానినైనా చూడకుండానే "తెలుగు" అన్న పదాన్ని ఎగరగొట్టి (628 పేజీ లలో వరుసగా ఉన్నదాన్ని) "నవలా వికాసం" అని ఉన్నదంటారు. ఎంత విచిత్రం ఇది. వారు ఈ చిన్న విమర్శలో ఈ గ్రంథానికి పరస్పర విరుద్ధమైన మూడు పేర్లు పెట్టారు చూడండి... 60 వ పేజీలో శీర్షికపేరు "తెలుగు నవలా సాహిత్యం". 61 వ పేజీలో "తెలుగు సాహిత్యవికాసం". ఇక 63వపేజీలో "నవలావికాసం" ఈ మూడుపేర్లలో ఏ ఒక్కటైనా అట్టపై పేరుతోగాని, లోపలపేజీ లపై పేరుతోగాని కలవటంలేదు. జరిగిన పొరపాటు ఒకటైతే మరొక విషయాన్ని వారు ప్రస్తావించారు. పేరుమారిందికవరుపైన.లోపలిపేజీ లలో గాదు. "రామాయణం అంతా విని రామునికి సీత ఏం కావాలి" అని ప్రశ్నించినట్లుంది విమర్శ. నేను "నా వేదనము"లో జరిగిన కథంతా స్పష్టంగా వివరించాను.

శ్రీ రామమోహన్‌గారు అదే పేజీలో కొన్ని ముద్రణాదోషాలు దొర్లాయని చూపారు. తెలుగు గ్రంథాల ముద్రణలో సాధారణంగా జరిగే దోషాలే యివి. అయినా జరిగినదానికి చింతిస్తూ మరి ముద్ర ణలో తప్పక సవరించుకుంటాను.

అదే పేజీలో శ్రీ రామమోహన్‌గారు శ్రీ చలంగారిని గురించి నేను చేసిన విమర్శ బాగుందని అంగీకరిస్తూనే "చలం" భక్తులు దీనిని ఎంతవరకు అంగీకరిస్తారోనని తమ సంశయాన్ని వెలిబుచ్చారు. ఇది 62 వ పేజీలో తాము చెప్పినదానికి విరుద్ధం.

ఇక శ్రీ రామమోహన్‌గారిని దయతో నేను తెలిపిన సమా ధానాలను దృష్టిలోవుంచుకొని మరొకమారు నా తెలుగు నవలా సాహిత్య వికాసాన్ని పరామర్శించి చూడమని హృదయపూర్వకంగా మనవిచేస్తూ, పాఠకులను ఇందలి సత్యాసత్యాలను గ్రహించమని ప్రార్థిస్తూ ఈ చర్చను ముగిస్తున్నాను.

— శ్రీ పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు.

తెలుగువారు — గణపతి

ఆర్యా!

1975 అక్టోబరు భారతిలో శ్రీ నిడుదవోలు వెంకటరావు గారు గణపతికి తెలుగు వాఙ్మయంలో గల స్థానాన్ని సూచించారు కాబట్టి అతనిని తెలుగువా రేవిధంగా పెంచరో నేనీ వ్యాసంలో చూప దలచాను.

కొమ్ముమను తొండమున్ కఠిన కుంభయుగంబును నయ్యుమా కపో
లమ్ముల చారుకాంతి తొణకన్ వలిచన్నుల బోలె పుత్రకుం
డిమ్ముల తల్లిబోలి జనియించిన సంచిత భాగ్యవంతుడౌ
నమ్మ యటంచు సిద్ధసతు లక్కునజేర్చు గజాస్యు గొల్చెదన్.

ఈ పద్యం కన్నప్ప చరిత్ర లోనిది. తత్కర్త కంచిరాజా సన్నాయ్య క్రీ. శ. 1680 కి పూర్వుడని కవిచరిత్రకారుల మతం.

తెలుగు పడుచుల కపోలాలు గజ దంతాల వలె, కుచాలు గజ కుంభాలవలె, ఊరులు కరి కరాలవలె ఉంటాయి కాని గణపతిమాత్రం తల్లి కడుపున తెలుగు దేశంలో పుట్టలేదు.

కన్నప్ప అరవత్తు మూవురులో ఒకడు కాబట్టి ఆ కథను తెలుగులో వ్రాస్తున్న సూరయ్య తెలుగు తమిళ సంప్రదాయాలు గలిపి గణపతిని తల్లిని బోలిన కొడుకుగా పుట్టించటం ఎంతైనా సమంజసం.

అంకముజేరి శైలతనయాస్తనదుగ్ధము లానువేళ బా
ల్యాంకవిచేష్ట తొండమున నవ్వలిచన్గ బళింపబోయి యా
వంక కుచంబు గాన కహివల్లభహారము గాంచి వే మృణా
ళాంకురశంక నంటెడు గజాస్యుని గొల్తు నభీష్టసిద్ధికిన్.

మొదటి పద్యంలోని గణపతి పుట్టినపుడు చూడవచ్చిన సిద్ధ సతు లెత్తుకున్న గణపతి అనుకుంటె ఆంధ్ర కవితాపితామహుని ఈ గణపతి పాలుద్రాగే పిల్లకాయ.

పల్లా దుర్గయ్యగారు పెద్దనగారి కీ ఊహ కొండిపర్తి శాసనం చూసినమీద కలిగి ఉండొచ్చునని అభిప్రాయపడ్డారు. అది యిది:

దేయా ద్దేవో ద్విరదవదన: శర్మవ: శైశవేయ:
వాయం పాయం కరవివరత శ్చాపలాత్ పూత్కృతేన
అన్తస్తన్య ప్రభురపృషత్తై ర్వ్యాషయత్యంబికాయా:
స్వే మూర్ధన్యే ఇవ కుచయుగం మౌక్తికై ర్ముక్తదోష:

పెద్దనగారిపద్యం దీని కనువాదం కాకపోయినా రెండింటి లోని గణపతి మాత్రం పాలు త్రాగుతు త్రాగుతూ నడుమ పిల్ల చేష్ట చేసినవాడే.

"మంచము జేరి శంభుడు కుమారుని తొల్లెనుబెట్టి...."

పుదుక్కోట రాజు కోటిరఘునాథనాయకుని పార్వతీపరిణయం లోని ఈ పద్యాన్ని నిడుదవోలువా రుదహరించారు. తెలుగునాట పిల్లకాయ లందరికి పాలు మరచిన తరువాత "అప్ప" తినే అలవా టుంది. ఈ అలవాటు యిప్పుడు లేదుగాని ఈ గణపతి ఆయీాడు వాడు. కవి తమిళనాడువాడు కాబట్టి గణపతి చేతికి అప్పకు బదులు దోసె నిచ్చాడని నిడుదవోలువారే అన్నారు.

తెలుగు గణపతి తిండిపోతు విరుషకుడిలాగ. అందువల్ల "వెనకయ్య చేతికి వెసలిచ్చినట్టు" అనే జాతీయం ఏర్పడింది. అంటే దొంగకు తాళాలిచ్చినట్టని తాత్పర్యం.

తనుగని ఒక్కయెత్తునని దక్షజయున్ నిటలాక్షుడున్ ముదం
బున నిరుచెక్కులం గదిసి ముద్దుగొనంగ నొకింత నెమ్మొగం
బనువుగ వెన్కకున్ దిగిచి యత్నవిహీన పరస్పరస్యచుం
బనములు తల్లిదండ్రులకు నవ్వుగగూర్చు గజాస్యు నెన్నెదన్.

ఈ గణపతి తలిదండ్రికి ముద్దులిచ్చే ఈడువాడు. గణపతి హాస్య రసాధిదేవత. హాస్యం శృంగార జనితం కాబట్టి శృంగారమూర్తులైన పార్వతీ పరమేశ్వరులకు గణపతి పుట్టడం తాత్త్విక రహస్యం గావచ్చు. హాస్యాధి దేవతయైన ఈ బాల గణపతి తన చేష్టాహాస్యం ద్వారా తలిదండ్రిని శృంగారపు టంచులకు కొనిపోవటం అనూహ్యమైన కల్పన. అప్పకవియొక్క ఈ పద్యాన్నిగూడ నిడుదవోలువా రుదహరించారు.

జనక భుజద్వయాగ్రమున చక్కగ నిల్చి తదుత్తమాంగమం
దునగల వాహినీ విమలతోయములందన నీడ గాంచి నా
యనుజుని మీద బెట్టుకొనెనప్పయటంచును తల్లితోడ జె
ప్పిననగి బుజ్జగింపగను ప్రేమ జెలంగు గణేశు గొల్చెదన్.

ఈ పద్యం అలమేలు మంగా పరిణయం లోనిది. ఈ గణపతి తండ్రి భుజాలపై నెక్కి ఆడుతూ అమాయకపు మాటలచే నవ్వించే ఈడువాడు.

కనగనగంబు బొమ్మరముగా భుజగేంద్రుడు జాలెగా నమ
ర్చిన గిరిపుత్రి గాంచి యివి రెండును దేవధనంబులన్న న
జ్జనని హితోపదేశమున సన్మతి వాని పునఃప్రతిష్ఠ జే
సిన గణనాయకుండు కృపసేయుత సిద్ధన మంత్రి కోరికల్.

ఇది విక్రమార్క చరిత్రలోనిది. ఈ గణపతి బొంగరాలాడే

ఈడువాడు. అత డిపుడు హాస్యాధి దేవతగాదు. తలిదండ్రి మాట వినే వినయం గల బాలుడు.

దంతాఘట్టనరాజితాచలచలద్గౌరీ స్వయం గ్రాహమున్ ।
కంతుద్వేషికి జేర్చ శైలజకు తద్గంగాయురాశాంతి న
త్యంతామోదము మున్నుగానిడి కుమారాగ్రేసరుండై పితృ
స్వాంతంబుల్ వెలయింపజాలు యిభరాడ్వక్త్రున్ ప్రశంసించెదన్.

ఈ పద్యం వసు చరిత్రలోనిది. గణపతి యిక పెరిగిపోయాడు. అతనికి పితృస్వాంతాలు అలరింపజేసే ప్రౌఢత్వం వచ్చేసింది. కుమారాగ్రేసరుడైనాడు కాని కొన్నిటిలోమాత్రం అతడు వెనకయ్యేనట.

అరుదుగ వామభాగ లలనా కలనా చలనాత్ముడైన యా
హరుగురు గాంచి తానును తదాకృతి యేగతి నేకదంతుడై
కరి కరిణీగుణంబులు మొగంబున దాల్చి జకంబులేలు నాం
తర కరుణాసనాథు గణనాథు మరుద్గణనాథు గొల్చెదన్.

ఇది నరస భూపాలీయం లోనిది. దీనికి నిడుదవోలువారు మూలంగూడా చూపారు. వినాయకుని పెండ్లికి వేయి విఘ్నాలని సామెత. అందరి పనులకు విఘ్నాలు కల్పించే అతనికే విఘ్నాలుకల్గటం చిత్రం. దానికి సార్థకతాలన్నట్లు ఎందరి పరిణయ కావ్యాలు పుట్టినా వినాయకుని పరిణయ కావ్యాలు పుట్టినట్లు లేదు. వినాయకునికి ఒక్కరు గారు యిద్దరు భార్య లున్నారుగాని వారు 'శిల్పాల్లోతప్ప కావ్య ప్రపంచంలో కనిపిస్తున్నట్లు లేదు. అందువల్ల ఈగొడవంతా ఎందుకని ఈ పద్యంలో తానే స్త్రీ పుం రూపాలు రెండు ధరించాడు.

లను వసితాంబుదంబు సితదంతయుగంబ చిరాంశు లాత్మగ
ర్జన మురుగర్జనంబుగ సరద్రుచి శక్రశరాసనంబునై
చనమద వారి వృష్టిహిత సస్యసమృద్ధిగ నభ్రవేళ నా
జనుగణనాథుడిచ్చు ననిశంబు నభీష్ట ఫలంబు మాకిలన్.

ఈ పద్యం కుమార సంభవంలోనిది. ఈ గణపతి అభీష్టప్రదుడు. కాలక్రమంగా గాకపోయినా ఈ పద్యాలనుబట్టి చూస్తే తెలుగువారు గణపతిని క్రమంగా పెంచి పెద్దవానినిజేసి సేవించారని చెప్పాలి. అందువల్ల నిడుదవోలువా రన్నట్లు గణపతిని గురించి విస్తరిల్లిన వాఙ్మయాన్ని శోధిస్తే ఇంకా అందలి విశేషాలు బయలుపడే అవకాశం ఉంది.

— *కపిలవాయి లింగమూర్తి.*



గ్రంథ విమర్శలు

టాలెంటెడ్ ఛయిల్డ్

[బిల్డర్స్ మంత్లీ, ఎడిటర్ ఎల్. ఎస్. బాల్మి, చెయిల్డ్ రాకెట్స్ క్లబ్, రెడ్‌హిల్స్, హైదరాబాదు, వెల తెలియదు.]

శ్రీ బాల్మి సంపాదకత్వం కింద నడుస్తున్న ఈ పత్రికలో చక్కగ అచ్చులయిన ఎన్నో రంగుల బొమ్మలు కనిపిస్తాయి. అన్నీ పిల్లలు వేసినవి. చిత్రాలు వేసినవారిని గురించి ప్రచారం ఎంతో కూడా లభించింది.

(ఊ. ప.)

త్యాగఫలితం

[(పిల్లల కథలు) రచన: శ్రీ నరిశేపల్లి లక్ష్మీనారాయణ, బి. ఏ; గోపన్నవీధి, గుంతకల్లు—2. (ఆం. ప్ర.) గ్రాసు 58 పుటలు, వెల 2 రూ. ప్రతులకు గ్రంధకర్తకు వ్రాయవలెను.]

'ఆనాటి వేదయుగంనుండి ఈనాటి వేగయుగం వరకు కథలు అంటే అందరికీ ఇష్టమే. వయోభేదం నిమిత్తం లేకుండా ప్రతి యొక్కరికీ కథలమీద మోజుండటం రివాజు' అని గ్రంథకర్త 'రెండు మాటలు.' వారిమాట అక్షరాలా నిజం. ఆబాలవృద్ధం కథలంటే చెవులు కోసుకుంటారు. మంచి కథలను ప్రకటిస్తున్న పత్ర, వార, మాస పత్రికలే ఎక్కువ ప్రచారంలో ఉంటున్న విషయం అందరికీ తెలుసును.

మన పురాణేతిహాసాలలో ఉండే కథలూ, పెద్దలు చెప్పే కథలు వినడానికి ఇంపుగా వుండడమే కాకుండా నీతిని బోధిస్తూ ఉంటాయి. ఇప్పటికాలంలో అలాటివి చాలా తక్కువ. పత్రికలలో వచ్చే కథలూ, పుస్తకరూపాన్ని పొందే కథలూ చాలావరకూ కాలక్షేపానికి ఉపయోగించేవే, వాటిలో సాంఘిక పరిస్థితులే తరచు చిత్రించ బడుతూ ఉంటాయి.

ఇప్పటి పరిస్థితులనుబట్టి పిల్లలకు నీతులు మనస్సుకు హత్తేటట్లు తెలియడం ఎంతో అవసరం. కథల మూలంగా చెప్పి నప్పుడే అవి తలకెక్కుతాయి. అరుదుగా వెలువడుతున్న పిల్లల కథల పుస్తకాలలో ఈ 'త్యాగఫలితం' ఎన్నదగినది.

ఇందులో 'త్యాగఫలితం' మొదలైన పధ్నాలుగు కథలున్నవి. వాటిలో త్యాగం, ధర్మం, జ్ఞానం, బుద్ధిబలం, దైవభక్తి, స్వామి భక్తి మొదలైన విషయాలను బోధించబడుతూ ఉన్నవి. చాలా కథలు తెలుగుదేశంలోని గ్రామీణులకు సంబంధించి ఉన్నట్లు చెప్పడం ఒక విశేషం. రచన పిల్లలకు కూడా అర్థమైన రీతిని సులభమైన వాడుక భాషలో సాగింది.

రచయిత "ఇవి పిల్లల కథలు. అంటే పెద్దలు చదవకూడ దనికాదు. పిల్లలకు నిర్దేశింపబడిన ఈ కథలను పెద్దలు విధిగా చదవాలి" అని అంటున్నారు. అవును. చదవవలసినదే! పెద్దలు చదివితేనే వారు పిల్లలకు చక్కగా బోధించడం సాధ్యపడుతుంది.

ఇలాంటి కథలను ఇంకా వ్రాయడానికి లక్ష్మీనారాయణగారికి తగిన ప్రోత్సాహం లభిస్తుందని ఆశిస్తున్నాను.

జైమిని భారతం

[సంస్కృతమూలానికి శ్రీ అనంతం ఆంధ్రవచనానువాదం. డెమ్మీసైజు. పుటలు 16+66+512. వెల 25 రూ. ప్రకాశకులు—శారదప్రచురణలు, 3/3 అరండల్‌పేట, గుంటూరు.]

వ్యాసమహాముని తన శిష్యులందరికీ ఇతర విషయాలతోపాటు మహాభారతాన్ని ఉపదేశించాడు. ఆ శిష్యులు దానిని తమకు తోచిన పద్ధతులలో ప్రచారం చేశారు. అందువల్ల వేర్వేరు భారతాలు తయా రయే అవకాశం ఏర్పడింది. ఇతరుల భారతాల సంగతి తెలియదు కాని, జైమిని ముని రచించిన భారతం మాత్రం ఉపలబ్ధమయింది. అందులో అశ్వమేధపర్వం మాత్రమే లభించింది. దేశవ్యాప్తంగా లభించిన ప్రతు లన్నిటిలోనూ ఒక్క అశ్వమేధపర్వమే ఉండడంవల్ల

జైమినిముని అశ్వమేధపర్వాన్ని మాత్రమే వ్రాసినట్టు చాలామంది అభిప్రాయపడ్డారు. అందువల్ల 'జైమిని భారతం' అంటే అశ్వమేధ పర్వమనే ప్రచారంకూడా వచ్చింది.

మహాభారతానికి కవిత్రయంవారి అనువాదం వచ్చినట్లు ఈ బృహద్గ్రంథానికి తొలుత పిల్లలమర్రి పినవీరభద్రకవి పద్యానువాదం, తర్వాత సముఖం—వెంకటకృష్ణప్పనాయకుని గద్యానువాదం వచ్చాయి. అవి చాలా సంగ్రహరూపాలయినట్లు ఉపలబ్ధమైన సంస్కృత మూలాన్నిబట్టీ, ఈ యథామూలానువాదాన్నిబట్టీ తెలుస్తున్నది. అనువక్త అనంతంగారు (ఏలూరిపాటి అనంత రామయ్యగారు) గోరఖ్‌పూరు గీతాప్రెస్‌వారు ఎప్పుడో ప్రకటించిన సంస్కృతమూల హిందీ అనువాదాలనూ, కల్యాణ్ — లక్ష్మీ వేంకటేశ్వర ప్రెస్‌వారి ప్రతులనూ సంపాదించి, సమగ్రంగా పరిశీలించి యథామూలంగా అనువదించారు.

అనువక్త "ముందు చదువవలసిన ముఖ్య విషయాలు" అనే తమ సుదీర్ఘ పీఠికలో తమ అనువాదాన్ని గురించి ఇలా తెలుపుతున్నారు:

"మూలంలో వున్న ఒక్క పదాన్నికూడా విడువలేదు. అక్కడ లేనిది ఒక్క పదంకూడా తెచ్చిపెట్టలేదు. ఉన్నదున్నట్లు అనువదించటం జరిగింది. కథాసరిత్సాగరకారుడు చెప్పినట్లు మూలం [illegible] వుంటే ఇది అలా ఉంటుంది. కొంచెమూ అతిక్రమణం లేదు.

ఎక్కడయినా మూలంలోవున్న పదాలు అనువాదాలకు అధికంగా [illegible]వలసివస్తే అది కుండలీకరణాలలో ఉన్న మాటలన్నీ మూలంలో లేనివని అనువక్తవని గ్రహించాలి."

దీనినిబట్టి అనువాదం చేసేటప్పుడు ఎట్టి శ్రద్ధ తీసికోవలసివది [illegible]. తెలుగులో యథా మూలానువాదాలు ఎన్నో వున్నా, వాటి విషయంలో ఇట్టి శ్రద్ధ తీసికొనబడినట్లు కానరాదు.

ఈ అనువాదం సర్వజన గ్రాహ్యంగా [illegible] వ్యావహారిక భాషలో వుండటం మెచ్చదగింది. ఏ భాగం ఏ శ్లోకానికి అనువాదమో తెలుసుకొనుటకు దాని ప్రక్క శ్లోకసంఖ్య ఇవ్వబడింది. ఇది [illegible] ఎంతో ఉపయుక్తమైనది.

ఈ వచన రచన తొలుత ఎలా ప్రారంభమైనదీ, తరువాత ఎలా యథామూలానువాదంగా పరిణమించినదీ అనువక్త తమ పీఠికలో వివరించారు. ఆ పీఠికను బట్టి [illegible]

అపారమైన కృషి, ముద్రణ విషయమై పడిన శ్రమ రచయితః మార్గదర్శకంగా వున్నది.

పిల్లలమర్రి పినవీరభద్రకవి పద్యానువాదాన్ని గురించి కీ. శే. వేకుమళ్ల అచ్యుతరావుగారు వ్రాస్తూ—జైమిని అర్వాచీనకవియనీ, అతడు అశ్వమేధ పర్వాన్ని మాత్రమే రచించాడనీ, అతని కవిత ప్రశస్తమైనది కాదనీ తమకు తోచిన విధంగా వ్రాశారు. ఆయన అభిప్రాయా లీ పీఠికలో విమర్శింపబడినవి. జైమిని భారతకర్త ప్రాచీనుడైన వ్యాసశిష్యుడే అనీ, అతడు భారతాన్ని సమగ్రంగానే రచించాడనీ, కవిత ప్రశస్తమైనదే అనీ సప్రమాణంగా ఇందు సమర్థింపబడింది.

ఇంతే కాకుండా జైమినిమునినిగురించిన విషయాలు, జైమిని భారత రచనాకాలం, భాగవత ప్రాచీనత వ్యాస భారతంలో లేని అంశాలు శ్రీరామాశ్వమేధ, యుధిష్ఠిరాశ్వమేధాల తులనాత్మక పరిశీలన కుశలవోపాఖ్యానం, సామ్యభేదాలు, భేదకారణాలు, వ్యాస భారతంలో మాత్రమే ఉన్నవిషయాలు, జైమిని భారతంలో మాత్రమే ఉన్న విషయాలు, ఉభయత్రా ఉన్నవి. వైవిధ్య కారణ ప్రదర్శనాలు, వర్ణన, భావ, ఉక్తి వైచిత్ర్యాలు, ధర్మజాదుల పాత్ర చిత్రణ, ఇతర విశేషాలు, గ్రంథ విశిష్టత మున్నగు విషయాలు పీఠికలో వివరించబడినవి. గీతాప్రెస్‌వారి గ్రంథంలో ఉండే చిత్రాలు కూడా ఇందు చేర్చబడినవి. గ్రంథాదిని శ్రీ కంచి కామకోటి పీఠాధీశ్వరులు, శ్రీ లక్ష్మణ యతీంద్రులు ఇచ్చిన ఆశీస్సులు చేర్చబడినవి. వివిధ శీర్షికలతో అరవైయెనిమిది అధ్యాయాల పరిమితి గల ఈ గ్రంథంచివర తొమ్మిది అనుబంధాలు ఈయబడినవి. వాటిలో వరుసగా — అందరూ జ్ఞప్తిలో ఉంచుకోదగిన జైమినీయ సూక్తి ముక్తావళి, దాని అకారాది విషయసూచిక, రచయిత సంగ్రహజీవిత చరిత్ర, ఆయన రచనలు, ఆ రచనలను గురించిన అభిప్రాయాలు, సవరణలు, వారి శారద ప్రచురణలకు తోడ్పడినవారు, వేదోక్తమైన వార్షిక గురించిన వివరణకలదు.

ఆంధ్రులు ఈ ఉత్తమ గ్రంథాన్ని ఆదరించి, అనువక్తకు తగిన ప్రోత్సాహం ఇవ్వగలరని భావిస్తున్నాను. ఇట్టి ఉత్తమ గ్రంథాన్ని రచించిన శ్రీ అనంతరామయ్యగారు అభినందనీయులు.

—శ్రీ బులుసు వేంకటరమణయ్య.

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna, Vijayawada. Phones: 75667 & 75226.